
ఆంధ్రపత్రిక
సచిత్ర వార పత్రిక
4 అణాలు
ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY



బడిదొంగ

ఫొటో: కె. చంద్రశేఖర్ — బందరు

సంవత్సర చందా
రు 12-0-0
విడిప్రతిక 4 అ

# ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

**Founder K NAGESWARA RAO**

సంపుటము 40
సంచిక 26
**29.2-56**

మన్మథ మాఘ బహుళ చతుర్థీ బుధవారం



భారతదేశం పర్యటించవచ్చిన ఇరాన్ రాజదంపతులు రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్‌ను రాష్ట్రపతి భవనంలో ఫిబ్రవరి 16 న కలుసుకున్నప్పటి చిత్రం.

# విషయానుక్రమణిక

ముఖ చిత్రం !

ఎ. వి. ఎమ్. వారి "నాగులచవితి"లో జమున.



గమనిక.

[illegible]

[illegible]

# న్యూఢిల్లీ లేఖ

అమృత్‌సర్ కాంగ్రెస్ మహాసభ, భారత పార్లమెంటులో రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ ఉపన్యాసం, ఇరాన్ రాజు ఆగమనం - ఇవి ఇటీవల న్యూఢిల్లీ రాజకీయాలలో చైతన్యం కలిగించిన విశేషాలు.

ముందు ఇరాన్ రాజు ఆగమనంతో మొదలు పెడదాం. ఇటీవల న్యూఢిల్లీకి ఎడ తెగకుండా పలువురు రాజ్యాధిపతులు, ప్రభుత్వాధినేతలు, ప్రధానమంత్రులు, విదేశాంగ మంత్రులు వచ్చారు.

మహాత్మాగాంధీ జీవితచరిత్రలో ఆఖరు సంపుటంకూడా ఈ మధ్యనే వెలువడింది. అందుచేత గాంధీజీ ఈ రోజున జీవించే ఉంటే ఆయన ఏమని భావించేవారో ఊహించడంలో అసహజమేమీ లేదు.

వేల్సు యువరాజు భారతదేశం వచ్చినప్పుడు ఆయన ఆగమనానికి అసమ్మతి తెలుపుతూ గాంధీజీ భారతీయులకు సందేశం ఇచ్చారు. బ్రిటిష్ వారిపై అయిష్టాన్ని తెలపడానికే కాకుండా, భారతదేశ దారిద్ర్యాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని గాంధీజీ ఆ సందేశం ఇచ్చారు. వేల్సు యువరాజుకు ఆతిథ్యం నెరపలేని బీదస్థితిలో ఉన్నది భారతదేశమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇప్పుడు వరసగా భారతదేశానికి వస్తున్న ప్రముఖ అతిథుల విషయంలో గాంధీజీ ఏమని అభిప్రాయపడేవారో ఊహించుకోవలసినదే.

ఇరాన్ రాజు ఆగమనం మరో ప్రశ్నకు కూడా తావిస్తున్నది. సౌదీ అరేబియా రాజుకు ఆతిథ్యం ఇచ్చినట్లే, ఇరాన్ రాజుకు కూడా ఆతిథ్యం ఇవ్వడానికి జమైయత్ - ఉల్ - ఉలేమా - ఇ - హింద్ వారికి అనుమతి ఇవ్వబడింది. కుల, మత, రాష్ట్రీయ తత్వాలను తెగనాడిన అమృత్‌సర్ కాంగ్రెస్ మహాసభ అనంతరం ఇరాన్ రాజు మనదేశం వచ్చారు. జమైయత్ సంఘం మతాతీతసంఘమా అనేది ప్రశ్న. ఈ సంఘంలో ముస్లిమేతరులకే కాక, సామాన్య ముస్లిములకుకూడా సభ్యత్వం లేదు. అది ముస్లిమ్ ముల్లాల సంఘం. ఈ సంఘం ప్రచురించే పత్రికలనుండి కొన్ని భాగాలు తీసుకుని పాకిస్తాన్ పత్రికలు అప్పుడప్పుడు పునర్ముద్రించడం కూడా జరుగుతోంది.

ఈ సంఘ సభ్యులు జాతీయ ముస్లిములనీ, వీరు కాంగ్రెసు వారితోపాటు జైళ్లకు వెళ్లారనీ ఒక వాదం. అయినా అది మత సంఘమనేది నిర్వివాదాంశం. అది పాకిస్తాన్‌కు వ్యతిరేకమైనకూడా ఉండవచ్చును. అసలు ప్రశ్న ఏమిటంటే నేపాల్ హిందూ రాజు వచ్చినప్పుడు హిందూమత సంఘాలకు అతిథ్యపు అనుమతిని మన ప్రభుత్వం ఇచ్చివుండేదా అని.

* * *

రాష్ట్రపతి పార్లమెంటు ఉపన్యాసం ప్రభుత్వ విధానాలను వెల్లడించే నివేదిక వంటిది. కనుక ఆ ఉపన్యాసం రాష్ట్రపతి కోసంగాను ప్రభుత్వం రచించినదన వచ్చును. రాష్ట్రపతి ఉపన్యాసాన్ని ఆమోదించడమంటే ప్రభుత్వంలో విశ్వాసాన్ని ప్రకటించడమన్నమాటే.

అందుచేతనే ఆ ఉపన్యాసం సమగ్రంగా లేదనవలసి వస్తోంది. వైదేశిక వ్యవహారాలలోనే ఆ ఉపన్యాసమంతా నిండిపోయింది.

వైదేశిక విధానాల విషయంలో పార్లమెంటు ఆమోదం పొందడానికి ప్రభుత్వం పడుతున్న తహతహ అంతా అందులో వెల్లడి అవుతోంది. లేకపోతే మొత్తం 28 పేరాలలోనూ 14 పేరాలు వైదేశిక వ్యవహారాలకు ఎందుకు కేటాయించారు? దేశంలోని వ్యవహారాలకు అంత ప్రాధాన్యం ఇవ్వకుండా, ఇతరదేశాల వ్యవహారాలకు బాగా ప్రాధాన్యం ఇవ్వడం ఏ ప్రజాస్వామిక దేశంలోనైనా ఉందా? ఇండో చైనా, లావోస్, కంబోడియా, చైనా విషయాలలో భారతీయులకు నిజంగా అంత ఆసక్తి ఉన్నదా? మన దేశ వ్యవహారాలలో ఇంకా ఎక్కువ ఆసక్తి చూపవలసిన అవసరం లేదా?

ద్వితీయ పంచవర్ష ప్రణాళిక సంగ్రహముసాయిదా ఇటీవల ప్రకటితమై కొన్ని సమస్యలు లేవదీసింది. అవసరమైన డబ్బు లేకుండానే ముసాయిదా మాత్రం వెలువడింది. జేబులో 350 కోట్ల రూ. మాత్రం ఉంచుకొని భారతదేశం 4800 కోట్ల రూ. ఖర్చు తలపెట్టిందని ఈ ప్రణాళిక వెల్లడిస్తోంది. ఈ ఖర్చు ప్రణాళికకూడా అసమగ్రంగానే ఉంది. వెల్లడి చేయబడని ఖర్చులు ఇంకా చాలా ఉన్నాయి.

శ్రీ కృష్ణ

(ఆంధ్రపత్రిక విలేఖరి)



ఈ నెల 19 వ తేదీన ఈరోడ్ పట్టణంలో కీర్తిశేషులైన ప్రముఖ దేశభక్తుడు, విద్యావేత్త, ప్రజాసోషలిస్టుపార్టీ అధ్యక్షుడు శ్రీ ఆచార్య నరేంద్రదేవ్.

---

ఒక విందు జరుగుతోంది. పెద్ద విందు. ఒక నటుడు, ఒక బ్యాంకరూ పక్క పక్కన కూర్చున్నారు. పొత్తుకలసి మాటా మంతీ సాగింది.

"ఏమిటో నండీ. బొత్తిగా తీరుబడే ఉండదు. సినిమా అనేది చూసి రెండేళ్ళు కావస్తోంది. చెప్పుకుంటే సిగ్గు కూడా" అన్నాడు బ్యాంకరు.

"దాని కేముంది లెండీ. నేను బ్యాంకులో కాలుపెట్టి రెండు కాదు మూడేళ్ళవుతోంది." అన్నాడు నటుడు నవ్వుతూ.

## వంచనా శిల్పం

నలుగురు మిత్రులు తాగుతూ కబుర్లాడుకుంటున్నారు.

నువ్వు ఓ రూపాయి బల్ల మీద పెట్టి దానిమీద కప్పు బోర్లించు. నేను కప్పు ముట్టుకోకుండా రూపాయి తీసుకుంటా. కాస్కో మరి పందెం అన్నాడు వంచనాశిల్పి. పందెం కాసిన మిత్రుడు సరేనని రూపాయి పెట్టి దానిమీద కప్పు బోర్లించాడు.

శిల్పి హాంఫట్ మహంకాళీ అన్నాడు; ఆ పైన ఆ బల్ల మీద మూడుసార్లు కొట్టాడు. బల్ల అడుగున మూడు సార్లు కొట్టాడు. అమాంతం గుప్పిడి విప్పాడు చేతిలో రూపాయి ఉంది.

పందెం కాసిన మిత్రుడు విస్తుపోయినా, నమ్మకం కుదరక బల్లమీద రూపాయుందో లేదో చూద్దామని కప్పు పైకెత్తాడు.

శిల్పి అమాంతం బల్లమీది రూపాయి తీసి జేబులో వేసుకుని "చూశావా" అన్నాడు.

## ★ న్యూఢిల్లీ లేఖ ★

(అంకెలు కోట్లలో)

| | | |
|---|---|---|
| 1. రైల్వేశాఖ కావాలని కోరినధనం | | 300 |
| 2 వాణిజ్యశాఖ కోరినది | — | 50 |
| 3. అణుశక్తిశాఖ కోరినది | — | 35 |
| 4. రక్షణశాఖ కోరినది | — | 350 |
| 5. నందా గారి అంబర్ చర్ఖాకు | — | 200 |
| 6. శ్రీమన్ నారాయణ్ గారి మద్యనిషేధ శాఖకు | — | 325 |
| మొత్తం రూ. 1260 కోట్లు | | |

ఇంకా మౌలానా అజాద్ గారి విద్యాశాఖ, రెడ్డిగారి ఖనిజోత్పత్తి శాఖ పండిట్ మాలవీయగారి సహజ సంపదలశాఖ కోరిన మొత్తాలు అలాగే ఉన్నాయి. ఇదీ ప్రణాళిక వ్యవహారం!

అమృత్ సర్ మహాసభలో కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ ధేబర్ ఉపన్యసిస్తూ "బ్రిటిష్‌వారు వెళ్లిపోతూ మనదేశంలో వదిలిపెట్టిన శాంతి భద్రతల వ్యవస్థ కేవలం శుష్కమైనదే తప్ప నికరమైనది కాదు. బ్రిటిష్‌వారి రాజకీయ వ్యవస్థ భారతదేశంలోనూ, ప్రజా జీవితంలోనూ వేళ్లు పాదుకోనలేదు. వారు మనకు నేర్పిన సాంఘిక దృక్పథం పలన విధానానికి, బూర్జువా విధానానికి మాత్రమే తగినది. వారి విద్యావిధానం గుమాస్తా ఉద్యోగాలకు తప్ప మరిదేనికీ పనికిరాదు. వారి ఆర్థిక విధానం వల్ల లాభాలు, స్వీయ ప్రయోజనాలు, దోపిడి మనస్తత్వం మాత్రమే మిగిలింది" అని ఘాటుగా విమర్శించారు.

శ్రీ ధేబర్ బ్రిటిష్ పరిపాలనా విధానాన్ని చీల్చి చెండాడడం బాగానే ఉంది. బ్రిటిష్ రాజకీయ వ్యవస్థ మనదేశంలో వేళ్లు పాదుకోనలేదనడం నూటికి నూరుపాళ్లు సత్యమే. బ్రిటిష్ రాజకీయ వ్యవస్థను వెస్ట్ మినిస్టర్ బ్రాండ్ పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అనవచ్చు. రష్యన్ బ్రాండ్ ప్రజాస్వామ్యానికి, కులతత్వ ప్రాతిపదికపై నిలిచిన భారతీయ ప్రజాస్వామ్యానికి అది వ్యతిరేకమైనది. అటువంటి ప్రజాస్వామ్యానికి మనదేశంలో వేళ్లు లేవనడం సబబే.

అయితే ఇప్పుడు శ్రీ ధేబర్ వి కాంగ్రెసుకు అధ్యక్షుడుగా ఉన్నారో ఆ కాంగ్రెసే మన రాజ్యాంగాన్ని ఏర్పరచింది. మన ప్రజా జీవితంలో వేళ్లూనిన పద్ధతిలో నే రాజ్యాంగాన్ని నిర్మించడానికి కాంగ్రెసుకు సంపూర్ణాధికారం ఉన్నది. అయినా బ్రిటిష్ పద్ధతి రాజ్యాంగాన్ని కాంగ్రెసు ఎందుచేత ఏర్పాటు చేసింది మరి?

రెండోది. కాంగ్రెసుపార్టీ 1947 ఆగస్టు 15 నుండి అవిచ్ఛిన్నంగా అధికారంలో ఉంటూ వచ్చింది. మరి బ్రిటిష్ రాజకీయ, సాంఘిక, ఆర్థిక, విద్యా విధానాలను మన దేశానికి తగినట్లుగా ఎందుకు మార్పుచెయ్య లేకపోయింది? ఒక సమాధాన మేమంటే, అసలు ఉద్యోగాలు లేకపోవడంకంటె గుమాస్తా ఉద్యోగాలైనా మేలుగే. అదీగాక భారత ప్రధానికి భారతీయ రాజకీయ వ్యవస్థపై ఉన్న అభిప్రాయం వేరు. బ్రిటిష్ పత్రిక "ఎన్‌కౌంటర్"లో పెరిగ్రిన్ వర్స్థార్న్ అనే ఆయన ఒక మంచి వ్యాసం వ్రాశాడు. అందులోంచి ఒక భాగం ఇక్కడ ఉల్లేఖిస్తాను.

"ఇండియాలో ఉన్న ఒక సుగుణం ఏమిటంటే, ఇండియా పరిపాలకుడు కులీనుడైన మితవాది. తాను కులీన మితవాదిననే విషయం ఆయన దాచుకోడు కూడాను. హారో విశ్వ విద్యాలయంలో విద్య నభ్యసించిన శ్రీ నెహ్రూకు ప్రజాస్వామ్యాన్ని గూర్చి వెర్రి వెర్రి ఊహాలేమీ లేవు. ప్రజల అభిప్రాయాన్నే తాను వెల్లడిస్తున్నాననే భ్రమ ఆయనకు లేదు. అలాగని ఆయన చెప్పడు. ఇంగ్లండులో తాను నేర్చిన మితవాద సిద్ధాంతాల ననుసరించి పరిపాలించడానికే ఆయన ప్రయత్నిస్తాడు. ఆయన మితవాదియే గాని ప్రజాస్వామ్యవాది కాడు. నిజంగా ఆయన ప్రజా స్వామ్యవాది కాడు కనుకనే ఆయన ఆసియాలో ప్రజాస్వామ్యానికి రక్షకుడైనాడు. ఇది స్వయం విరుద్ధమైన వాక్యంగా కనిపించవచ్చు. కాని నిజానికి ఆంగ్లో అమెరికన్ మార్కున్న ప్రజాస్వామ్యమే అటువంటిది. ప్రజాస్వామ్యం ఒక సిద్ధాంతం కాదు. అందుచేతనే దానిని ఇతరులకు బోధించ లేము ఇతర దేశాలకు ఎగుమతి చేయలేము అలా బోధించదలచుకోవడం వల్లనే ఈతరంలోని ఆసియా వాసులకు మనం బోలెడు అపకారం చేసిన వాళ్ళమయ్యాము. కిందటి శతాబ్దపు మితవాద నాయకులను అనుకరించమని చెప్పాల్సింది పోయి, నేటి పాశ్చాత్య ప్రజాస్వామిక వాదులను అనుకరించమని చెప్పాము. ఇప్పుడు మితవాద నాయకత్వం బలపడితేనే రేపు ప్రజాస్వామ్యం ఏర్పడుతుందని చెప్పడానికి బదులు ప్రజాస్వామ్యాన్ని వారికి అంటగట్టి జాశాము." ★

## కలవరపడు స్త్రీలకు!



"కుమారి" (మాత్రలు) మరువకండి మీ ఆరోగ్యం రక్షించును. చింత అనవసరం

వెల (సాదా) రు. 3/-
(స్పెషల్) 5/-
(ఎక్స్ట్రా స్పెషల్) 8/-
పోస్టేజి ప్యాకింగ్ ప్రత్యేకం

Mrs P Devee, F.D.S. (AP) Calcutta-40.
స్టాకిస్టు: Indo Medical supplies
No. 3, Paul iappan st, Seven wells
Madras - 1.

# దేవదాసి

## ప్రాచీన గాథాలహరి

**పి. గణపతి శాస్త్రి**

(గతసంచిక తరువాయి)

### 3

తరవాత నాలుగైదురోజులలోను కమల విజయవర్మకు కేవలం తాంబూలకరండక వాహిగా వ్యవహరించింది. ఆ యిదవ నాటితో నృత్యోత్సవం ముగిసిపోయింది. ఆనాడు కార్తీక పౌర్ణమి. విజయవర్మకిక తప్పించుకోడానికి మార్గమేమీ గోచరించ లేదు.

సాయంత్రం బాగా చీకటిపడినతరవాత వకుళమాలిక గృహానికి తరలిపోయాడు. అత డక్కడికి వెళ్ళేసరికి వకుళమాలిక, ఆమె చెలికత్తెలు వీణావేణుమృదంగాల శ్రుతులు సరిజేసుకొని అతనికోసం ఎదురుచూస్తున్నారు. విజయవర్మ భవంతిద్వారంలోనికి రాగానే వకుళమాలిక స్వయంగా ఎదురేగి అతనిని లోపలికి తోడుకుపోయింది. విజయవర్మ కొంచెంసేపు విశ్రమించి ఇష్టాగోష్ఠిలో వకుళమాలిక వీణావాద్యాల సంప్రదాయాలు వారి విద్వత్తు మొదలైన విశేషాలడిగి తెలుసుకొన్నాడు. కమల యథాప్రకారంగా అతని సరసనకూర్చుని అవసరమైనప్పుడలాగే కర్పూర తాంబూలాలందిచ్చింది.

పిమ్మట కొంతసేపటికి వీణావాద్యం ప్రారంభమైనది.

వకుళమాలికకు పార్శ్వాలలో కూర్చున్న ఇద్దరు యువతులు వీణకు వేణుమృదంగాల శ్రుతి లయలు సమకూర్చారు. వారిప్రక్కనే అమర్చిన బంగారు నర్తకీ ప్రతిమ నోటిలోనించి బయలుదేరిన సన్నని అగరు ధూమమాలిక క్రమంగా ఆ ప్రదేశం అంతా వ్యాపించింది. నేలపైపరచిన రత్నకంబళం మీది రంగులరంగుల చిత్తరువులు దీపకాంతులలో క్రొత్త క్రొత్త అందా లొలకబోశాయి. క్రమక్రమంగా వీణావేణు మృదంగనాదాలతో విజయవర్మ హృదయం సమ్మిళితమై పోయింది. అతడు మధ్య మధ్య తాంబూలం సేవిస్తూ తన్మయతతో వకుళమాలిక వీణా గాన మాధుర్యం ఆస్వాదిస్తూ రెప్ప వేయకుండా ఆమెవైపు చూచాడు.

ఇంతవరకు అతనివైపు చూస్తూ వీణ వాయిస్తున్న వకుళమాలిక తటాలున దృష్టి వీణ మెట్లపైకి మళ్ళించి వేసింది. ఒడిలోని వీణపై ఆమె కర్ణాభరణాల కాంతులు ప్రతిఫలించాయి. వకుళమాలిక పెదవులపై చిరునవ్వు చిగిరించింది. ఆ నవ్వు క్రమంగా చెక్కిలిపై చిన్ని సుడిలోకలిసి అదృశ్యమై పోయింది! మొత్తం మీద ఆమె ముఖం వర్తులమైనది! చిక్కని చెక్కిళ్లు, వంపులు తేరిన కనుబొమ్మలు! విశాలమైన గుండ్రని నేత్రాలు. కొంచెం చామనచాయ కలసిన ఎర్రని శరీరచ్ఛాయ. వీణావాద్యంలో తన్మయమైన ఆమె అంగుళులు వీణమెట్లపై నృత్యంచేస్తూ ఆ నృత్యమే సంగీతంగా మోగిస్తున్నట్లుగా స్ఫురింప జేశాయి.

విజయవర్మ హృదయంలో ఆ పరిసర వస్తువులన్నీ క్రమక్రమంగా వీణా నాదంలో విలీనమై పోతూన్నట్టు తోడగట్టింది. మధ్య మధ్యవిరామాల్లో అవి తిరిగీ స్వస్వరూపాలు ధరిస్తూ, వీణతీగలు ఝుమ్మని మోగినప్పుడు వెంటనే అవి ఆ నాద తరంగాల్లో మునిగి అదృశ్యమై పోతున్నట్లుగా భాసించాయి. ఆ అగరు ధూప పరిమళము, మనోజ్ఞమైన వీణా నినాదము కలిసి అతని హృదయంలో తీయనిమైకం రేకెత్తించాయి. మధ్య మధ్య వకుళమాలిక కళ్యాణి,ధీర శంకరా భరణము, దేవమనోహరి మొదలైన రాగాలలో గోపికా విరహ గీతా లాలపిస్తూ వీణా వాద్యంలో తన ప్రత్యేక నైపుణి ప్రదర్శించింది. క్రమక్రమంగా ఆమె వీణావాద్యంలో లీనమై విజయవర్మకు తిరిగి వెళ్లిపోయే వేళ మించిపోయిన విషయం కూడా జ్ఞప్తికి రాలేదు కాని కొంతసేపటికి వకుళమాలిక నెమ్మదిగా తనవాద్యం ముగించివేసింది. విజయవర్మ ఆమె చాతుర్యం అనేకవిధాల ప్రశంసిస్తూ తన కంఠంలో రత్నహారం తీసి వీణా గానబహూకృతిగా వకుళమాలిక చేతికందీయబోయాడు. కాని వకుళమాలిక ఒడిలోని వీణ ఒకప్రక్కన ఉంచి మెడవంచి సవినయంగా ఆహారం అందుకొన్నది!

విజయవర్మకిక ఆమె మెడలో ఆ హారం వేయకతప్పలేదు!

ఆమె ఆనందంతో ఉప్పొంగిపోతూ అదేపనిగా ఆ హారం పరిశీలించడం ప్రారంభించింది. అంతలో వేణు మృదంగ వాద్యాలతో వకుళమాలిక వెనకనున్న మహిళ లిద్దరు సవినయంగా విజయవర్మ దగ్గర సెలవు తీసుకొని అక్కడినించి వెళ్లిపోయారు. విజయ వర్మకు ఫలాహారం తీసుకువచ్చే మిషతో కమలకూడా మెల్లిమెల్లిగా అక్కడ నించి వెళ్ళిపోయింది. ఇంక వకుళమాలికా విజయవర్మ లిద్దరే అక్కడ మిగిలారు. వకుళమాలికఆ హారపరిశీలన ముగించి తల పైకెత్తింది. విజయవర్మ లేచినిలబడి తిరిగి వెళ్లిపోతూ ఆమె కా సంగతి తెలియజేశాడు. అతనితో పాటు ఆమె రెండడుగులు వేసి మెడలోని ఆహారం తీసి చేతధరించి నిలబడింది. విజయవర్మ కామె మనోభావం కొంతవరకు తెలియకపోలేదు! అయినా ఏమీ ఎరగనట్టుగా ఆశ్చర్యంగా ఆమె వైపు చూచాడు!

ఆమె ఆ హారం తిరిగి ఇచ్చివేస్తూ అతని కేసి చూచి అతివినయంగా తలవంచి, “ఈ వేళ నేనీ హారం కోసం మిమ్మల్నిక్కడి కాహ్వానించలేదు!” అన్నది!

విజయవర్మ ఒక నిమిషంసేపు రెప్పపాటు లేకుండా ఆమె ముఖభంగిమ గమనించాడు. ఆమె చెక్కిళ్లలో కెంపులు మెరిశాయి!

# ★ దేవదాసి ★

"అప్రను! నా కిది తెలియకపోలేదు!" అన్నాడు విజయవర్మ చిరునవ్వులు చిందిస్తూ, "తెలిసీ ఉండినా నన్నివిధంగా కించపరచడం మీకు ధర్మమేనా?" అన్నది వకుళమాలిక విశాగ్ర దృష్టితో అతనికేసి చూసి.

విజయవర్మ ఒక్క నిట్టూర్పు విడిచి, "నీవన్నది నిజమే! కాని నా చరిత్ర కొంచెం తెలిసి ఉంటే నన్నీ విధంగా నిందించి ఉండవు!" అన్నాడు.

"మీ రహస్యాలు నా కెలా తెలుస్తాయి?"

"రహస్య మేమీ లేదు! కాని ప్రస్తుతం కొంతకాలం కేనొక నియమంలో ఉన్నాను! అంతే!"

"నేను మీ నియమానికి భంగం కలిగించ దలుచుకోలేదు." అన్నది వకుళమాలిక మెల్లిగా కళ్ళు వాల్చి.

విజయవర్మ మళ్ళీ కొంచెం ఆలోచనలో పడ్డాడు. అతని కేమనడానికీ పాలుపోలేదు!

"నా మాట నమ్మండి!" అన్నది వకుళమాలిక మళ్ళీ.

"సరేగాని నీ విచ్చిన బహూకృతి తిరస్కరించడం మాత్రం మర్యాదగాలేదు!"

"నేనంత మర్యాద తెలియనిదాన్ని గాదు! కాని నా దొక్క మనవి!" అన్నది వకుళమాలిక తన చేతిలో రత్నహారం పరిశీలిస్తూ.

విజయవర్మ కొను ముడివిరిచి ప్రశ్నార్థకంగా ఆమె వైపు చూశాడు.

"ఒక్క పదిరోజులపాటు నా ఆతిథ్యం అంగీకరించ వలసిందని నా ప్రార్థన!"

ఈ ప్రార్థన విని విజయవర్మ కొంచెం ఆశ్చర్యపడ్డాడు.

"మీ దగ్గర వీణలో కొన్ని గమకాలు నేర్చుకోవాలని—"

"నా కంతటి పాండిత్యంలేదే!"

"మీ వేళ్లు చూచినవా రెవరూట నమ్మకం కష్టం!"

అన్నది దేవదాసి ఒక చిరునవ్వు నవ్వి. ఆమె అంతకు పూర్వమే అతని ఎడమచేతి తర్జనీ మధ్యమాంగుళులు రెండూ జాగ్రత్తగా పరిశీలించింది. వాటిపై వీణాభ్యాసంచేసే వారి వేళ్లమీద కనిపించే సొరదలు కనిపించాయి. ఆ రెండు వేళ్ళకొనలు మొద్దుబారి బాగా బిరుసెక్కాయి. వకుళమాలిక చల్లగా ఆ విషయం గ్రహించింది.

విజయవర్మ ఈ ప్రార్థన విని కొంచెం తటపటాయించాడు. "ఇదే మీరు నా కిచ్చే మహాబహూకృతి!" అన్నది వకుళమాలిక మళ్లీ!

విజయవర్మ ఒక్క నిట్టూర్పు విడిచాడు. ఇన్నాళ్ళనించీ అతడా నగరంలో ఒక పెద్ద ధర్మశాలలో ఎవరో పై దేశంనించి వచ్చిన పరదేశిలా నివసిస్తున్నాడు. అక్కడి వసతి సదుపాయాలేవీ అతనికి రుచించలేదు! పైగా తాను కొంత గుప్తంగా దాచిన విషయాలన్నీ అక్కడ ఉండడంవల్ల నలుగురికీ తెలిసిపోతున్నాయని కూడా స్పష్టపడిపోయింది. తన ప్రచ్ఛన్న జీవితానికి వకుళమాలిక గృహనివాసం బాగా వీలుపడగలదని కూడా అతడు గ్రహించుకొన్నాడు. అదీగాక తన లోలోపలి సంకల్పం నెరవేర్చుకోడానికి కూడా ఆమె భవంతిలో నివసించడం చాలా అవసరం! పైగా వకుళమాలిక కేవలం పాదదాసిలా మసులుకుంటూ అన్ని విధాలా అతనికి చేదోడు వాదోడుగా సాయం చేయగలదు!

ఇవన్నీ జాగ్రత్తగా ఆలోచించి ఎట్టకేలకు విజయవర్మ ఆమె ఆతిథ్యం అంగీకరించాడు. అయితే అంతమాత్రానికే దేవదాసి లోలోపల ఉప్పొంగిపోయింది.

వెంటనే లోపలికివెళ్లి అతి రహస్యంగా కమలకీశుభవార్త తెలియజేసింది! కాని వకుళమాలికను రెండు మూడు ప్రశ్నలడిగిన పిమ్మట వకుళమాలికగాని, తానుగాని అంతగా ఉప్పొంగి పోవలసిందేమీ లేదని ఆమె గ్రహించివేసింది! అయినా అంతమాత్రంతో నిరుత్సాహం చెందక తమ భవంతిలో విజయవర్మకు వేరే వివిక్తంగా ఒక వసతిగృహం ఏర్పాటుచేసి దానిలో ఏ లోపమూ లేకుండా అన్ని సదుపాయాలు అమర్చింది!

విజయవర్మ వెంటనే భోజనాదికం ముగించుకొని ఆ వసతిగృహంలో హంసతూలికా తల్పంపై పవ్వళించాడు! అతనికి ఈ పౌండ్రవర్ధన నగరము, ఈ చిత్రవిచిత్ర ఘటనలు అత్యాశ్చర్యకరంగా కనిపించాయి! పిమ్మట వకుళమాలిక కూడా భోజనాదికం ముగించుకొని తన ప్రత్యేక శయ్యాగృహం లోనికి వెళ్లిపోయింది.

ఆ నాటి పున్నమి వెన్నెలకడలిలో ప్రపంచమంతా ఒక నాకలాగ తేలిపోతూన్నట్టు కనిపించింది! కొన్ని వెన్నెల వెలుగులు గవాక్షాలగుండా వకుళమాలిక శయ్యపై ప్రసరించాయి.

ఆమె ఆ వెన్నెలకేసి చూస్తూ వేడి నిట్టూర్పులు విడిచింది. ఆ తోటలోని గడ్డి చిగుళ్లపై నిలిచిన చిన్న చిన్న మంచు బిందువులా వెన్నెలలోమంచి ముత్యాలలాగ తళతళ మెరిసిపోతున్నాయి. చెట్లపై అల్లిబిల్లిగా అల్లుకుపోయిన పొదెగూడులు కూడా ఆ వెన్నెలలో వెండిగూళ్లలా మెరిసిపోతున్నాయి. చెట్లకింది నీడలు చీకటి పేర్చినట్టుగా నిగనిగ లాడుతున్నాయి ఆకాశం అంతా గల్లుపూలరేకులు రాలుతూన్నట్టు మెరిసిపోయింది. ఆ కార్తికపూర్ణిమ - తెల్లని మంచుమేలి ముసుగు ధరించి మెల్లది మెల్లదిగా సాగిపోతున్న రమణీయాభిసారికగా స్ఫురించిందా దేవదాసికి!

లోకం అంతటా పాలవెన్నెలలే! కాని వకుళమాలిక హృదయంలో కేవలం గాఢాంధకారం మాత్రమే అలుముకుపోయింది!

వకుళమాలికకిప్పుడు కలిగినంత హృదయాఘాతం ఇంతకుపూర్వం ఎన్నడూ కలగలేదు! పూర్వం పౌండ్రకవర్ధన నగరంలోని కుబేరులెందరెందరో ఆమెకు పాదాక్రాంతులైనారు. మరి నేడు! కాశ్మీరుసైన్యంలోని ఒక సామాన్యయోధుని కామె పాదాక్రాంతురాలయింది. అయినా అతడామెను తృణప్రాయంగా పరిగణిస్తున్నాడు! ఏమి విచిత్రమైన విధివైపరీత్యం!

ఆమె కావిషయం ఆలోచిస్తుంటే అతడు వాస్తవంగా సైన్యంలో సామాన్య యోధుడేనా అని సందేహం కలిగింది. సామాన్య క్షత్రియయోధునికీ కళావైదుష్యం ఎలా కలిగింది? అతడెవరైనా రాజబంధువా? లేక ఎవరైనా దేశాధీశుడా? అయితే ఈ ప్రచ్ఛన్న వేషం ధరించనేల? ఆనియమంఅవలంబించడానికి కారణమేమో? ఆ రత్నహార బహూకృతినిబట్టి పరిశీలిస్తే అతడెవరో సంపన్నుడైన రాజబంధువే అయిఉండాలి! లేకపోతే అంతటి అమూల్యమైన రత్నహారం ఒక సామాన్యయోధుడెలాగ సంపాదించగలడు? అతడెంతటి ధీరచిత్తుడు! అయినా ఎంతటి ఆర్ద్రహృదయుడు!

వకుళమాలిక ఈవిధంగా పరిపరివిధాలుగా ఆలోచనలు సాగించింది! ఎంతసేపటికీ ఆమెకు నిద్రపట్టలేదు. ఒకసారి లేచి కూర్చుని కార్తీకపౌర్ణమి పండువెన్నెలల తళతళలు పరిశీలించింది. వేడిగా ఒక పెద్ద నిట్టూర్పు విడిచిపెట్టింది!

ఇంతలో ఎవరో గట్టిగా ఆమె కళ్లు మూశారు! ఎంతగా ప్రబతిమాలుకొన్నా విడిచిపెట్టలేదు! మొదట విజయవర్మే వెనకాలేవచ్చి కళ్లుమూసి ఉండవచ్చునని ఆమె ఊహించింది! చేతులు తడిమిచూచింది. అవి కొంచెం మృదువుగా తగిలాయి! కమ లే

అయివుంటావచ్చునని ఊహించి 'కమలా!' అని పిలిచింది. చెవిదగ్గర మెల్లిగా "విజయవర్మ" అనే అక్షరాలు వినిపించాయి! వకుళమాలిక గుండె జల్లుమంది! కాయశక్తులా ప్రయత్నించి పట్టు విడిపించుకొని వెనక్కి తిరిగి చూచింది! విజయవర్మే అయివుండవచ్చునని మనసారా ఆశించింది! కాని ఆమె కమల!

"ఎందుకే ఇంతటి రాత్రి వేళ ఇలా వచ్చావు!"

"చాలా చక్కని రత్నహారం సంపాదించావే! మరి నాముత్యాలహారం మాట!"

వకుళమాలిక వెన్నెల కేసి చూసి ఒక నిట్టూర్పు విడిచింది కమల ఆమె నోదారుస్తూ—"నీకీ లేనిపోని దిగులెందుకు? ఈవంటింటి కుందేలిక ఎక్కడికీ పోదులే!" అంది.

"నా హృదయానికిమాత్రం ఇదంతా ఒక శూలంగా పరిణమించింది! "ఆ హారం లేకపోతే నా హృదయంలోను శూలం గుచ్చుకున్నట్టే ఉంది! దీనికేమంటావు?"

వకుళమాలిక ఒక్క చిరునవ్వు నవ్వి మెడలో హారం తీయబోయింది "పోనీ తరవాత తీసుకుంటానులే! ఇంతకీనీ వాశించినట్టే ఆవిజయవర్మే ఇక్కడికివస్తే! నీసొగసుచూసి ధైర్యం చిక్కబట్టడం మాటలతో పనిగాదు!" అన్నది కమల

వకుళమాలిక మెల్లిగా ఆమె చెంపమీద ఒకటి వడ్డించింది! కమల ఆతరవాత రెండో బహుమతి అందకుండానే తొందరగా అక్కడినుంచి పారిపోయింది!

౪

విజయవర్మ తన భవంతిలో ఉన్న పది రోజులకాలము వకుళమాలికకొక క్షణంలా గడిచిపోయింది ఆమె అతనిదగ్గర వీణా వాద్యంలో ఎన్నో నూతనవిశేషాలభ్యసించింది. అయితే అతనిమనసులో మాత్రం మార్పేమీ గోచరించలేదు! విజయవర్మ పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకోవాలని కమల ఎన్నెన్నోవిధాల ప్రయత్నించింది. అతడొక్క చిరునవ్వు నవ్వి తాను సామాన్యయోధుడననిమాత్రమే నని చెబుతూండేవాడు! కాని కమలా వకుళమాలికలిది విశ్వసించలేకపోయేవారు. ఆపదిరోజులు ముగిసిపోయినతరవాత విజయవర్మ తిరిగి స్వస్థానానికి వెళ్ళిపోవాలని అన్నాడు. కాని కమల, వకుళమాలిక అనేకవిధాలుగా బతిమాలుకోవడంవల్ల చిట్టచివరికి కొంతకాలంపాటు భవంతిలోనే నివసించడానికంగీకరించాడు. అంతమాత్రమే చాలునను కొని వకుళమాలిక లోలోపల ఎంతో సంతోషించింది.

విజయవర్మకు వకుళమాలిక భవనంలో సామాన్యంగా వీణా నృత్యాది గోష్ఠులతో కాలం అంతా గడిచిపోయేది. సాయంకాల

# ★ దేవదాసి ★

వేళ మాత్రం అతడు నగరోద్యానవనం వైపు వాహ్యాళికి వెడుతూండేవాడు. ఆ భవనంలో వకుళమాలికను, కమలను తప్ప మిగిలిన వారికి ఎవరికీ అత డెవరో తెలియదు; వారి కిద్దరికీ తెలిసినది కూడా అంతంత మాత్రమే! అయినా వారిక ఆవిషయం తెలుసుకోవడాని కేమీ ప్రయత్నించ దలుచుకోలేదు! ప్రయత్నించినా ఫలిత మేమీ కలుగదని వారికి తెలిసిపోయింది. కనక నే వారీవైఖరి అవలంబించారు. అయితే వారి హృదయాలలో మాత్రం అతనిని గురించిన జిజ్ఞాస అలాగే పీడిస్తూండేది.

ఒక నాడు విజయవర్మ యథా ప్రకారంగా వాహ్యాళికి బయలుదేరాడు. వకుళమాలిక అతని దగ్గరకు వచ్చి ఆనాటి నించీ కొంత కాలం వరకు వాహ్యాళికి వెళ్ళవద్దని ప్రార్థించింది. మొదట ఎంత గుచ్చిగుచ్చి అడిగినా ఆమె అసలు కారణం చెప్ప నేలేదు. కాని చివరికి చెప్పక తప్పలేదు! ఆమె ఆ విధంగా వాహ్యాళికి వెళ్ళవద్దని నివారించడానికిగల అసలు కారణం ఇది.

ఒక వారం పది రోజులనించీ చంద్రవర్ధన నగరంలో ఒక అపూర్వమైన భయోత్పాతం బయలు దేరింది. ఆ పట్టణానికి సమీపంలో ఉన్న అరణ్యంలో నివసించే సింహం ఒకటి నగరంలో ప్రవేశించి విచ్చలవిడిగా సంచరించడం మొదలు పెట్టింది. మొదట అది అంతగా పౌరుల కప కారం చెయ్యలేదు. కాని కొంచెం మనుష్య రక్తం చవి చూచిన తరవాత రోజురోజు ఇద్దరు ముగ్గురు పౌరులను పొట్టపెట్టుకొనేది. కన్నుమూసి తెరిచేలోగా పట్టణంలో ప్రవేశించేది! మళ్ళీ మెరుపులా ఎక్కడో మాయమై పోయేది! ఈలోగా ఇద్దరు ముగ్గురు పౌరుల సంహారం జరిగిపోయేది! ఎంత ప్రయత్నించినా ఎవరూ దానిని వేటాడలేక పోయే వారు చివరికి ప్రాణంవిసిగి చంద్రవర్ధనరాజు జయంతు డాసింహాన్ని సంహరించిన వారికి రత్నఖచితమైన ఖడ్గం బహూకరిస్తానని పట్టణం అంతటా చాటింపించాడు. ఈ ఘోషణ కర్ణాకర్ణిగా వకుళమాలికకు తెలిసింది. యథాప్రకారంగా వాహ్యాళికి వెళ్ళినప్పుడీసింహం వల్ల విజయవర్మకు ప్రాణాపాయం కలగగలదేమోనని ఆమె భయం! ఆ విషయం కొంచెం తెలిస్తే అతనే ఆ సింహాన్ని వేటాడడానికి బయలుదేర వచ్చును. అతని సాహసం అంతటిది! అందుచేత వకుళమాలిక అతనికా విషయం చూచాయగా నైనా తెలియనీలేదు. అంతే కాని జయంతుని చాటింపు మొదలైన విషయాలేవీ తెలియజెయ్య నేలేదు!

ఆమె ఆ విషయం చెప్పగానే విజయవర్మ వెంటనే తన వసతిగృహంలోనికి వెళ్ళిపోయాడు. ఇక ఆనాటికి వాహ్యాళి నిలిచి పోయినట్లే గదా అని ఆమె లోలోపల ఎంతో మురిసిపోయింది.

కాని ఒక అరగడియ తరవాత విజయవర్మ నఖశిఖ పర్యంతము కవచం ధరించి యుద్ధసన్నద్ధమైన యోధవేషంతో మళ్ళీ వాహ్యాళికి బయలుదేరాడు. వకుళమాలిక అతనికి ఎదురుగా వచ్చి నిలబడింది దీనంగా విజయవర్మ కేసి చూసి "ఈమాటికి నామాట మన్నించండి!" అంది

విజయవర్మ పకపక్కన నవ్వాడు:

"సింహంవల్ల నాకు ప్రాణాపాయం కలుగుతుందనేనా నీ భయం?"

"అది అప్పుడే ఎంతో మంది యోధులను మాతమార్చివేసింది!"

"అయితే ఇక నాచేతిలో వడి మాత మూడి పోతుంది!"

"నిజమేకాని, పోనీ నాలుగు రోజులు వాహ్యాళి మానకూడదా?"

"పోనీ నేనీవేళ ఆ సింహం జోలికి పోనులే!" అన్నాడు విజయవర్మ నవ్వుతూ.

"అది ఆ ఉద్యాన ప్రాంతంలోనే తిరుగుతూంది!"

"అయితే మరింత మంచిది!"

"అంతేనా! మరి నామాట మన్నించరా!" అన్నది వకుళమాలిక జాలిగా అతనివైపు చూసి.

"ఎందుకింత కంగారు! నాకేమీ భయం లేదులే! క్షేమంగా తిరిగి వచ్చివేస్తాను! నన్ను పోనీ!" అన్నాడు విజయవర్మ.

ఆమె ఇక మారు చెప్పలేదు! అతడు కనుచూపు మేర దాటిపోయేవరకు రెప్పపాటు లేకుండా అలాగే నిశ్చలంగా నిలబడి పోయింది ఆమె చెంపలమీద రెండుకన్నీటి బిందువులు మెల్లదిగా దిగజారాయి

విజయవర్మ ఆవేళ ప్రత్యేకంగా సింహాన్ని సంహరించే తీరాలని బయలుదేరలేదు కాని అతనికి నగరం అంతా ఆనాడా సింహ భయం మూలాన పాడుపడినట్లు కనిపించింది. జనసంచారం పూర్తిగా స్తంభించిపోయింది. పూర్వం నగరోద్యానవనద్వారంలో వటవృక్షం నీడలో అమర్చిన శిలావేదికలమీద చాలామంది పౌరులు కనిపించేవారు. నేడు అక్కడక్కడ ఇద్దరు ముగ్గురు యోధులు మాత్రమే నిలబడి ఆ ప్రాంతం అంతా సంరక్షిస్తున్నారు.

విజయవర్మ అక్కడ ఒక శిలావేదికమీద



ఈ సెం 9వ తేదీన కీర్తిశేషులైన కళాప్రపూర్ణ
శ్రీ వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రిలు.

కూర్చున్నాడు ఆనాడా పరిసరమే కాక అతని హృదయం కూడా శూన్యమై పోయినట్లే తోచింది

అంతలో అతనికొక భయంకరమైన సింహగర్జన వినిపించింది! వెంటనే పక్కకు తిరిగిచూచాడు ఆప్రాంతం సంరక్షిస్తున్న యోధుడాసింహం పంజాకిందపడి జాలిగా ఆర్తనాదం చేశాడు! విజయవర్మ తటాలున ఒరలో వేలాడుతున్న బాకు పైకితీశాడు! సింహం ఆ యోధుని సంహరించివేసిన తరవాత వెంటనే అక్కడ విజయవర్మ ఉనికి పసిగట్టి వేసింది , క్షణంలో మెరుపులా అతనిమీదికి లంఘించింది!

విజయవర్మ ఎడమ మోచేయి సింహం నోటి కందించాడు సింహం అది నోటితో గట్టిగా కరిచిపట్టింది. కాని దానికి చుట్టూ దట్టమైన ఉక్కుకవచం ఉండడంవల్ల అది సింహానికి కొరకబడలేదు. ఈలోగా విజయవర్మ కుడిచేతి బాకుతో సింహంకళ్ళు రెండు పొడిచివేశాడు! తరవాత శక్తికొద్దీ దాని శరీరం అంతటా బాకుతోపొడిచి గాయపరిచాడు

సింహం శరీరం అంతా రక్తమయమై పోయింది! అయినా అది అతన్ని అనేక విధాలుగా గాయపరిచింది. కాని కళ్ళు కనబడకపోవడంవల్ల, బలమైన బాకు పోటులు తగలడంవల్ల క్రమక్రమంగా నీరసించిపోయి భయంకర గర్జనలతో అక్కడే పడిపోయి చనిపోయింది. విజయవర్మ చివరిదాకా చాలా జాగ్రత్తగా గాయాలు తగలకుండా తప్పించుకొన్నాడు. కాని చిట్టచివర సుమా

## చెప్పుదెబ్బ

తన బట్టలు తనే ఉతుక్కునే తోటి విద్యార్థిని కాకెయ్యబోయిన ఒక గోపాలరావు, హేళనగా నవ్వుతూ, "మా యింట్లో, ఎవరిబట్టలు వాళ్ళు ఉచ్చినా ఉతుక్కోరు తెలుసా?" అన్నాడు.

"అంటే? ఊళ్ళోవాళ్ళవి ఉతుకుతారా?" అన్నాడు కాయకష్టంలో గొప్పతనం గుర్తెరిగిన మరో విద్యార్థి

కొంత గడియవరకు జరిగిన భయంకర యుద్ధంలో సింహం పంజా దెబ్బలవల్ల అతనికి కూడా కొన్ని గట్టి గాయాలు తగిలాయి. సింహం చనిపోగానే వీలైనంతవరకు తానే తన గాయాలకు కట్లు కట్టుకొని తూలుతూ తూలుతూ నడుస్తూ మెల్లిగా వకుళమాలిక భవంతి సమీపానికి చేరుకున్నాడు. మేడ మీదనుండి అతనికోసం ఎదురు చూస్తున్న వకుళమాలిక కొంతదూరంలోనే అతని పరిస్థితి కనిపెట్టి పరిచారకుల సహాయంతో అతనిని భవంతిలోనికి తీసుకు వచ్చింది. అతడు అతి కష్టంమీద ఆ భవంతిలోపలికి చేరుకోగలిగాడు. వకుళమాలిక ఒక శల్యవైద్యునిచేత వెంటనే అతని గాయాలకన్నిటికీ కట్లు కట్టించి స్వయంగా అతనికనేక విధాలుగా పరిచర్య చేసింది.

విజయవర్మ బాగా అలిసిపోయాడు. శల్యవైద్యుడతనికి తగిలిన గాయాలంతగా ప్రాణాపాయకరమైనవి కావనీ త్వరలోనే నయమైపోవచ్చుననీ చెప్పి తిరిగి వెళ్ళిపోయాడు. ఎక్కువ బడలికవల్ల అతని కన్నులు మూతపడిపోయాయి.

బాగా చీకటి పడిపోయింది. ఎంత ప్రయత్నించినా అతనికి నిద్ర పట్టలేదు. వకుళమాలిక తన యెడల చూపించిన ఆదరానురాగాలకతని హృదయం ద్రవించిపోయింది. ఎక్కడి కాశ్మీర దేశము! ఎక్కడి గౌడ దేశము! తానేదో ధర్మశాలలో నివసిస్తూ కాకతాళీయంగా కార్తీక దేవాలయంలో వకుళమాలిక నృత్యం సందర్శించడం జరిగింది. అంతే! ఆమె తన భవంతి కాహ్వానించి ఎన్నో విధాలుగా కంటికి రెప్పలా కాపాడింది. కేవలం తన ధనాన్ని కాశించి, ఆ విధంగా గౌరవించిందని అనుకోడానికి కూడా వీలులేదు! ఆమె కన్నులలో అనుక్షణము అనురాగం వెల్లివిరుస్తూనే ఉన్నది. అతడామె యెడల కేవలం తటస్థభావమే అవలంబించాడు. అయినా ఆమె అనురాగంలో భేదమేమీ కనిపించలేదు! పైగా అది క్రమంగా ఇనుమడించినట్లే స్ఫురించింది. తన హృదయాంతరాళంలో దాచివేసిన గుప్త రహస్యం ఒకవేళ ఆమెకు తెలిసిపోయిందా? అది ఆవిధంగా తెలియడానికి కెక్కడా ఆస్కారం లేదే!

ఆమె దేవదాసి. పౌండ్రవర్ధన నగరంలో ఆమెతో సరిపోల్చదగిన వారిని వేళ్ళతో లెక్కపెట్ట వచ్చును ఆమెకు ధన ధాన్యాలకు, భోగ భాగ్యాలకు దాసదాసీ జనానికీ కొదవలేదు! మరి స్త్రీ జనం సామాన్యంగా అర్థించే అలంకారాలు, సౌందర్యం, యౌవనం అన్నీ ఆమెకు కోకొల్లలు! అయితే దేవదాసీకులంలో అనురాగమనేది కేవలం గగన కుసుమం! ఆమె తన యెడల కనబరిచే అనురాగం అంతా నిజంగా సహజమైనదేనా? కాని నా డీనటువల్ల ఆమెకు కలిగే ప్రయోజనమేమిటా! అయితే ఇంత ఆప్యాయంగా తన నీవిధంగా ఆదరించడానికి కారణం?

ఈవిధంగా అతని ఆలోచన లనేకవిధాలుగా సాగిపోయాయి!

విజయవర్మకు క్రమక్రమంగా కొంత అలసట తగ్గింది. మెల్లిగా కళ్ళు తెరిచిచూచాడు. ఎదురుగా దీపకాంతిలో వకుళమాలిక! ఆమె నేడెంతో చక్కగా అలంకరించుకొన్నది. నిశ్చలంగా తనముఖం పరిశీలిస్తున్నది. తన శయ్యపై పరవశకూర్చుని సాచేతిపై తగిలిన గాయానికి కట్టుకట్టి అది మెల్లిగా నిమురుతున్నది.

తాను కొంచెం కన్నులు తెరవగానే తటాలున కన్ను లింకొకపక్కకు తిప్పివేసింది. మెల్లిగా ఇలాగ అడిగింది.

"బాధ ఏమైనా కొంచెం తగ్గిందా?"

అతడు కొంతవరకు తగ్గిందని చేతితో సూచించాడు.

"ఎంతటి ఘోరవిపత్తునుండి బయటపడ్డారు!"

విజయవర్మ పెదవులపై ఒక చిన్న చిరునవ్వు వికసించింది! వకుళమాలిక చెంపలపై రెండు కన్నీటిబిందువులు మెరిశాయి. కాని అవి కనబడనీయకుండా వెంటనే ఆమె ముఖం తిప్పివేసుకొన్నది. అలాగ కొంతసేపుండి, మాటాడకుండా మౌనభావంలోనే అతనిదగ్గర సెలవు తీసుకుని మెల్లిగా అక్కడినించి వెళ్ళిపోయింది. విజయవర్మ మెల్లిగా కళ్ళుమూసి నిద్రించాడు.—సశేషం

## సబబు

ఒక దొంగ, తాపీగా ఓ ఇల్లు చక్కబెడుతూ, కావలసినవన్నీ సంచీలో వేసుకుంటున్నాడు. చప్పుడు విని మేలుకున్న ఇంటి యజమాని, మెల్లిగా ఓ కర్ర పట్టుకు వచ్చాడు.

"ముందా సంచిలో సరుకంతా అక్కడ దిమ్మరించి మరీ కదులు" అని గదమాయించాడు.

దొంగ చిత్తరపోయి, తమాయించుకున్నాడు.

"సంచిలో సరుకులన్నీ ఇక్కడే ఒదిలెయ్యమనడం సబబు కాదండీ. ఇందులో పక్కింటివాడివి కొన్ని ఉన్నాయి" అన్నాడు తాపీగా.

# పులి వేట

పులిని చంపాలని మిసెస్ పాకిల్ టైడ్ ముచ్చట పడింది. ఎలాగో అలా చంపాలని సంకల్పించింది. చంపడం అంటే ఆవిడకి భోలెడు ఉబలాటం పట్టుకుందనేం కాదు. భారతదేశంలో కోకొల్లలుగా వున్న పులులలో ఏదో ఒక్కదాన్ని వేటాడినా, తన ప్రయాణం మరొక్కరవ్వ క్షేమంగా సాగిపోతుందన్న ఊహ కలిగిందా అంటే అంతకన్నా కాదు. అంత హఠాత్తుగా, పులిని వేటాడాలన్న ఉబలాటం ఎందుకు పుట్టినట్టు? లూనా బింబర్టన్ నిత్యహాగాయణంతో పడలేక. ఆవిడగారిని అల్జీరియాలో వైమానికుడెవడో, ఒకసారి పదకొండు మైళ్ళ దూరం విమానంలో తీసుకువెళ్లాడట. అప్పట్నించి, లూనా బింబర్టన్ ఆసంగతి తప్ప ఇంకోటి మాట్లాడి ఎరగదు. ఇప్పుడు ఈవిడగారు గనక స్వంతంగా ఒక పులిచర్మం, దానికి బుజావుగా తపైడైతే, పత్రికల్లో పడ్డ ఫొటోలు సంపాదించగలిస్తే, ఆవిడ గారు మిడిసిపాటుకి మాంఛి మందు వేసినట్టు అవుతుంది. పులిచర్మం గట్రా సంపాదించుకుని స్వదేశం వెళ్లిపోయాక ఏం చెయ్యాలో మిసెస్ పాకిల్ టైడ్ ముందే ఆలోచించి అట్టేపెట్టుకుంది... కర్జన్ వీధిలోని తన ఇంట్లో పెద్ద విందు చెయ్యాలి. ఆ విందు కొస్తా లూనా బింబర్టన్ పేరు చెప్పి, ఆవిడ గౌరవార్థం చేసినట్టు హంగుచేసి మరీ ఏర్పాటు చేయాలి. తను తీసుకెళ్లే పులి చర్మం రగ్గు హాల్లో వేస్తుంది. హాటులో చాలా భాగం, విందుకొచ్చిన వారి సంభాషణ సర్వస్వం, దానికే అంకితం అయిపోవాలి. అపైన తను తీసుకెళ్లే పులిగోరు పొదిగి, ఒక బ్రూచ్ (మనదేశంలో పతుకు పిన్ను వంటి ఆభరణం) చేయించి, లూనా పుట్టినరోజున దాన్ని కానుకగా ఇవ్వాలి. మామూలుగా ప్రపంచంలో జనం ఏదో ఒక పనిచేసినా, మానినా, అయితే ఆకలి, కాకపోతే ప్రేమ దానికి కారణం అయివుంటుం దనుకుంటారు గాని, మిసెస్ పాకిల్ టైడ్ కి మాత్రం ఈసూత్రం వర్తించదు. ఆవిడకి ఏ ఊహ తోచినా, ఏది మానినా, ఏపని చేసినా ఏదిమానినా ఎప్పుడూ ఒకటే కారణం ఉంటుంది. లూనా బింబర్టన్ కి ఏది అయిష్టం? ఏది నచ్చదు? దాంతోటే ఈవిడ కథ అంతా నడుస్తోంది.

పరిస్థితులు కూడా [illegible] అనుకూలంగానే ఉన్నాయి. ఏమంత పెద్ద ప్రమాదం, అట్టే శ్రమవుండని పద్ధతిలో, ఓ పులిని చంపడానికి వీలుబాటు కలుగజేస్తే వెయ్యి రూపాయలు బహుమానం ఇస్తానంది మిసెస్ పాకిల్ టైడ్. పొరుగునే వున్న ఒక పల్లెటూరుకు ఒక పెద్దపులి తరచు వస్తున్నట్టు భోగట్టా వచ్చింది. ఆ పులి

మూలం: 'సాకీ'

పుట్టు పూర్వాలు ఘనమైనవేనని ప్రశస్తి చేశారు. ఏటొచ్చీ కొంత వయస్సు మళ్లడంతో, సత్తువ నానాటికీ సడలిపోతూ వచ్చినందువల్ల ఆ పులి మరీ అడవులమీదపడి వేటాడడం తగ్గించుకుంది. ఏదో ఊరి శివారులో తిరుగాడుతూ, అక్కడి పెంపుడు జంతువుల్నే ఆరగించి, అలా కాలక్షేపం చేస్తోందట. పులిని అప్పచెబితే వెయ్యి రూకలు ఒరిగి పడతాయన్న వైనం తెలియడంతో, ఆ పల్లె ప్రజలకు ఉషారెసకొచ్చింది. అందుకని ఆ పులిగనా, ఇంకో చోటుకి పోదామన్న ఊహతో ఎక్కడికైనా వెంచేస్తుందేమో నన్న భయంతో, దానిమీద ఓ కన్నేసి ఉంచమని పగ్రాళ్ళని పురమాయించారు ఊరుజనం. అది చిట్టడవి శివారు దాటే వాటం కనబడితే, కాస్త అదమాయించి, వెనక్కి తోలమని చెప్పారు. అక్కడితో ఊరుకోలేదు. అసలు ఆ పులికి అక్కణ్ణించి పోవాలన్న ఊహే తోచకుండా జాగర్త పడాలనుకుని, కాస్త నాసిరకం మేకల్ని అది తిరిగే ప్రాంతాలలో విచ్చలవిడిగా వదలిపెట్టారు. ఇన్ని చేశాక, తీరా దొర సానమ్మగారు తుపాకి పట్టుకు వచ్చే లోగానే, ఆ పులి కాస్తా—వృద్ధాప్యం వల్ల హరీమని కన్ను మూస్తుందేమోనని దిగులు పట్టుకుంది వాళ్ళకి.

ఎలాగైతేనేం, మొత్తానికి ముహూర్తం పెట్టిన రోజు వచ్చింది. ఆ రాత్రి వెన్నెల కాసింది. ఆకాశం తేటగా ఉంది. కాస్త వాటంగా ఉన్న చెట్టుమీద మంచె కట్టారు. మిసెస్ పాకిల్ టైడ్, ఆవిడ "కిరాయి

## హెక్టర్ హ్యూ మన్రో

ఉత్తమ కథారచయితల శ్రేణిలో ప్రముఖస్థానం సంపాదించుకున్న బ్రిటిష్ రచయిత 'సాకీ' అసలు పేరు హెక్టర్ హ్యూ మన్రో 1870 డిసెంబరు 18న బర్మాలో జన్మించాడు. చిన్నప్పుడే తల్లిని పోగొట్టుకొన్నందువల్ల, తండ్రి ఉద్యోగరీత్యా బర్మా భారత దేశాలలో ఉండవలసి రావటంవల్లా, హెక్టర్ వాళ్ళ అత్తయ్య ఇంట పెరిగాడు. అప్పట్లో, వాళ్లింటికి వచ్చిపోయే ఇరుగుపొరుగుల మాటలు తీరు తెన్నులూ చూచి, ఆకళింపు చేసుకునే అవకాశం లభించింది. తను పెద్దవాడై కథలు వ్రాసిన నాడు, ఈ చిన్ననాటి ముచ్చట్లు, సద్వినియోగం చేసుకున్నాడని సాకీ సన్నిహితులు చెబుతారు. సాకీకి చిన్నప్పుడే రాజకీయాలపట్ల అభిరుచి ఏర్పడింది. దరిమిలా అతను అనేక పత్రికలకు విలేఖరిగా పని చేశాడు. వ్యంగ్యధోరణిలో వ్యాసాలూ వ్రాస్తూ వచ్చాడు. బర్మాపోలీసు శాఖలోనూ, దరిమిలా బ్రిటిష్ సైన్యంలోనూ పనిచేశాడు. 1916 నవంబరు 14న సైనికోద్యోగిగా యుద్ధంలో మరణించాడు.

పత్రికావిలేఖరిగా సాకీ ఫ్రాన్సు, రష్యా ప్రభృతిదేశాలకు వెళ్లి కొంత కాలం అక్కడ ఉంటూ వచ్చాడు. అనుభవం గడించినమీదట, 34వ ఏట అతను కథలు వ్రాయడం ప్రారంభించాడు. అతని కథలన్నీ 1904-1914 సంవత్సరాలమధ్య వ్రాయబడ్డవే.

ప్రాగ్దేశాల కథలన్నా, పర్షియన్ సాహిత్యమన్నా 'సాకీ'కి చాలా అభిమానం. ఉమర్ ఖయ్యాం పద్యాలు చదివినమీదటనే సాకీ అన్న పేరును ఏరుకొని ఆ పేరుతో కథలు వ్రాశాడు.

## మీా తరమా?

అమెరికా అధ్యక్షుడు కూలిడ్జ్ మితభాషి. అసలు సంభాషించడమే అరుదు. ఒకావిడ ఒకసారి పంతం పట్టి ఆయనను మాట్లాడించబోయింది. ఒక విందుసందర్భంలో హఠాత్తుగా ఆయన్ను అటకాయించి, "ఈపళంగా మీా నోట కనీసం మూడు మాటలైనా మాట్లాడిస్తాను చూడండి" అంది.

"మీా తరమా?" అన్నాడు మితభాషి కూలిడ్జ్.

"చేస్తాం" మిస్ మెబిన్ ఆ మంచెమీద పొందికగా కూర్చున్నారు. మంచెకి, ఉండాల్సినంత దూరంలో, ఒక మేకని కట్టారు. ఆ మేక, హద్దూ పద్దూ లేకుండా అదే పనిగా అరవడం సాగించింది. ప్రశాంతంగా ఉన్న రాత్రివేళ, ఓ మోస్తరు చెముడున్న పులికి కూడా వినబడే స్థాయిలో ఆ మేక అరుస్తోంది. మంచెమీద ఉన్న దొరసానమ్మ తుపాకి సరిగ్గా గురిపెట్టి అమర్చుకు మరీ కూర్చుంది పులికోసం. పేషన్సు ఆడుకోడానికని, ఒక చిన్న పేక దస్తా కూడా వెంట తెచ్చుకుంది.

"మనం ఆపదలో పడ్డట్టున్నామే" అంది మిస్ మెబిన్.

నిజానికి, పులిని తలుచుకోగానే గుండె దడ పట్టుకుందనేం కాదు కాని, తను పుచ్చుకునే కిరాయికన్న, ఓ చిన్న మొత్తు, ఓ దమ్మిడీ ఎత్తు ఎక్కువ ఛార్జీ చేసేస్తానేమోనని మాత్రం ఆ 'కిరాయి వేస్తాని'కి దారుణమైన భయం.

"అఁ పోదూ...ఇప్పుడొచ్చే పులి ముసల్ది. ఈ మంచె మీదికి ఎగరాలనుకున్నా, దానితరం కాదు" అంది మిసెస్ పాకిల్ హైడ్.

"ముసలిపులి అయితే వెయ్యి రూపాయిలియ్యడం దండుగే. ఇంకా చవగ్గా బేరం చెయ్యాల్సింది" అంది లూయిసా మెబిన్.

లూయిసా మెబిన్‌కు డబ్బు విషయంలో జాతి విచక్షణ లేదు. అది దమ్మిడీయా రూపాయా అన్న భేదబుద్ధి లేదు, ఆవిడ, డబ్బు పాలిట పెద్ద పతుత కంటక.


ఒక మూర్ఖ హోటల్లో కిరాయంత పనిచేసి పెట్టిన వాళ్లందరికీ తృణమో పణమో ముట్టచెప్పే దుబారా అలవాటు మూలంగా చెల్లా చెదరై పోవలసిన రూబుల్స్‌ను, మిస్ మెబిన్ దక్షతే పాపం ఎన్నోసార్లు రక్షించింది. ఇదే రకం అవస్థలోపడ్డ ఫ్రాంకులూ, సెంట్లూ వాటంతట అవే అదిష్టి పట్టుకు వెళ్ళాలేవి. అదేకనక, ఇంకో జాతీఅతీ లేని మనిషయితే, అవన్నీ దిక్కు విహీనం లేకుండా పోయేవి.

దక్షతగల లూయిసా మెబిన్, పెద్దపులి అవశేషాల బజారు ధరలు, సరుకు నాణ్యం బట్టి, తగ్గించవలసిన ధరతరలూ అంచనాలు కట్టడం సాగించింది కాని, అంతలో అపురే రావసంతో, అక్కడికి ఆహారాయణం ఆగిపోవలసి వచ్చింది.

ఆ పచ్చిక పుల్లి, అక్కడ కట్టేసి ఉన్న మేకను చూసి చూడగానే, చతికిలపడింది. అలా చతికిలపడ్డ ఆ పులి వాటం చూస్తే, ఏదో అతిజాగ్రత్తగా పొంచి ఉండి అమాంతం మేక మీద దూకడానికి కాబోలని ఏమంత అనిపించదు. ఆరగించే ముందు ఒక్క క్షణం ఆయాసం తీర్చుకోడానికంటే సబబుగా కనబడుతుంది.

"జబ్బు చేసినట్టుంది." లూయిసా మెబిన్ అంది కొత్త దిగ్గరగా. అతలతెట్టుమీద కూర్చున్న గ్రామనాయకుడికి కూడా ఈ సంగతి, తెలియగలందులకై, ఆ ఊహ కాస్తా హిందూస్థానీ భాషలో వెల్లడి చేసింది.

"ఉష్" అంది మిసెస్ పాకిల్ హైడ్. చతికిలపడ్డ పులి లేచి, మెల్లిగా, ఎరవైపు బయల్దేరింది.



# ★ పులివేట ★

"ఇప్పుడది గనక, ఆమేకని ముట్టుకోక పోతే, మనం ఆమేకకోసం మళ్ళా వేరే ఏం ముట్ట చెప్పక్కర్లేదు సుమండీ" అంది మిస్ మెబిన్. (ఎరగా తెచ్చిన ఈ మేకకి, వేరె కొంత సొమ్ము ఇవ్వడానికి బేరం ఉంది)

ధ సేల్ మని పెద్ద చప్పుడు చేసింది తుపాకి. వదుస్తున్న పెద్దపులి అమాంతం ఎగిరి ఓ పక్కకి పడిపోయింది. దాని మృతకాయం ఒక్కసారి బొర్లిఆగిపోయింది. చుట్టు పక్కల పొంచిఉన్న పల్లె జనం అంతా ఒక్క పెట్టున ఉత్సాహాతిశయంతో హర్షధ్వానాలు చేస్తూ, పులిని చుట్టు ముట్టారు. ఈ ముక్క కాస్తా క్షణంలో ఊళ్లోకి పాక్కిపోయింది. సంతోషసూచకంగా డప్పులూ డమారాలూ వాయించారు. ఆ ఉత్సవం, అంతా చూసేసరికి దొరసానమ్మగారి గుండె ఉప్పొంగి పోయింది. కర్జన్ వీధిలో తను ఇవ్వబోయే విందు దగ్గర పడ్డట్లేనని ధైర్యం కలిగింది.

ఆ సంబరం హడావుడిలో, అసలు ఎరగా కట్టిన మేక, గుండుదెబ్బతిని విలవిల తన్నుకుంటున్నదనీ, చచ్చి పడున్న పులిమంటి మీద ఎక్కడా గుండుదెబ్బతిన్న గాయలు లేవనీ చల్లగా, మిసెస్ పాకిల్ సైడ్ కావిన చేసిన మనిషి లూయిసా మెబిన్. అంటే గుండు దెబ్బకి ఎరకావలసిన పులికి బదులు, పులికి ఎరపెటిన మేక తుపాకికి ఎర అయి పోయిందన్న మాట. తుపాకి పేలిన చప్పుడుకి పులి గుండుసుకుని చచ్చింది.

అసలే వృద్ధాప్యంవల్ల అంతంత మాత్రంగా ఉందేమో, ఆ చప్పుడుకి గుండె ఆగిపోయి గుటుక్కున ప్రాణాలు వదిలేసి ఉండాలి.

ఈ సువార్త కాస్తా చెవిని బడడంతో మిసెస్ పాకిల్ సైడ్ మనస్సు చివుక్కుమంది. అయితే అవుగాక కాని, మొత్తానికి ఎలా అయితేనేం, చచ్చిపడున్న పులి ఆవిడ స్వంతం. వెయ్యి రూపాయలు అందుకోవాలన్న ఆదుర్దాకొద్దీ గ్రామస్థులు నలుగురూ, దొరసానిగారు పులినే చంపారన్న మాటకే ముద్దతు ఇచ్చారు. ఎటొచ్చి, ఇంక మిస్ మెబిన్ ఉంది. ఆవిడ ఎలాగా కిరాయి మనిస్తమాయె. దానాదీనా, మిసెస్ పాకిల్ సైడ్ స్థిమితపడి, ఫొటోలు తీసేవాళ్ల ఎదట నిబ్బరంగా నించుంది. ఫొటోలు పత్రికలలో అచ్చుపడి ఆవిడ కీర్తిని చాటాయి.

ఇంక లూనాబింబర్గ్. ఆవిడికి ఈముక్క తెలిసిన నాటినించి కొన్ని వారాలపాటు పత్రికలు పొత్తిగా చూడ్డం మానేసింది. ససేమిరా చూడను పొమ్మనేసింది.

మిసెస్ పాకిల్ సైడ్, పులి గోరు పొదిగిన బ్రూచ్‌ని బహుమానంగా పంపినందుకు అభినందన లర్పిస్తూ, ఆవిడ రాసిన ఉత్తరం, ఉద్రేకాలు అణచిపెట్టుకుని, నిగ్రహంతో రాసేవారి ఉత్తరాలలో మాణిక్యం వంటిది. ఇదైతే పుచ్చుకుంది గాని, విందుకి మాత్రం రాను పొమ్మనేసింది. ఉద్రేకాలు అణిచి పెట్టుకోడానికైనా ఒక హద్దూపద్దూ ఉంటుంది. అది కాస్తా దాటిపోతే, అవి పేట్రేగిపోతాయి.

సరే మిస్ పాకిల్ సైడ్ చంపిన పులి చర్మంతో చేసిన రగ్గు, కర్జన్‌వీధి భవంతి నించి, ఆవిడ పల్లెటూరిలోగిలికి బయల్దేరి వెళ్లింది. ఊళ్లో పెద్దలంతా దాన్ని పరీక్షించి ప్రశంసి చేశారు. పులిని స్వయంగా వేటాడింది కాబట్టి, మిసెస్ పాకిల్ సైడ్, అక్కడ విందు జరిగిన రోజున 'డయానా' వేషం వేసుకు మరీ వెళ్లడంలో వింతబతేమీ లేదు. (డయానా గ్రీకుల దేవత. వేటలో విజయం చేకూర్చేదిగా ఈమెను ఆరాధిస్తారు) ఈ 'కాస్ట్యూమ్ డాన్సు'కి ఇలా వచ్చింది గదా అని చూసి, ఇంకోసారి పురాతన యుగం వారి వేషాలు వేసుకొచ్చి నృత్యం చెయ్యాలని, అప్పుడు, ఎవరు చంపిన జంతువుల చర్మాన్ని వారు ధరించి రావాలనీ క్లోవిస్ ఒక సూచన విసిరాడు. దానికి మాత్రం మిసెస్ పాకిల్ సైడ్ 'సై' అనలేదు.

"అయితే నిజానికి అలా చేస్తే, నేను రెండు కుందేటి చర్మాలు తొడుక్కు తయారవాల్సి ఉంటుంది. అధ్వాన్నంగా ఉంటే వాణ్ణి" అన్నాడు క్లోవిస్.

* * *

"అసలు నిజంగా ఏం జరిగిందో నలుగురికీ తెలిస్తే బలే తమాషాగా ఉంటుంది కదూ?" అంది లూయిసా మెబిన్ విందు జరిగిన రెండు మూడు రోజుల తరువాత

మిసెస్ పాకిల్ సైడ్ తుళ్ళిపడింది. "ఏదీ? ఏమిటి?" అంది.

"అదే అదే...మీరు గుండేసి మేకని చంపడం, ఆచప్పుడుతో పులిని హడలేసి చంపడం..."అంటూ కులాసాగా నవ్వింది మిస్ మెబిన్. ఆవిడకి కులాసాగానే ఉన్నా ఎదటి వాళ్లకి ఏమంత సయించదు ఆనవ్వు

మిసెస్ పాకిల్ సైడ్ మొహంలో కళలు దకదక మారిపోయాయి. "ఎవ్వరూ నమ్మరు" అంది.

"లూనా బింబర్గన్ నమ్ముతుంది లెండి" అంది మెబిన్.

ఒక్క దెబ్బన మిసెస్ పాకిల్ సైడ్ మొహం పాలిపోయి పాడుకళపడింది.

"నువ్వు మాత్రం, ఎవరికీ చెప్పెయ్యవు కదూ?" అందావిడ.

## "అయితేనేం..."

ఒక రాజకీయనాయకుడు, ఎడతెరిపి లేకుండా, గంటన్నర రెండుగంటలసేపు ఏకబిగిని ఉద్ఘాటనలు, ఉద్బోధలు, ఉద్ఘోషలూ చేశాడు. కంఠశోష వచ్చిన కొంతసేపటికి, ఉపన్యాసం ముగిస్తూ, "క్షమించాలి. చాలాసేపు మాట్లాడినట్లున్నాను. చేత గడియారం కూడా లేకపోయింది..." అన్నాడు.

"అయితేనేవండి. వెనకాల కాలెండరుంది చూసుకోవలసింది" అన్నాడొక శ్రోత.

మిస్ మెబిన్ బండిని కొత్తదానికి తొక్కించింది.

"శెనాదివారాలో కాలక్షేపం చెయ్యడానికి డోర్కింగ్‌లో చక్కటి ఇల్లొకటి ఉంది. అది కొనుక్కోవాలని మహాముచ్చట పడుతున్నాను. ఎంతో కాదు ఆరువందల ఎనభయ్యేనట. ఎటొచ్చినాదగ్గర అంతడబ్బు లేదు అంతే" అంది.

* * *

లూయిసా మెబిన్ ఆకుటీరానికి 'లెఫోవ్' అని పేరుపెట్టుకుంది. చుట్టూ చిన్నతోట, తోటలో పువ్వులూను. దాన్ని చూసి, మెబిన్ నేస్తాలంతా ఊహలూ ముచ్చటపడిపోయారు. లూయిసా ఇలాటి వెలా సంపాదిస్తుందో అని ఆశ్చర్యపడ్డారు కూడా.

ఇంక మిసెస్ పాకిల్ సైడ్ మాత్రం పెద్ద పులులవేటలాటివాటికి పెత్తనము స్వాస్తం చెప్పేసింది.

కావలసినవాళ్లెవరైనా ఈసంగతి కదలేసి అడిగితే "ఆ ఎక్కడికి లెద్దురూ. దానికి చిల్లర మల్లర ఖర్చులు తట్టుకునేసరికి గుడ్లు గూట్లోకొచ్చేను" అనేది గుట్టుగా. ★

డిటెక్టివ్ సీరియల్

# అపూర్వ హంతకులు

మూలం: ఎడ్గార్ వాలెస్ అనువాదం: 'వినాయక'

## 11

## పేపర్ కటింగ్

అసిస్టెంట్ పోలీసు కమీషనరు, ఫర్గన్ కాట్లింగ్ ఆ వేళ మంత్రిహత్య కేసులో సాక్ష్యం ఇవ్వవలసి ఉంది. అందుచేత కోర్టుహాలుహాలంతా జనంతో కిటకిటలాడి పోయింది.

విచారణ ప్రారంభం కావడానికి పూర్వం శవ పంచాయతీ వారు మంత్రి హత్యవిషయంలో ఎన్నెన్నో సిద్ధాంతాలు, ఊహాగానాలు తినబడ్డవు వచ్చాయనీ వాటిలో కొన్నింటికి తలా తోకా కూడా కనబడటం లేదనీ అన్నాడు.

"అటుపిమ్మట ఒక నిమిషం ఊరుకుని, "పోలీసు ఈ హత్య కూపీకోసం ఎలాంటి సలహాలయినా తీసుకుంటామనీ అవి ఎంత అసంబద్ధంగా కనిపించినా వాటి సంగతి ఆలోచిస్తామనీ అంటున్నారు" అని ఆ విషయం నలుగురిలోను ప్రకటించాడు.

మొట్టమొదటగా అసిస్టెంటు కమీషనరు సాక్ష్యం తీసుకున్నారు. అతను మంత్రి హత్యకుగల పుటుపూర్వోత్తరాలన్నీ వివరాలతో సహా వెల్లడించాడు. తరవాత మంత్రిగది వివరాలన్నీ పూర్తిగా వర్ణించి చెప్పాడు. ఆ గదిలో రెండువైపులా రెండు పెద్ద పెద్ద పుస్తకాల అరలున్నాయనీ మూడోవైపున పెద్ద పెద్ద కిటికీలున్నాయనీ నాలుగోవైపు నున్న అలమారులో జేబపటాలు మొదలైనవి ఉన్నాయనీ అన్నాడు.

"కిటికీలు బాగా గట్టిగా బిగించారా?"

"ఆс బిగించారు."

"వాటికి గట్టిగా బందోబస్తు చేశారా?"

"ఉక్కు ఊచలతోను, తలుపులతోను బాగా గట్టిగా బందోబస్తు చేశారు"

"అవి బద్దలు కొట్టిన గుర్తులేవయినా ఉన్నాయా?"

"ఏవీ లేవు."

"గది అంతా సోదా చేశారా?"

"చాలా జాగ్రత్తగా సోదాచేశారు"

జ్యూరీ ప్రతినిధి—"వెంటనే సోదా చేశారా?"

**జరిగిన కథ:-**

స్పెయిన్ దేశంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా విప్లవం జరుగుతున్న రోజుల్లో విప్లవకారులు ఇంగ్లండులో మకాం వేశారు. వాళ్ళని వెళ్ళగొట్టడంకోసం ఆంగ్లదేశమంత్రి పార్లమెంటులో ఒక చట్టం ప్రవేశపెట్టాలని అనుకున్నాడు.

'అపూర్వహంతకులు' ఆ చట్టం ప్రవేశపెడితే చంపివేస్తామని బెదిరిస్తూ ఉత్తరం రాశారు.

తరవాత 'అపూర్వ హంతకులు' లిమిటెడ్ కంపెనీ పేర ఒక పెద్దభవనం అద్దెకు తీసుకుంటారు. దానిలో మాన్‌ఫ్రెడ్ గోన్సాలెజ్ లిద్దరు ఒక మారణపదార్థం తయారు చేస్తారు. పిమ్మట 'బాకా'లో ఒక దురంతం జరిగింది. సంపాదకునికి కూడా ఒక బెదరింపు ఉత్తరం అందింది. ఆ తరవాత థేరీ 'బాకా' కార్యాలయంలో ప్రత్యక్ష మైనాడు! అతడు 'అపూర్వహంతకుల' గుట్టు బయటపెట్టే లోగా ఒక ముసుగుమనిషి రివాల్వరుతో అక్కడివారిని బెదిరించి, థేరీని విడిపించుకుపోతాడు. తరవాత హంతకులు మంత్రి హత్యకోసం చెయ్యవలసిన ఏర్పాటులన్నీ చేశారు. ఈలోగా ఒక హంతకుడు పోలీస్ సూపర్నెంటు వేషంతో మంత్రికి ఆఖరి హెచ్చరిక అందజేస్తాడు! ఈ లోగా బిల్లీ మార్క్స్ అపూర్వహంతకుల నోట్ బుక్ కొట్టేస్తాడు. అది పోలీసుల చేతుల్లోపడింది. పోలీసులుబిల్లీని విడిచిపెట్టి ఆ నోట్ బుక్-ఆసామీనెల్లాగైనా పట్టుకోమని పంపిస్తారు. బిల్లీదురాశవల్ల అది నెరవేరదు. తరవాత బిల్లీమార్క్స్ థేరీ, మంత్రి చనిపోతారు.

# ★ అపూర్వ హంతకులు ★

"అవును! శవం! బయటికి తీసుకుపోగానే గదిలోని సామానులన్నీ బయట పడేశారు. అప్పటికి గోడలు, తివాసీ కూడా సోదా చెయ్యటం జరిగింది."

"ఏమీ ఆచూకీ దొరకలేదా?"

"ఏమీ దొరకలేదు!"

"ఆ గదిలో కిటికీలున్నాయా?"

"ఉన్నాయి."

"ఎవరయినా వాటిద్వారా లోపలికి రావడానికి వీలుందా?"

"లేదు."

"మీరు పేపర్లు చూస్తున్నారా?"

"ఆఁ! కొన్ని పేపర్లు చూస్తున్నాను."

"విషవాయువు ప్రవేశపెట్టడం ద్వారా హత్యచేశారని కొన్ని పేపర్లలో సూచించారు. మీరది చదివారా?"

"చదివాను."

"దానిమీద మీ అభిప్రాయమేమిటి?"

"ఏమో! నాకది నచ్చలేదు!"

జ్యూరీ ప్రతినిధి — "ఆ విషవాయువు ప్రవేశపెట్టడానికి గదిలో మార్గాలేమైనా ఉన్నాయా?"

సాక్షి కొంతసేపు తటపటాయించి "ఏమీ లేవు! కాని సామాన్యంగా గ్యాస్ లోపలికి రావడానికొక గొట్టం ఉంది. అది మంత్రి కూర్చునే బల్లకు బాగా దగ్గిరగానే ఉంది." అన్నాడు. ఈ సమాధానంమీద హాల్లో ఒక పెద్ద కలకలం బయలుదేరింది.

"గదిలో విషవాయువు ప్రవేశించిన సూచనలేమైనా ఉన్నాయా?"

"ఎక్కడా ఏమీ లేవు!"

"ఏ విధమైన వాసనా వెయ్యలేదా?"

"ఎక్కడా ఏమీ వాసనలేదు!"

"అయితే కొన్ని విషవాయువులకు అలాంటి వాసనా ఉండదు కాదూ! ఉదాహరణకు కార్బన్ మనాక్సైడ్ అలాంటిదే కాదూ?"

"అవును! అలాంటివి కొన్ని విషవాయువులున్నమాట నిజమే!"

జ్యూరీ ప్రతినిధి: "అక్కడి వాతావరణంలో అలాంటి విషవాయువులేమైనా ఉన్నాయేమో పరిశీలించారా?"

"చెయ్యలేదు! కాని హత్య జరిగిన వెనువెంటనే నేనా గదిలోకి వెళ్ళాను. అప్పటికి ఆ విషవాయువులు హరించిపోవడానికి వీల్లేదు, కాని నాకు అలాంటి వాసన ఏదీ ఉన్నట్టు పొడగట్టలేదు!"

"ఆ గది ఏమైనా చిందరవందరగా ఉన్నట్టు కనిపించిందా?"

"బల్ల మాత్రం కొంచెం చిందరవందరగా ఉన్నట్టు కనిపించింది. అంతే!"

"బల్లమీద సామానులన్నీ గజిబిజిగా ఉన్నట్టు కనిపించాయా?"

"ఆఁ కనిపించాయి."

"సరిగ్గా ఆ బల్ల ఎలాగ చిందరవందరగా ఉందో వర్ణించి చెప్పగలరా?"

"పెద్దపెద్ద బరువైన సామానులు మాత్రమే దానిమీద మిగిలి ఉన్నాయి. కొవ్వొత్తులు పెట్టుకొనే పెట్టెలు మొదలైనవి - కాగితాలు, సిరాబుడ్డి తొట్లు, కలాలు పూలుపెట్టుకునే పింగాణీకుండీలు మొదలైనవి-అన్నీ చిందరవందరగా పడిఉన్నాయి.




ఇంకా కొన్ని గులాబీల పూవులుకూడా కనిపించాయి." తరవాత సాక్షి జేబులోనించి ఒక పూలకుండీ పైకితీసి చూపించాడు.

"చనిపోయిన తరవాత మంత్రి చేతుల్లో ఏమైనా కనిపించిందా?"

"ఆఁ ఇది కనిపించింది" అని మంత్రి బాగా వాడిపోయినట్టున్న గులాబిమొగ్గ ఒకటి జేబులోనించి పైకితీసి చూపించాడు. అది చూడగానే హాలులో హాహాకారాలు చెలరేగాయి.

"అది గులాబీ పువ్వేగా?"

"అవును."

పిమ్మట శవపంచాయతీవారు తనచేతిలో ఉన్న అసిస్టెంటు కమిషనరు రిపోర్టు చూశారు.

"ప్రత్యేకంగా చేతిమీద ఏమన్నా ఉందా?"

"ఉంది. ఆ పువ్వున్నచోట ఒక నల్లని మచ్చ కనిపించింది. అది గుండ్రంగా ఉంది."

తరవాత హాలులో మళ్లీ ఒక పెద్ద కలకలం బయలుదేరింది.

"అక్కడ ఆ మచ్చ కనపడడానికి కారణమేమైనా చెప్పగలరా?"

"చెప్పలేను."

జ్యూరీ ప్రతినిధి: "ఆ మచ్చ కనబడిన వెంటనే ఆ విషయంలో మీరేం చర్య తీసుకున్నారు?"

"వెంటనే ఆ పువ్వులన్నీ జాగ్రత్త పెట్టించి బ్లాటింగ్ పేపరుతో వాటిమీద తడి అంతా అద్దించేశాను. తరవాత పరిశోధన నిమిత్తం అవన్నీ దేశీయశాఖ కార్యాలయానికి పంపించాను."

"ఆ పరిశోధన ఫలితం ఏమైనా తేలిందా?"

"నేనెరిగినంతవరకు ఏమీ తేలలేదు!"

"పరిశోధనకోసం మొగ్గలు, పువ్వులు, ఆకులు అన్నీ పంపించారా?"

"ఆ! అన్నీ పంపించాను."

పిమ్మట అసిస్టెంటు కమిషనరు పోలీసులా వేళ చేసిన ఏర్పాట్లన్నీ ఏకరువు పెట్టాడు. ఆవేళ పోలీసు నిఘా కన్నుగప్పి మానవమాత్రుడెవడు లోపలికి రావడంగాని, వెళ్లడంగాని జరగడానికి వీల్లేదని గట్టిగా నొక్కి చెప్పాడు. హత్య జరిగిన తరవాత పోలీసులందరు ఎక్కడవాళ్లక్కడే ఉండాలని ఫర్మానా జారీ చేశారనీ వాళ్ళంతా నిద్ర విరామం లేకుండా 26 గంటలనించీ అలాగే కావలా కాశారనీ చెప్పాడు.

ఈ సందర్భంలో హఠాత్తుగా ఒక అద్భుత విషయం బయటపడింది. ఇది శవపంచాయతీదారు చేసిన ప్రశ్నమీద బయట పడిన విషయం! అతడు తన ఎదురుగా ఉన్న

అసిస్టెంటు కమిషనర్ రిపోర్ట్ శేసి చూస్తూ ఈ ప్రశ్న వేశాడు.

"ఈ థేరీ ఎవరో మీ రెరుగుదురా?"

"ఎరుగుదును."

"అతడు అపూర్వ శాంతికులలో వాడే కదూ?"

"వాళ్ళలో వాడే అనుకుంటాను."

"అతన్ని పట్టుకుంటే బహుమతీ ఇస్తామని ప్రకటించారా?"

"అవును. ప్రకటించారు."

"మంత్రి హత్యలో అతనికి సంబంధం ఉన్నదని అనుమానించారా?"

"అవును."

"అతని శవం దొరికిందా?"

"ఆఁ"

తిరిగీ ఈ ముక్తసరి సమాధానంతో హాలు హాలంతా ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు.

"థేరీ శవం ఎప్పుడు దొరికింది?"

"ఈ వేళ ఉదయం"

"ఎక్కడ?"

"థేమ్స్ గట్టు దగ్గర."

"అప్పటికి థేరీ చనిపోయాడా?"

"ఆఁ"

దీనితో హాలులో మళ్ళీ కలకలం బయలుదేరింది.

"అతని శరీరంమీద ఏమైనా శాస్త్ర చిహ్నలున్నాయా?"

హాలు హాలంతా ఊపిరి విడవకుండా ఈ సమాధానంకోసం ఎదురు చూశారు.

"ఆఁ కుడిచేతిమీద మంత్రిచేతిమీదున్నట్లే ఒక ముద్ర కనిపించింది!"

ఈ సమాధానంలో మళ్ళీ హాలులో వారంతా నిర్ఘాంతపోయారు.

"థేరీ చేతిలో గులాబీ పువ్వుందా?"

"లేదు."

జ్యూరీ ప్రతినిధి: "థేరీ శవం అక్కడికి రావడానికి కారణాలేమైనా తెలిశాయా?"

"తెలియలేదు."

తరవాత సాక్షి, థేరీ శవం పరీక్షించడం జరిగిందనీ అయితే కాగితాలుగాని, ఇంకేవీ గాని దొరకలేదనీ చెప్పాడు.

ఆటుపిమ్మట సర్జన్ కొట్లింగ్ విచారణ ప్రారంభం అయింది. అతడు మొట్టమొదట ప్రమాణం చేశాడు. అతని దగ్గర కట్టలంకొద్దీ దస్త్రాలున్నాయి. అవన్నీ సాక్ష్య సేకరణకు సంబంధించిన కాగితాలు. అందుచేత కొర్టువారతనికి కూర్చున్న చోటినించే సాక్ష్యం ఇవ్వడానికి అనుమతి ఇచ్చారు.

ఒక అరగంట సేపటిదాకా అతడు కేవలం సాంకేతిక విషయాలకు సంబంధించిన వివరాలే తెలియజేశాడు. మంత్రి మృతికి మూడే మూడు కారణాలుండవచ్చునని అన్నాడు. మంత్రి సామాన్యంగానే చనిపోయి ఉండవచ్చును. అతని హృదయం చాలా బల

# ★ అపూర్వ హంతకుడు ★

హీనంగా ఉంది. ఇది మొదటి కారణం. ఊపిరి ఆడకపోవడంవల్లకూడా చనిపోయి ఉండవచ్చును. ఇది రెండో కారణం. లేక పోతే ఏదైనా గట్టి దెబ్బవల్ల— ప్రాణం పోయి ఉండవచ్చును. అది కొట్టినట్టు కన బడకుండా కొట్టిన గట్టిదెబ్బ కావచ్చును!

"విషం పెట్టిన ఆనవాలేవీ కనబడలేదా?"

"లేవు".

"వెనకటి సాక్షి చెప్పిన సాక్ష్యం అంతా విన్నారా?"

"విన్నాను!"

"ఆ నల్లటి మచ్చ కథ అంతా విన్నారా?"

"విన్నాను."

"ఆ మచ్చ పరిశీలగా చూశారా?"

"చూశాను".

"ఆ మచ్చ పడడానికి కారణ మేమిటో తెలిసిందా?"

"ఆఁ. ఏదో ద్రావకంమూలాన్ని అలాంటి మచ్చపడి ఉంటుంది."?

"అది కార్బాలిక్ ఆసిడేనా?".

"అదే! అంతకంటె వేరే ద్రావకం అన డాని కేమీ కారణం కనబడదు."

"ఛేరీ చెయ్యి పరిశీలించారా?"

"ఆఁ పరిశీలించాను".

"ఆ మచ్చ మంత్రి చేతిమీది మచ్చలాంటి దేనా?"

"అలాంటిదేకాని అంతకంటె కొంచం పెద్దది. ఇంకా కొంచెం ఎగుడు దిగుడుగా ఉంది".

"దానిమీద ద్రావకం గుర్తు లేమన్నా ఉన్నాయా?"

"ఏమీ లేవు".



జ్యూరీ ప్రతినిధి: "చాలాకుంది ఈ మచ్చలను గురించి ఎన్నెన్నో చిత్రవిచిత్రమైనసిద్ధాంతాలు లేవదీసినమాట నిజమేనా?"

"నిజమే! నేనవ్వన్నీ చాలా జాగ్రత్తగా చూశాను".

"మరి మంత్రి ఆ విధంగానే చనిపోయి ఉండవచ్చునని మీకు నమ్మకం కలిగిందా?"

"లేదు"

"విషవాయువు లేదైనా ప్రవేశ పెట్టడం జరిగిందా?"

"నాకు నమ్మకంలేదు. అదే జరిగి ఉంటే వెంటనే తెలిసి ఉండును."

"ఒక వేళ ఏదైనా విషవాయు వాగదిలో ప్రవేశ పెట్టిఉంటే ఆ తరవాత అది పూర్తిగా హరించి పోవడానికి వీలులేదా?"

"అలాంటి ద్రావకమేదీ వైద్యశాస్త్రంలో కనబడదు."

"మీరు మంత్రి చేతులో ఉన్న గులాబీ మొగ్గ చూశారా?"

"చూశాను".

"అది అక్కడికి ఎలాగ వచ్చింది?"

"తెలియదు".

"ఆ మచ్చ?"

"అదీ తెలియదు".

జ్యూరీ ప్రతినిధి: "మంత్రి మరణాన్ని గురించి మీకేమీ ఒక ఖచ్చితమైన అభిప్రాయం కలగలేదా?"

"లేదు! నేను నాకు తోచిన వేవో మూడు కారణాలు చెప్పాను! అంతే!"

"మీకు హిప్నాటిజమ్ అంటే నమ్మకం ఉందా?"

"కొంతవరకు నమ్మకం ఉంది".

"హిప్నాటిజములో ప్రావీణ్యం గల ఒక వ్యక్తి కేమైనా ఇలా హఠాత్తుగా ఆ విధంగా అతన్ని చంపడానికి వీలుందా? దీనిమీద మీ అభిప్రాయం ఏమిటి?"

"ఇందులోకూడా నాకు కొంతవరకే నమ్మకం ఉంది."

"సరిగా ఫలానా సమయానికి చంపివేస్తానని మాటిమాటికి బెదిరిస్తే— దానివల్లకూడా చనిపోడానికి వీలుందా?"

"మీ రడిగేదేదో నాకు తిన్నగా బోధపడటం లేదు."

"హిప్నాటిజంద్వారా మంత్రి మరణానికేమైనా అవకాశం ఉందా?"

"నాకేమీ నమ్మకంలేదు".

జ్యూరీ ప్రతినిధి: "ఏదైనా గట్టిదెబ్బ తగలడం వల్లకూడా ప్రాణంపోయి ఉండవచ్చుననీ పైకి కనబడకుండా అలాంటి గట్టి దెబ్బ కొట్టవచ్చుననీ అంటున్నారు. మీ రెప్పుడైనా అలాంటిది చూశారా?"

"రెండుమూడు చూశాను.

"అలాంటి దెబ్బవల్ల పూర్తిగా ప్రాణం పోడానికి వీలుందా?"

"ఉంది".

"అలాంటి గట్టిదెబ్బ తగిలినా చిట్టచివరికి గాని ఆనవాలేమీ మిగలదా?"

"ఏమీ మిగలనివి కొన్ని కేసులు చూశాను. జపానులో ఒక ఆసామీ మెడ మెల్లిగా నులిమివెయ్యడంవల్ల వెంటనే చచ్చిపోయాడు."

"అల్లాంటిది సర్వ సాధారణంగా జరిగే అవకాశం ఉందా?"

"లేదు. ఇదిఒక ప్రత్యేకంగా ఒక వైద్య పత్రికలో ప్రకటించిన కేసు."

"మంత్రి శరీరంమీద అలాంటి అఘాయిత్యం జరిగిన ఆనవాళ్ళేమైనా ఉన్నాయా?"

"ఎక్కడా ఏమీలేవు!"

తరవాత ఆ శస్త్రవైద్యుడు వైద్యపత్రికలో ఆ కేసునుగురించి ప్రచురించినభోగట్టా అంతా చదివాడు.

"మంత్రి ఈవిధంగానే చనిపోయి ఉంటారని మీరు నమ్ముతున్నారా?"

"అలాగే చనిపోయి ఉండవచ్చును."

"మీకీ విషయంలో గట్టిగా నమ్మకం కలిగిందా?"

"ఆఁ. కలిగింది."

తరవాత అడిగిన కొద్ది ప్రశ్నలతో దానికి సంబంధించిన సాంకేతిక ప్రశ్నలన్నీ ముగిసిపోయాయి. దానితో శస్త్రవైద్యుని సాక్ష్యం కూడా ముగిసింది. తరవాత హాలంతటా గుసగుసలు ప్రారంభమైనాయి. గట్టి సాక్ష్యమేదీ దొరకలేదే అని హాలులోని వారంతా నిరుత్సాహ పడిపోయారు. మంత్రి చేతిమీద మచ్చనుగురించి అతనేమైనా తగిన కారణం చెప్పగలడేమోనని అందరు ఎంతో ఉబలాటపడ్డారు. కాని ఏమీ లాభంలేకపోయింది. వెంటనే డిటెక్టివ్ సూపరింటెంట్ ఫాలమూత్ విచారణ ప్రారంభం అయింది. డిటెక్టివ్ మాటలన్నీ స్పష్టంగానే వినిపించాయి. కాని మనిషి చాలా బాధపడుతున్నట్లు కనిపించాడు. పోలీసు లీవిధంగా దగా పడి పడిపోవడం అతడు కొంత వరకు అర్థం చేసుకున్నాడు. మంత్రి హత్య జరగగానే డిటెక్టివ్ సూపరింటెంటు, అసిస్టెంటు పోలీసు కమీషనరు వెంటనే తమ రాజీనామాలు దాఖలు చేశారు. కాని ప్రధాన మంత్రి ప్రత్యేకంగా అవి అంగీకరించవద్దని తిప్పి పంపించి వేశాడు. ఇది అందరికీ తెలిసిన విషయమే!

ఫాల్మూత్ చెప్పిన సాక్ష్యంలో చాలా భాగం అసిస్టెంటు కమీషనర్ చెప్పినదే!

హత్య జరగడానికి పూర్వం అతడు మంత్రి గారికి దగ్గరగానే ఉన్నాడు. అతనా విషయాలన్నీ పూసగుచ్చినట్లుగా ఏకరువు పెట్టాడు. అవన్నీ వింటూ కోర్టు హాలు లోని జనం అంతా నోటమాటలేక స్తంభించి పోయారు.

"మంత్రి చదువుకునే గదిలోనించి మీకొక ధ్వని వినబడింది కదూ?"

"అవును"

"ఆధ్వని ఎలాగుంది?"

"అదెలాగుంటో వివరించి చెప్పడం కష్టం! ఒక కుర్చీ నేలమీద బరబరా లాగుతున్నట్టు చప్పుడయింది."

"అది తలుపు వేసినప్పుడు బయలుదేరే చప్పుడులాగా ఉందా?"

"అవును. సరిగా అలాగే ఉంది."

ఈ సమాధానంతో మళ్లీ హాలులో కలకలం బయలుదేరింది.

మీ నివేదికలో అదే రాశారు కాదూ?"

"అవును"

"లోపల ఏదైనా రహస్య ద్వారంగాని, తలుపుగాని ఉందా?"

"అలాంటి వేవీ లేవు!"

"పుస్తకాల బీరువాలో ఎవరైనా దాక్కోడానికి అవకాశం ఉందా?"

అవన్నీ ముందే సోదా చేశాం. అలాంటి అవకాశమేమీ లేదు"

"తరవాత ఏమి జరిగింది?"

"మంత్రి పెద్దకేక పెట్టినట్టు వినిపించింది. నేను శాయశక్తులా తలుపు తెరవడానికి ప్రయత్నించాను."

జ్యూరీ ప్రతినిధి: "లోపల తలుపు తాళం వేసి ఉందా?"

"అవును"

"లోపల మంత్రి ఒక్కరే ఉన్నారా?"

"అవును. ఆయన ఒంటరిగానే ఉంటానని అన్నారు. ముందుగానే మాకా విషయం తెలియజేశారు."

"హత్య జరిగినతరవాత గదిలోపల, ఇవతల బాగా సోదా చేయించారా?"

"చేయించాను."

"అక్కడ ఏమైనా కొత్తవిషయాలు బయట పడ్డాయా?"

"ఒక కొత్తసంగతి బయట పడిందిగాని, దానికీ, ప్రస్తుత విషయానికీ సంబంధమేమీ ఉన్నట్టు కనబడదు."

"ఏమిటా కొత్తసంగతి?"

"గదిలో కిటికీమీద రెండు పిచ్చుకలు చచ్చి పడిఉన్నాయి"

"వాటిని పరీక్ష చేశారా?"

"చేశారు. గాని ఆ పరీక్ష చేసిన సర్జన్ అవి పైనించి పడ్డాయని అందువల్లే చచ్చిపోయాయనీ అన్నాడు."

"వాటికి విష వాయువు తగిలినట్టుగా ఆచోకీ ఏమైనా దొరికిందా?"

"ఏమీ దొరకలేదు."

ఈ సమయంలో సర్జన్ కాట్లింగును మళ్లీ పిలిచి ఇంకొక ప్రశ్న అడిగారు. తానా పక్షులను పరీక్షించాననీ ఎక్కడా విషవాయువు తగిలినసూచనలేవీ కనబడలేదనీ అన్నాడు.

"ఏదైనా భయంకరమైన విషవాయువు గదిలో ప్రవేశపెట్టి ఉండవచ్చుననీ అది వెంటనే హరించిపోయి ఉండవచ్చుననీ ఇంతాకా ఒకసూచన వచ్చింది. ఆ విషవాయువు ఆవిరివల్ల ఈ పక్షులు చచ్చిపోయి ఉండకూడదా?"

"అవి ఆ కిటికీమీదే ఉండిఉంటే అది నిజమే అయి ఉండవచ్చును."

జ్యూరీప్రతినిధి: "హత్యకూ, ఈపక్షులకు ఏదైనా సంబంధం ఉందా?" సాక్షి అలాంటి సంబంధమేమీ లేదని గట్టిగా నొక్కి చెప్పాడు.

మళ్లీ సూపర్నెంట్ ఫాల్మాక్ విచారణ ప్రారంభంఅయింది.

"అక్కడ ఇంకా ఏమన్నా విశేషాలు కనిపించాయా?"

"ఏమీ లేవు!"

తరవాత శవపంచాయతీదారు బిల్లీకి పోలీసులకు ఉన్న సంబంధాలను గురించి కొన్ని ప్రశ్నలడిగాడు.

"మంత్రి చేతిమీద, ఢేరీ చేతిమీద కనిపించిన మచ్చల్లాంటివి బిల్లీ చేతిమీదకూడా కనిపించాయా?"

"లేదు."

* * *

కోర్టువారు లేచేసమయం సమీపించింది. అక్కడ హాలులో ఉన్నవారందరికీ శవపంచాయతీదారు ఇచ్చినతీర్పు చాలా చిత్రంగా కనిపించింది. "ఈమరణానికి కారణమేమో తెలియడంలేదు. ఇది చెయ్యాలని చేసిన హత్య!" ఇదీ శవపంచాయతీ దారు ఇచ్చినతీర్పు!

వారిలో ఒక శవపంచాయితీదారు పని ముగించుకొని ఇవతలికి వస్తూంటే అతనికొక పరిచితివ్యక్తి ఎదురయ్యాడు.

"ఇదిగో! ఏమిటి? ఇలాంటి మంచి పని రద్దీ వేళ కూడా ఇక్కడికి వచ్చావే!.... మొత్తంమీద ఇది చాలా బ్రహ్మాండమయిన కేసేలే!"

"ఇంకా సందేహమేమిటి?" అన్నాడా పరిచితివ్యక్తి.

"పొద్దుటినించీ ఇక్కడే ఉన్నావా?"

"అవును" అన్నాడా పరిచితివ్యక్తి.

"ఈ వేళ మన జ్యూరీప్రతినిధి ఈ వ్యవహారంఅంతా ఎంత చాకచక్యంగా నడిపించాడో చూశావా?"

"నిజమే! ఆయన కంపెనీలు పెట్టడం మానేసి కోర్టులో ప్రాక్టీసు పెట్టడం మొదలు పెడితే బాగా పైకి వస్తాడు."

"అయితే ఆయన్ని నువ్వెరుగుదువా?"

ఆ రెండో ఆసామి ఒక్కసారి ఆలోచించి ఇలాగన్నాడు.

"ఎరక్కేం. బాగానే ఎరుగుదును! ఫొటోగ్రాఫులు తయారుచేసి ఏదో పెద్ద పెద్దలాభాలు గుంజుకో వచ్చునని గుటక వేశాడు. ప్లాకులుతయారుచేసే కంపెనీఒకటి మొదలు పెట్టాడుగాని మళ్ళీ అది తిరిగి మా చేతిలోకే వచ్చేసింది."

"బాగా నష్టంవచ్చిందా?" అన్నాడా పంచాయతీదారు ఆశ్చర్యపోతూ.

"నష్టం వచ్చినట్లేమీ కనబడదు. ఎంచేతో ఈవ్యవహారం మానేస్తున్నాడు. అతనికక్కడి నీరు సరిపడలేదని అంటున్నాడు."

"అన్నట్లతని నీపేరేమిటి?"

"మాన్‌ఫ్రెడ్!" అన్నాడు పంచాయితీదారు! (ఇంకా వుంది)

# నారీచోరుడు

'కీర్తిప్రియ'

వీధితలుపు తట్టిన శబ్దం వినపడింది. 'ఒరే చిన్నా' అని ఓ గావుకేక పెట్టి మా చిన్నబ్బాయిని వీధితలుపు తీసి చూడమన్నాను. గోడనున్న గడియారంలో రెండు గంటల పదినిమిషాలయింది. తడిసిన తట్టివేళ్ల దాపలనుండి గాలి చల్లగా వచ్చి మెల్లగా స్పృశించిపోతూంది. నిప్పులు చెరుగుతున్న ఎండలో ఆ వచ్చినవ్యక్తి ఎవరా అని ఆలోచిస్తున్నాను.

"కృష్ణమూర్తిగారింటి బుచ్చి వచ్చేడు నాన్నా. మీతో ఏదో చెప్పుతున్నారట" అన్నాడు మా చిన్న. "లోపలికి రమ్మను" అన్నాను.

బుచ్చి నా స్నేహితుడు కృష్ణమూర్తి మేనల్లుడు. పన్నెండు పదమూడు సంవత్సరాల వయసుంటుంది. పొట్టిగా, దుబ్బుగా, చాలా చలాకీగా వుంటాడు. తెలివైనవాడు కూడా. అతని పూర్తి పేరేమిటోగాని వాళ్ళ మేనమామ యింటిలో పిలిచినట్లే నేనూ "బుచ్చి" అని పిలుస్తుంటాను.

"ఏం! బుచ్చీ యిలా వచ్చావు?" అన్నాను.

"మామయ్య మిమ్మల్ని రమ్మన్నారండీ."

"ఏం! ఏంటి సంగతి?"

"ఏమో తెలియదండీ. మిమ్మల్ని అర్జంటుగా రమ్మని చెప్పమన్నారు. ఉత్తరం ఏదో చూస్తూ అటూ యిటూ గదిలో తిరుగుతున్నారు. చిరాకుగా వున్నారు." అతనితో పూర్పువచ్చింది. నాకు ఆత్రుత ఎక్కువైంది.

"సరే నేను వెంటనే వస్తానని నువ్వు వెళ్ళి చెప్పు" అన్నాను.

"అలాగేనండీ" అంటూ వెనుకకు తిరిగి వెళ్ళిపోయేడు. ఎండను వచ్చిన పిల్లడ్ని మంచినీళ్ళు అయినా తాగమని అననందుకు బాధపడ్డాను. బట్టలు మార్చుకుని సైకిలుమీద బయలుదేరేను, కృష్ణమూర్తి యిల్లు అట్టే దూరం లేనప్పటికీ.

రెండుగంటలు దాటినప్పటికీ ఎండ యింకా తీక్షణంగావుంది. దూరానికి తారురోడ్డు పరచిన రేకులా వుంది. గాలి సుడులు లేచి తారురోడ్డుమీది కొద్దిపాటి ధూళిని ఎక్కడికో తీసుకుపోయి విడిచిపెడుతూంది. బాంబులుపడిన పట్నాలలా వీధులు నిర్మానుష్యంగా వున్నాయి. రోజూ వచ్చేవాడిని నిన్నసాయంత్రం రాలేదనా? అయి వుండదు. అలాఅయితే మిట్టమధ్యాహ్నం రమ్మనడు. అదును ఉత్తరమే కారణం. ఏముంటుంది ఉత్తరంలో? పెళ్ళి సంబంధం ఆగిపోయిందా? పెళ్ళికొడుక్కు... పాడు ఆలోచనలు. ఎప్పుడు అపశకునపు ఆలోచనలే. మంచి ఆలోచన ఒక్కటుండదు. పెళ్ళికొడుక్కేం. నిక్షేపంలా వున్నాడు ఆ వేళ. గుండెలమీద గుద్దితే చెయ్యి నొప్పెట్టేలా వుంది శరీరం. ఏమో రోజులు, 'ఒడ్డూ డాక్టరు' ఏరోగం లేకుండా నలభైఏళ్ళ వయసప్పుడు పోతాడని ఎవరైనా అనుకున్నారా?...... ఛా! ఛా! మళ్ళీ అవే ఆలోచనలు. ఇంక ఆలోచించకూడదు. కూడదు... మళ్ళీ ఆలోచనలు. వెనుకనుండి వస్తున్న కారుహారన్ వినబడ్డది. రోడ్డు ఎడమ పక్కకు సైకిలు తప్పించి ఎదుటికి చూసేను. రోడ్లు కొత్తగా కనబడ్డాయి. కొద్దిదూరంలో పచ్చని తోరణాలతో పందిరి కనపడుతూంది. కొత్తగా వెల్లవేసిన గోడలతోనూ, రంగులువేసిన తలుపులతోనూ, వీధిలో చక్కని పెళ్ళిపందిరితోనూ మా కృష్ణమూర్తియిల్లు కొత్త శోభ చేకూర్చుకుంది.

సైకిలుదిగి పందిరిలోకి వెళ్ళేటప్పటికి ప్రాణం లేచివచ్చినట్లయింది గేటుతీసుకొని లోపలికి వెళ్ళి లోపలి పందిరరాటకు సైకిలు చేరవేసి హాలువైపు వెళ్ళేను. తలుపులు వేసి వుండడంచూసి, చేతిలో కవరు పట్టుకుని అటుయిటు చిరాకుగా తిరుగుతున్నాడు కృష్ణమూర్తి. నన్నుచూసి "రావోయ్! రా! రా! అక్కడ నిలబడిపోయావేం?" అన్నాడు. లోపలికి వెళ్లేను.

"ఏం ఆందోళనగా వున్నట్టున్నావు! ఏమిటా ఉత్తరం? ఎక్కడినుండి? ఏముంది అందులో?" వరసగా అడిగేస్తున్నాను. కుర్చీ లాక్కుని కూర్చున్నాను. గదిలో వున్న రౌండుటేబిలుదగ్గర కుర్చీలో కూర్చుంటూ "పెళ్ళికని చేస్తున్న యిన్ని ప్రయత్నాలు శుద్ధ దండుగ అయిపోయాయి" అన్నాడు కృష్ణమూర్తి. అతనిమాటలలోనూ మొహంలోనూ కోపం, బాధామిళితమై యున్నాయి.

"ఏమిటి సంగతి?"

"చూడు" ఇంతసేపూ చేతిలో వున్న కవరు టేబిలుమీద పడేశాడు. తెల్లనికవరు మీద కృష్ణమూర్తి ఎడ్రసుంది. లోపల పుస్తకం మధ్యపెట్టి మాపుగా చేసినట్టున్న ఎఱ్ఱరంగు ఉల్లిపొర కాగితముంది. దాని మీద నల్లసిరాతో ఉత్తరం వ్రాసివుంది. కాగితం తీసి చదువుతున్నాను కొద్ది కష్టంతో.

"మహారాజశ్రీ కృష్ణమూర్తి గారికి నమస్కారములు—

అయ్యా! మీరు యీ నెల 15 వ తేదీని రాత్రి 2-35 గం||కు మీ అమ్మాయి సుశీలకు వీరవరం గ్రామ కాపురస్థులయిన సుబ్రహ్మణ్యం అనే అబ్బాయి కిచ్చి వివాహం చేయ నిశ్చయించినట్టు నాకు తెలుసు. ఈ వివాహం నేను జరుగనీయదల్చుకోలేదు. కావున వివాహం జరిగేనాడు సరిగ్గా మంగళసూత్రం కట్టే సమయానికి నేను నా అనుచరులతో వచ్చి మీ అమ్మాయిని ఎత్తుకొని పోదును. పోలీసులను రప్పించటం మొదలగు వృథా ప్రయత్నములు చేయవలదు. జాగ్రత్త. ఇట్లు,

"భయంకర నారీచోర"

గుండె ఆగినంత పనయింది. ఎవడీ భయంకర నారీచోరుడు. ఎవడింత సాహసి! ఎప్పుడో డిటెక్టివ్ నవలలో చదివేం, అమ్మాయిల్ని ఎత్తుకు పోయే ముసుగుమనుష్యుల్ని గూర్చి. కాని వీడెవడు యీ ఇరవయ్యో

కళాబ్దంలో. మా పట్టణంలో దొంగలూ, గజదొంగలూ వుంటే వుండనూ వచ్చు, హత్యలూ అపరాధాలూ జరిగితే జరగనూ వచ్చు. కాని పెళ్ళిపీటలమీద ఆడపిల్లల్ని ఎత్తుకుపోతాం అనే వాళ్ళుంటారన్న సంగతి నాకు తెలియనే తెలియదు. నిజంగా ఏం చెయ్యడం. కృష్ణమూర్తి ఆందోళన అర్థమయింది. ఈకాలపు అమ్మాయిలు సినీమాలు చూసి ప్రేమ వ్యవహారాల్లో ఎలా దిగుతున్నారో కొన్ని సంఘటనలు జ్ఞాపకం వచ్చాయి. కొంపదీసి కృష్ణమూర్తి కూతురు ఎవడినో ప్రేమించ లేదుకదా. వాడే యీ భయంకర నారీచోరుడేమో. భయపడి పెళ్ళి ఆపేస్తే సావకాశంగా వాళ్ళ పెళ్ళి గురించి ఆలోచించుకోవచ్చునిగాని యీ ఎత్తు వేశాడేమో...కృష్ణమూర్తిని అడిగితేనో. ఏమని అడుగుతాం. ఏమయ్యా! మీ అమ్మాయి ఎవరినైనా ప్రేమిస్తోందేమో కనుక్కున్నావా? ప్రేమలేఖలు వ్రాస్తుంటుందేమో చూశావా? అని అడగనా. ఎంత స్నేహమయినా అలాగ ప్రశ్నించ వచ్చా? ఇంతకీ అసలు ఆ అమ్మాయి ఎంతో బుద్ధిమంతురాలని, స్కూలు ఫైనలువరకు చదువుకున్నా గర్వం పెడసరం లేకుండా వినయ విధేయతలతో ప్రవర్తిస్తుందని అందరిలోనూ ఏదో ఒక తప్పు చూపెట్టే మా ఆవిడే అంగీకరించింది కదా. అటువంటిపిల్ల ప్రేమవ్యవహారాల్లో చిక్కుకుంటుందా? కిట్టనివాళ్ళెవరయినా వేసిన ఎత్తేమో.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్. ఏమన్నా మొదలూ తుదీ దొరికిందా?" అన్నాడు కృష్ణమూర్తి.

"నాకేం తెలియడంలేదు. అంతా అయోమయంగా వుంది. రామారావుగారు కూడా వస్తే బావుణ్ను. వాళ్ళకిలాంటి చిక్కులు విడదీయడం సులభం!

రామారావుగారు సబ్ యిన్స్పెక్టరుగని చేస్తున్నారు. కృష్ణమూర్తి వుంటున్న వీధిలోనే వుండడాన్నీ, కృష్ణమూర్తికి ఆ వీధిలో పలుకుబడి వుండడాన్నీ ఆయనకు కృష్ణమూర్తితోనూ, తద్వారా నాతోనూ, పరిచయమేర్పడింది. ఏవో పనులుంటేనే తప్ప లేకపోతే ముగ్గురం రోజూ సాయంత్రం కృష్ణమూర్తి యింటి దగ్గర కబుర్లు పెట్టుకుని కూర్చుంటాం. రామారావుగారు కబుర్లపోగు. జీవితం అంటే లెక్కలేని రకం. ప్రతీ విషయం తేలికగా తీసుకుంటారు.

కృష్ణమూర్తి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. నాకు అసలు ఏమీ తోచలేదు. ఇది ఏదో ప్రేమలేఖలపర్యవసానమేనని నాకు గట్టి నమ్మకం. కాని ఎలా అడగడం. ఏమని అడగడం.

'అహహా...' నవ్వు వినపడ్డది వీధిలో. నవ్వుకుంటూ స్థూలకాయంతో లోపల అడుగు పెడ్తున్నారు రామారావుగారు. ఆలోచననుండి తేరుకుని గుమ్మంవైపు చూశాం.

"ఏమండీ! పెద్దలు నిన్న దర్శనభాగ్యం లేకుండా చేసేరు" అన్నారు రామారావుగారు గుమ్మంలో అడుగు పెడుతూ. నేను వెంటనే సమాధానం చెప్పలేదు. రామారావుగారి వెనకనే యింకొక అబ్బాయి వున్నాడు. అందంగా వున్నాడు. శుభ్రంగా యిస్త్రీ చేసిన దుస్తులు వేసుకుని సన్నగా పొడుగ్గా వున్నాడు. వయస్సు 20, 22 దగ్గరలో వుండొచ్చు. అనుమానంగా గది నలుమూలలు చూస్తున్నాడు. రామారావుగారు వెనక్కి తిరిగి అతన్ని రమ్మని పిలిచి మాకు పరిచయం చేశారు.

'ఈ అబ్బాయి మాకు మేనల్లుడవుతాడండీ బెజవాడ కాలేజీలో బి. ఏ. పరీక్షకు వెళ్ళాడు; మొన్న యీమధ్య జరిగిన పరీక్షలకి'.

'అలాగా ఎప్పుడు వచ్చారేమిటి?'

'రావడం నిన్ననే వచ్చాడు. నిన్న సాయంత్రం నాతో రమ్మంటే పిక్చరుకి పోతానన్నాడు. మావాడికి సినీమాల పిచ్చి జాస్తీలెండి. సినీమారంగం గురించి ఓ పరీక్ష పెడితే ఇండియాకే ఫస్టు వస్తాడు. ఆ!'

'ఈయన్ని ఎక్కడో చూసినట్టుంది?' అన్నాడు కృష్ణమూర్తి.

"ఆ! అన్నట్టు చెప్పటమే మరిచాను. నా తెలివి చూడండి. నిన్నరాత్రి మీ ఫోటో, మనం రోజు కలుసుకోవడం, అవి చెప్పుతువస్తే, 'అలా చెప్పేవు కానేం మామయ్యా. నాన్నగారు ఇక్కడ పనిచేస్తున్నప్పుడు వారి పక్కింటిలోనే వుండే వాళ్ళం. రోజూ వాళ్ళింటికి వెళ్ళి ఆడుకునే వాణ్ని' అన్నాడు."

'ఎవరూ! ఇంజనీరు సుబ్బారావుగారి రమణవటోయ్. అప్పుడే ఎంత పెద్దవాడి వయ్యావ్, పోల్చుకోలేకుండా. నాన్నగారూ వారూ కులాసాయేనా?'

'ఆ! కులాసాయేనండి'

'నాన్నగారెక్కడ?'

'క్రిందటి సంవత్సరంవరకూ బెజవాడండీ. ఇప్పుడు అనంతపూర్ లో వుంటున్నారు. నేను బెజవాడలోనే హాస్టల్లో వుంటున్నాను."

'నాకు ఎందుకో రమణను చూస్తే అనుమానం కలిగింది. అతనే 'భయంకరనారీచోర్' గారేమోనని. అతనా యువకుడు. అందులో సినీమాల సారం బాగా వంటబట్టిన పెద్దమనిషి. అని వాళ్ళ మేనమామే సర్టిఫై చేస్తున్నాడాయె. అన్నిటికీ మించి సుశీలా ఇతనూ చిన్ననాటి స్నేహితులట. ఇంకేం! ప్రేమలేఖలు వ్రాసుకోవడానికి అన్ని హంగులు కుదిరాయి. ప్రేమించుకోడానికి ఆటంకాలు ఏమీ లేవు...ఎందుకు లేవూ? ఎప్పుడో చిన్ననాటి స్నేహం. పెద్దయ్యేక మరచిపోయే వుంటారు. అయినా చిన్నప్పుడు సరదాగా ఆడుకున్న యిరుగు పొరుగుల పిల్లలందరూ పెద్దయ్యాక ఒకర్నొకరు ప్రేమించేసుకుంటున్నారా? సినీమాలలో తప్ప...కాని మరి పెళ్ళి లేపోనూపో అవుతుందనగా ఎందుకు వచ్చేడు. సుశీల ఉత్తరం వ్రాసి వుంటుంది.

'ఉత్తరం గురించేనటండీ అంత తీవ్రంగా ఆలోచిస్తున్నారు.' అన్నారు రామారావుగారు.

'అబ్బే! అబ్బే! ఆ! ఆ! దానిగురించే. మీకెలా తెలిసింది ఉత్తరం గురించి?'

'అంత అలా తన్మయులై పోయారన్న మాట. ఇప్పుడే కదూ కృష్ణమూర్తిగారు చెబుతా.'

'నేను వినలేదండీ. ఇంతకీ మీ అభిప్రాయం?'


'అభిప్రాయానికేం వుంది. ఎవడో అల్లరి వెధవ వ్రాసివుంటాడు. వాటిని లెఖ్ఖ చేసేదేంటి.'

'అంతే నంటారా?' అన్నాడు కృష్ణమూర్తి. అంత డబ్బున్నదన్న మాటేగాని ఏవరేం చెప్పినా వినేసేరకం. అలా అని పూర్తిగా వ్యవహారజ్ఞానం లేనివాడు కాదు.

'అంత సునాయాసంగా కొట్టివేయవలసింది కాదండీ. పూర్వంలా లేవు రోజులు' అన్నాను కొత్తఅబ్బాయిని ఓకంట చూస్తూ.

'ఏదండీ. ఉత్తరం నన్ను చూడనిస్తారా?,' అన్నాడు రమణ; ఏం ఎరగని బుద్ధిమంతుడిలా.

ఉత్తరం తీసి చూపేడు. నేను అతణ్ని



రామేశ్వరాలయంలో నందీశ్వర విగ్రహం.

# ★ నారీ చోరుడు ★

పరిశీలనగా చూస్తున్నాను. రామారావు టేబులుకింద కాళ్లు పూర్తిగా చాపి సిగరెట్టు పొగ విలాసంగా వదులుతున్నారు. టేబులుమీద మోచేతులు ఆన్చి అరచేతులలో తలపెట్టుకుని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు కృష్ణమూర్తి. తన పరువు యీ పెళ్లివల్ల ఏ మంట కలుస్తుందో అని ఎంత బాధపడుతున్నాడో మరి.

ఉత్తరం జాగ్రత్తగా చూసి కవరులో పెట్టేసి, మళ్లీ తీసిచూసి కవరుమీద ఎడ్రసు చూసి, కవరులో ఉత్తరం పెడుతూ, ఇలా కూర్చుంటే లాభం లేదు. కర్తవ్యం ఆలోచించాలి' అన్నాడు రమణ. కృష్ణమూర్తి చేతులు టేబులుమీద పడేసి తలెత్తి అతనివంక చూసేను.

'చూడండీ. మీరు ఈ ఉత్తరం ఎప్పుడు చూశారు?' అన్నాడు రమణ.

'కాఫీ తాగుతుండగా'

'ఎక్కడ చూసేరు?'

'టేబులుమీద'

'టేబులుమీద వుందా? ఎవరైనా తెచ్చి యిచ్చారా?'

'ఎవరూ తేలేదు. టేబులుమీద నా ఎడ్రసులో వుంటే చూసేను.'

'ఏమిటిరా యీ అడ్డదిడ్డ ప్రశ్నలు డిటెక్టివ్ నవలల్లో డిటెక్టివ్ లాగ' అన్నారు రామారావుగారు. అక్కడికి ఆయన ఏ కేసులోనూ అలా ప్రశ్నించనట్టు.

'ఉండు మామయ్యా. ఏదీ సీరియస్ గా తీసుకోవేం నువ్వు' అన్నాడు రమణ.

'చూడండీ మీరు కాఫీ తాగకముందు ఎక్కడ వున్నారు?'

'పక్క గదిలో పడుకున్నాను.'

'ఈ గదిలోకి మీకు మీరుగా వచ్చేరా? వరైనా ఏదైనా పనిమీద పిలిచేరా?'

"నా బుచ్చి నే పడుకున్న గదిలోకి తొంగిచూసేడు. ఎందుకని అడిగేను. అప్పుడే మెలకువవచ్చి మంచంమీద ఆలోచిస్తూ పడుకుని వుండడాన్ని, వాడు గదిలోకి చూడడం చూసేను. 'కాఫీ తెమ్మంటారా?' అని అడిగేడు. తెమ్మని చెప్పి యీ గదిలోకి వచ్చి కాఫీ తాగుతూ వున్నప్పుడు టేబిలుమీద ఈ ఉత్తరం చూసేను."

'బుచ్చి ఎవరూ?'

'మా మేనల్లుడు. ఇక్కడ చదువుకుంటున్నాడు.'

'ఒకసారి పిలిపిస్తారా?'

'ఆ!.. బుచ్చీ!...బుచ్చీ! యిలా రా ఒకసారి.' అన్నాడు కృష్ణమూర్తి. చూస్తూ చూస్తూ బుచ్చిమీద నేరం తోసెయ్యడానికి చూస్తున్నాడేమో ననిపించింది నాకు. రామారావుగారి వాలకం కూడా చూస్తుంటే యీ యిద్దరూ కలిసి ఏదో నాటకం ఆడుతున్నారేమోనని అనుమానంగా వుంది.

'వస్తున్నా మావయ్యా' అని లోపల నుండి మాట వినపడింది. కొద్దిసేపటిలో తలుపు తెరచుకుంది. బుచ్చి వచ్చాడు తలుపు మళ్లీ దగ్గరకు వేసేస్తూ.

'ఏం! మావయ్యా?'

'చూడు ఆ రమణగారికేదో కావాలట, తెచ్చిపెట్టు'

'అబ్బ అబ్బ! ఆ ఎంతకూ బజారుకు గాని వెళ్లావేమోనని'

'వెళ్లానండి. మీకేం కావాలో చెప్పండి'

'అయితే ఒక కాగితం మీద వ్రాయి. ఒక సెట్ కేరమ్సు పిక్కలూ'

'అవెందుకురా యిప్పుడు' అన్నారు రామారావుగారు.

'కావాలి మావయ్యా'

'వుండండి తెల్ల కాగితం తెస్తాను' అని బుచ్చి లోపలకు వెళ్లేడు. నాకు అంతా అయోమయంగా వుంది. ఇప్పటివరకూ ఆ ఉత్తరం సంగతేమిటో చూడాలని పెద్దకబుర్లు చెప్పిన వాడు యిప్పుడు కేరమ్సు పిక్కలు తెచ్చి పెట్టమని బుచ్చికి పని పురమాయిస్తాడేం. తను ఎలాగా యింకొక అరగంట గంటలో బజారువైపు వెళ్తాడు కదా, అప్పుడు తెమ్మనకో లేదూ.

'ఆ! చెప్పండి' అంటూ తను తెచ్చిన ఎక్సర్సయిజు పుస్తకం, మధ్య పేజీ దగ్గర మడిచి పెట్టి టేబిలుమీద పెట్టి పెన్సిలు పుస్తకంమీద పెట్టి రమణ కళ్లల్లో చూస్తున్నాడు బుచ్చి. రామారావుగారు విసుగు పుట్టి కాబోలు చిన్న మాగన్ను వేస్తున్నారు మెడ ఓ పక్కకు వాల్చి. కృష్ణమూర్తి ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

'ఆ! ఏది! ఏది! ఏమిటా పుస్తకం మానోట్సా? ఏం నోట్సు' అన్నాడు రమణ.

'సోషల్ స్టడీస్ నోట్సండీ' అంటూ పుస్తకం రమణ వైపు జరిపేడు బుచ్చి.

'దస్తూరి బాగుందే! ఆ! సరేలే ముందు వ్రాసుకో చెబుతాను' అని పుస్తకం మళ్లీ యిచ్చేస్తూ 'ఒక సెట్ కేరమ్సు పిక్కలూ' అన్నాడు రమణ.

'తర్వాత'

'తర్వాత, ఓ రెండు సిజరు పేకెట్సూ'

'తర్వాత'

'తర్వాతా! తర్వాతా!...మిగిలినవి తర్వాత కొనుక్కుంటానులే, యీ వేళటికివి తెచ్చిపెట్టు' అన్నాడు రమణ.

'ఓస్ యింతేనటండీ! వీటికే పద్దు వ్రాయించాలా? ఇవి జ్ఞాపకం వుండవా?' అన్నాడు బుచ్చి. కృష్ణమూర్తి కొంత యీ లోకంలో పడి 'అన్నట్టు మాడు బుచ్చీ! యీ గొడవలో కాఫీలమాటే మరిచాను. కాఫీలు తీసుకొని వచ్చి బజారులో కేవలసిన వేమన్నా వుంటే మనకు కూడా తీసుకురా' అన్నాడు.

'ఆ!' అంటూ ఎక్సర్సయిజు పుస్తకములో పద్దు వ్రాసిన కాగితం చింపుకుని వెళ్ళిపోయాడు బుచ్చి. ఒకసారి ఆ ఎక్సర్సయిజు పుస్తకం అందుకుని చూస్తున్నాడు రమణ. కాఫీమాట వినపడి కాబోలు రామారావుగారు మగత నిద్రలోంచి మందహాసం చేస్తూ లేచేరు. రమణ ఉత్తరంతీసి పుస్తకంలో ఒక పేజీమీద పెట్టి ఉత్తరం పైపూ పక్క పేజీలో వున్న అక్షరాలవైపూ మాటి మాటికి చూస్తున్నాడు. మొహం గంభీరంగా వుంది. నేను అతన్ని పరిశీలిస్తున్నట్టు అతనికి తెలియడమే లేదు పాపం. చివర్న 'ప్చ్' అని ఎక్సర్సయిజుపుస్తకం టేబిలుమీద తన దగ్గర నుండి జరిపి ఉత్తరం టేబిలు మధ్య పడేసేడు. ఇంతలో బుచ్చి కాఫీ ఫలహారాల ట్రే రెండు చేతులతోనూ పట్టుకుని వచ్చాడు. కాఫీ ఫలహారాలు అందరిదగ్గర పెట్టేసి యింట్లోకి వెళ్ళిపోయాడు. నేనూ, రామారావుగారూ మాత్రం వెంటనే వేడివేడి పెసరట్లకి తల పడ్డాం. కృష్ణమూర్తి కాఫీ గ్లాసు దగ్గరకు తీసుకొని గ్లాసు చేతితో పట్టుకుని ఆలోచిస్తున్నాడు. రమణ కాఫీ ఫలహారాలు ఏవీ ముట్టుకోకుండా తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

రామారావుగారు పెసరట్టు చిదిమి నోట్లో వేసుకొని 'డిటెక్టివ్ రమణబాబూ! భయంకర నారీ చోర్ ఆమాకీ ఏమైనా తేలిందా?' అన్నారు పరిహాస పూర్వకంగా. కృష్ణమూర్తి ఏమీ అనలేక బాధగా చూసేడు రామారావు గారివైపు.

'సారీ కృష్ణమూర్తిగారూ! నేను మంచి చెడ్డా తెలియకుండా ప్రవర్తిస్తున్నానేమో నా వెర్రిలో. కాని మీరేం బెంగపెట్టు



పోకండి. మీ అమ్మాయి పెళ్లి నిర్విఘ్నంగా కొనసాగించే పూచీ మాది పోలీసు ఉద్యోగి నేనున్నానా, కాస్తో, కూస్తో సహాయపడ గలను. ఇంక ఏతగువులు వచ్చినా ఫీజు పుచ్చుకోకుండా కేసునడిపించే మీ బాల్య స్నేహితులు వారు ఎలానూ వున్నారు (నన్ను ఉద్దేశిస్తూ). కొంత చురుకుగా ఆలోచించి సాయపడటానికి మా వాడు రమణ ఎలానూ వున్నాడు. ఇంక మీకు యిబ్బంది ఏముంది. చెప్పండి! అన్నారు రామారావు గారు. నేనుకూడా కృష్ణమూర్తికి ధైర్యం కలుగజేసే మాటలు నాలుగు చెప్పేను. కృష్ణమూర్తి కొంత తేలికపడ్డట్టు రమణకూడా 'మరేం ఫర్వాలేదులెండి' అనే టప్పటికి కృష్ణమూర్తికి బాగా ధైర్యం వచ్చింది. మేం యింక ఆవేళటి సమావేశం ముగించి లేవబోతున్నాం.

'ఎందుకైనా మంచిది. ఉత్తరం గురించి పైకి ఎవరికీ తెలియకుండా కట్టుదిట్టం చెయ్యండి. ముఖ్యంగా యింటి లోపల. పెళ్ళినాడు నైట్ డ్యూటీలేని ఓ నలుగురు కానిస్టేబుల్స్‌ను మఫ్టీలో రమ్మంటాను. నేను, రమణ, యీయన ఎలానూ పెళ్లి మందిరంలో వుండనేవుంటాం. ఫోన్ కాల్ వస్తే వెంటనే రావడానికి సిద్ధంగావుండమని రెండవ సబ్‌యిన్‌స్పెక్టర్కి చెప్పి అన్ని ఏర్పాటులు చేయిస్తాను. ఇంతకీ పెళ్ళికి యింకా ఎన్నిరోజులుంది?' అన్నారు రామారావు.

'ఈవేళ 10వ తారీఖు, 15వ తేదీ రాత్రి 2-35 గంII పెళ్ళి. అంతా కలిసి అయిదు రోజులుమధ్యవ్యవధి' అన్నాడు కృష్ణమూర్తి.

'ఫర్వాలేదు ఏర్పాట్లు చురుకుగా సాగనీయండి' అన్నాడు రామారావుగారు. సమావేశం పూర్తిచేసి వీధిలో పడ్డాం.

తర్వాత రోజూ సాయంత్రం మేం నలుగురం కలుసుకుంటూనే ఉన్నాం. చుట్టాలతో కృష్ణమూర్తి యిల్లు అప్పుడే నానా గొడవగా ఉంది. రమణ పాపం చాలా శ్రమపడి నిజంగా డిటెక్టివ్‌లా చాలా పరిశోధనలు చేసేడట. సుశీల యస్. యస్. యల్. సి. పరీక్షకు యీ సంవత్సరమే వెళ్లింది. ఏమైనా ప్రేమ వ్యవహారాలున్నాయేమోనని చాలాగే అనుమానించి, చాలా శ్రమపడి సుశీలతో చదువుకున్న విద్యార్థుల దగర భోగట్టా సంపాదించేడట. కాని అందరూ ఆమె చాలా బుద్ధిమంతురాలూ, తెలివైనదీ నని ఆమె అంటే క్లాసు అందరూ గౌరవ భావంతో చూసేవారని చెప్పేరట. అతను పడిన శ్రమవల్ల యీ ఆకాశరామన్న ఉత్తరం ఏవిధమైన ప్రేమ వ్యవహారాల పర్యవసానమూ కాదని మాత్రం ఖచ్చితంగా తేలిందట. ఎవరో ఆమె అంటే అసూయపడేవాళ్లో, ఈసు పోక పెంకితనానికో వ్రాసుంటారు అంటాడు. ఆ ఉత్తరం ఎక్కడనుండో పైఊరినుండి వచ్చింది కాదనీ ఊరిలో వాళ్లు వ్రాసిందేననీ అందుకు నిదర్శనం ఉత్తరం మీద స్టాంపుగాని పోస్టు ముద్రగాని లేకపోవడమేనని అంటాడు. అంతేకాదు. బుచ్చే ఆ ఉత్తరం వ్రాసి ఉంటాడని చిన్న సూచనచేసి, అయినా ఖచ్చితంగా బుచ్చి అని తేల్చి చెప్పడానికి అనుమానమేగాని నిదర్శనం ఏమీ లేదంటాడు. ఈ పరిశోధనల సారాంశం వాళ్లమేనమామకు కూడా చెప్పకుండా నా ఒక్కడికే చెప్పేవాడు.

ఉత్తరం వ్రాసిన వ్యక్తి ఎవరో తెలియకుండానే పెళ్లిరోజు వచ్చింది. ఎంత ధైర్యం వహించినా కృష్ణమూర్తి బాధపడ్తూనే వున్నాడు. ఏమౌతుందోనని ఆందోళన చెందుతూనే వున్నాడు. రాత్రి రెండు గంటలు దాటింది. రామారావుగారు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి కృష్ణమూర్తితో ఆ విషయం చెప్పేరు. కృష్ణమూర్తిలో ఉత్సాహంలేదు. మెల్లిగా నిమిషాలు దొర్లుతున్నాయి. పెళ్లిపందిరి రకరకాల శబ్దాలతో నిండివుంది. దీపాలు కాంతివంతంగా వెలుగుతున్నాయి. కొందరు యిటూఅటూ తొందర తొందరగా తిరుగుతున్నారు. విసనకర్రలు రెపరెపలాడుతున్నాయి. అప్పుడప్పుడు ఎవరో ఒక చంటిపిల్లడు ఏడుస్తున్నాడు. పాత పరిచయాలు, కొత్త స్నేహాలు జరుగుతున్నాయి. చుట్టరికాలు తెలుసుకుంటున్నారు. ఇంకా మెలకువగా వుండగలిగిన చంటిపిల్లలు కొందరు పందిరిరాటలదగ్గర ఆడుకుంటున్నారు. వివాహ తతంగం క్రమేపీ ప్రారంభం అయింది.

రెండు గంటలూ, ముప్ఫైయిదు నిముషాలూ దాటాయి. ఇటూఅటూ తిరిగేవాళ్ల చురుకు హెచ్చింది. అల్లది తేరా అంటే యిల్లిది తేరా అని ఎక్కడుందంటే ఎక్కడుంది అని గొడవపెట్టేస్తున్నారు. రామారావుగారు హడావడిగా వచ్చి 'మాశారా! ఇంత ఆర్భాటం చేస్తే ఏ గొడవ జరగలేదు' అన్నారు. నేను కొంత పరధ్యానంమీద 'ఏ గొడవండీ?' అన్నాను. 'అదేనండీ పెళ్లికూతుర్ని పట్టుకు పారిపోతానని ప్రగల్భాలు పలికేడుకదూ! ఆ వెధవ ఎవడో' అన్నారు, ఎవరైనా వింటున్నారేమోనని పక్కకి చూస్తూ. 'అదటండీ! మంగళ సూత్రధారణ సమయానికి ఎత్తుకుపోతానన్నాడుగాని ఇప్పుడే ఎతుకుపోతాననలేదే' అన్నాను. 'అవును కదండీ! ఆ మాటే మరిచిపోయాను. ఇంకా రెండూ ముప్ఫైఅయిదుకే నేమో అనుకుంటున్నాను, సరే వస్తాను' అని తను ఎక్కడ వుంటున్నారో అక్కడికి పోయి కూర్చున్నారు.

నేను మాటిమాటికి వాచీవైపూ, పెళ్లి అరుగువైపూ చూస్తున్నాను. మేం నిర్ణయం ప్రకారం ఒకొక్కరం ఒకొక్క కీలక స్థానంలో వున్నాం. మెయిన్ స్విచ్ దగ్గర ఆ సమయానికి ఎవడూ వచ్చి లైట్లు ఆర్పేయకుండా ఒక నమ్మకమైన మనిషిని వుండమన్నాం. పురోహితుడు మంగళసూత్రాలూ అక్షతలూ పట్టుకొని పెద్దలందరి దగ్గరకు వెళ్తున్నాడు. పెద్దలందరూ మంగళసూత్రాలు చేతితో తాకి కొన్ని అక్షతలు తీసుకుంటున్నారు. నేనూ అక్షతలు పుచ్చుకుని నిలబడ్డాను. పురోహితుడు మంగళసూత్రాలు పెళ్లి అరుగువైపు పట్టుకొనివెళ్లేడు. నేను పెళ్లికూతురు కూర్చున్నవైపు తదేక దీక్షగా చూస్తున్నాను. నీలిరంగు బనారసుచీర, ఆపైన నల్లటి పొడుగాటి జడ, జడమీద పువ్వులూ ఇంకా ఏవో అలంకారాలు కనపడ్తున్నాయి. క్రమేపీ పెళ్లికూతురు కూర్చున్నచోట తెల్లటి మచ్చలా కనపడ్డది. ఏదో నల్లటిమచ్చ ఆ తెల్లటి మచ్చకంటే పొడుగ్గావచ్చి దానిని కప్పేసింది. పెళ్ళికూతురు ఏమైపోయినట్టు? కళ్లు గట్టిగానులిమి చూసేను. పెళ్లికూతురు పెళ్లికూతురులాగే తలవంచుకుని కూర్చుంది. పెళ్ళికొడుకు మంగళసూత్రం కట్టేసి కాబోలు తన యథాస్థానంలోకి పోయి కూర్చుంటున్నాడు. ఇంకొకసారి కళ్లు తుడుచుకుని చూసేను. అందరూ వధూవరులమీద అక్షతలు జల్లుతున్నారు. మందహాసంతో ఉత్సాహంగా

నేను నా చేతిలో అక్షతలు వాళ్ళమీద జల్లేను.

పెళ్ళిపీటలమీద జరగవలసిన తంతుపూర్తి కావస్తున్నది. నేనూ, రమణ, రామారావు గారూ విజయగర్వంతో కృష్ణమూర్తి స్టడీ రూములోకి వెళ్ళేం. పెళ్ళికోసం గదులు ఖాళీచేయవలసి రావడాన్ని కాబోలు గది నిండా మంచాలూ, పెట్టెలూవున్నాయి. ఒక పక్క గాజు అద్దాల బీరువాల్లో మాత్రం కృష్ణమూర్తి కొనుక్కున్న పుస్తకాలు న్నాయి. అతను ధనవంతుడవడాన్ని, బి.ఏ. వరకు చదివినవాడవడాన్ని, వేరేగా పనిచేయ నవసరం లేకపోవడాన్ని రకరకాల పుస్తకాలు కొంటుంటాడు. తరచూ ఏదో ఒక పుస్తకం చదువుకుంటుంటాడు. నేనూ, రామారావుగారు గది మధ్య టేబిలు దగ్గర వున్న కుర్చీలలో కూర్చున్నాం. రమణమాత్రం బీరువాల దగ్గరకువెళ్ళి పుస్తకాలు చూస్తున్నాడు. ఇంతలో కృష్ణమూర్తి కూడా లోపలికి వచ్చేడు, 'అమ్మయ్య! ఇప్పుడు ప్రాణాలు కుదుటపడ్డాయి' అనుకుంటూ.

'ఏమండీ! మీరు డిటెక్టివ్ నవలలు ఏమైనా చదువుతారా' అన్నాడు రమణ కృష్ణమూర్తి నుద్దేశించి.

'ఇప్పుడు తక్కువగాని కొన్నాళ్ళకిందట కనబడిన డిటెక్టివ్ నవలల్లా చదివేను. ఇప్పటికీ చాల తెలుగుడిటెక్టివ్ నవలలు నా దగ్గర వున్నాయికూడా'

'డిటెక్టివ్ నవలలంటే జ్ఞాపకం వచ్చింది. డిటెక్టివ్ రమణబాబూ! భయంకర నారీచోర్ ఎవరో తేలిందా' అన్నారు రామారావు. గుమ్మందగ్గరనుండి ఎవరో వెళ్ళినట్టయింది. అటు పక్క చూసేను బుచ్చి వెళ్ళిపోతున్నాడు.

'ఏం! పోలీసు ఉద్యోగులు కదా దొంగను పట్టుకోలేక పోయారా?' అన్నాడు రమణ.

ఎప్పుడూ మరి డిటెక్టివ్ నవలల్లో యినస్పెక్టర్ దొంగను పట్టలేకపోవడం, డిటెక్టివ్ పట్టేయడం మామూలేకదటోయ్. అందుకే నేనంత శ్రమపడలేదు అపరాధ పరిశోధకుడివి నువ్వున్నావుకదా అని'

'అదే ఆశ్చర్యంగా వుంది. ఉత్తరం వ్రాసి అంతటా హడలగొట్టిన దెవరా అని ఎంత ఆలోచించినా ఎవరో, ఎందుకు వ్రాశారో తెలియడంలేదు' అన్నాడు కృష్ణమూర్తి.

'ఉత్తరం వ్రాసిందెవరో నేను చెబుతాను కాని నాకు ఒక హామి యివ్వాలి' అన్నాడు రమణ. నేను ఆశ్చర్యపోయాను. దొంగ ఎవరో అతను చెప్పకముందే పోల్చుకుని చెప్పదామని ఆలోచిస్తున్నాను. రామారావుగారు, కృష్ణమూర్తి రమణవైపు చూస్తూ వుండిపోయారు.

'ఏం! హామీయిస్తారా మరి!'

'ఓ! ఏమిటి చెప్పండి!'

'మీరు డిటెక్టివ్ నవలలు మొట్టమొదట్లో చదివినప్పుడు ఆలోచనలు జ్ఞాపకం వున్నాయా? మీరు ఆ నవలల్లోలాగ ఉత్తరాలు వ్రాసి యెవరినైనా భయపెడ్దామని అనుకునేవారా? '

'అలాగే సరదాకి ఎవరో యీ ఉత్తరం వ్రాసేడంటావ్. అది నువ్వు చెప్పేదేమిటి? నేను మొదట్లోనే అన్నానుకదూ ఎవడో పెంకితనంగా వ్రాసివుంటాడని' అన్నారు రామారావు.

'ఎవరో ఏమిటి యీ రమణ మహానుభావుడే వ్రాసివుంటాడు. ఇప్పుడు తమాషాలు కోరి నిజం బయటపెట్టేద్దామని తాపత్రయ పడుతున్నాడు. లేకపోతే చిన్నతనంలో అంతలా మసలిన యీ యిల్లు ఎందుకు మరిచిపోతాడు, వచ్చిన వెంటనే రాకపోవడానికి. ఏమీ ఎరగని వాడిలా మర్నాడు వాళ్ళ మావయ్యతో వస్తే ఆ ఉత్తరం తనే ఎప్పుడో వచ్చి ఎవరూ లేనప్పుడు గదిలో టేబిలుమీద పడేసినట్టు తెలియకుండా వుంటుందని వేసేడు ఎత్తు' అనుకున్నాను నేను.

'అంచేత ఉత్తరం వ్రాసిన వ్యక్తిని కోప్పడ్డం గాని, కొట్టడం గాని ఏమీ చెయ్యనని హామీ యిస్తే అతని పేరు చెబుతాను' అన్నాడు రమణ,

'అలాగే. ఇంతకీ ఎవరు!'

'చెబుతాగాని మీరు ఏమీ అనుకోపోతే బుచ్చిని ఒకసారి పిలవండి.'

కృష్ణమూర్తి బుచ్చిని పిలిచేడు. పెళ్ళి హడావడిలో వుండడాన్నో, నిద్రలేక పోవడాన్నో బుచ్చి మొహం కళావిహీనంగా వుంది. చలాకీగా లేడు. పిలిస్తే కాదనలేక వచ్చినట్టు కనపడ్డాడు.

'చూడు బుచ్చీ! నువ్వు క్లాసు పుస్తకాలు కాక పైపుస్తకాలు ఏమైనా చదువుతావా? అదే పనిగా క్లాసు పుస్తకాలు చదువుకుంటావా?'

బుచ్చి కృష్ణమూర్తి వైపు చూసి మళ్ళీ రమణవైపు చూసేడు. జవాబియ్యలేదు.

'మీ మావయ్య ఏం అనరులే చెప్ప భయంలేదు' అన్నాడు రమణ.

'చదువుతానండీ పత్రికలూ అవీనూ'

'డిటెక్టివ్ నవలలు కూడా చదువుతావు కదూ?'

'అవునండీ'

'ఈమధ్య ఏవైనా డిటెక్టివ్ నవలలు చదివావా? మంచిమంచి నవలలున్నట్టున్నాయి కదూ యింట్లో.'

'అవునండీ యీమధ్య ఒకటి చదివేను.'

'నారంరోజుల కిందట కదూ చదివేవు'

'ఆ! ఆ! మీకెలా తెలిసిందండీ. నేను చాటుగా మేడమీద గదిలో చదువుకుంటేను'.

'సరే గాని 'భయంకర నారీచోర్' అంటే ఏమిటి?'

బుచ్చి తెల్లపోయి కొద్దిసేపు పోయాక జవాబు చెప్పేడు, 'నారీ అంటే స్త్రీ అండి, చోర్ అంటే దొంగన్నమాట. ఆడవాళ్ళను ఎత్తుకుపోయే దొంగ అని అర్థం'.

'నీకు హిందీ వచ్చా?'

'ఆ! మాకు నేర్పుతున్నారండి'

'సరే నువ్వు వెళ్ళి పడుకో. రాత్రి అంతా నిద్రలేదు'

'ఎందుకో పిలిచేరు'

'అవును. కాని మర్చిపోయేను మాటల్లో. రేపు చెబుతానులే వెళ్ళి పడుకో' అన్నాడు రమణ. బుచ్చి వెళ్ళిపోయేడు.

'ఇప్పుడు ఎవరో తెలిసిందాండి; భయంకర నారీ చోరుడు!'

బుచ్చే నని అందామనుకున్నాను గాని ముందే నేను అనడం ఎందుకని వూరుకున్నాను.

'ఇంకెవరు బుచ్చే' అన్నారు రామారావుగారు.

'ఎవరూ! వీడే! వాడు పెంకివెధవ అని తెలుసును గాని, వాడే వ్రాసి వుంటాడని నాకు అనుమానం కలగలేదండీ! మీరెలా పోల్చారూ?' అన్నాడు కృష్ణమూర్తి రమణ నుద్దేశిస్తు.

'పోల్చడానికేముందండీ! ముందు ఉత్తరం పరీక్షగా చూసేను. ఎక్కడా పోస్టుముద్ర లేదు. స్టాంపులేదు. అంచేత వూరిలో వున్న వారి పనే నని అనుమానం కలిగింది. కవరు కూడా ఆహ్వానాలవీ పంపేదానిలానే వుంది కాని మామూలు కవరుకాదు. లోపల ఉత్తరం చూసేను. ఎఱ్ఱరంగు ఉల్లిపొర కాగితం అది. అది చూడగానే పెళ్ళిళ్ళలో వెండి బంగారు సామాను కొన్నప్పుడు చుట్టియిచ్చే ఉల్లిపొరకాగితం జ్ఞాపకం వచ్చింది. లేదా పందిరిరాటలకు అంటించడానికి తెచ్చిందైనా అయివుంటుందని అనుకున్నాను.

కవరుకు ఎక్కడైనా పసుపు అంటించి

(56-వ పేజీ చూడండి)

# ఆంతర్యాలు

ఆ సెకండుక్లాసు (అంటే పూర్వపు ఇంటరు క్లాసు) పెట్టెలో తగుమాత్రముగా జనం ఉన్నప్పటికీ శర్మగారికి రెండు వైపులా చెరొకరు యిద్దరూ కూచోదగినంత స్థలం మిగిలేవుంది. కాబట్టి మాంఛి లాఫీగా కూచున్నారు ఆయన. సన్నగోరంచు ముతక పంచ, ఖద్దరుగా చలామణీ అయ్యే నేత గుడ్డతో కుట్టిన లాల్చీ వేసుకుని, ఒక అపరాధ పరిశోధకనవల చదువుతూ కూచున్నారు. పైన ఉత్తరీయం వేసుకోవటం హైందవ సంప్రదాయమే గాని తనవృత్తికి ఆటంకం అవుతుందనే నమ్మకంతో ఆయన అదినించీ దానిని విసర్జించాడు. తీర్చిదిద్దిన విభూతిరేఖలు, వాటిమధ్య పూర్వపు అర్ధణా కాసుకి ఇంచుమించు గా గంధాక్షతలు ఆయన సదాచారసంపన్నతకు ప్రత్యక్ష తార్కాణాలు. ఏదో భుక్తికోసం ఈ వృత్తిని స్వీకరించటంవల్ల లౌకికంగా ఉంటున్నారు గాని, లేకపోయినట్లయితే తప్పకుండా వారు మున్యాశ్రమాల్లోనే ఆధ్యాత్మిక చింతనలో కాలం గడిపే వారని ఆయన్ని చూసినవారందరికీ అనిపించక మానదు.

ఎందుకైనా ముందు జాగ్రత్త మంచిదనే అభిప్రాయంతో ఆయన కిటికీలకు దగ్గరగా నున్న ఒల్లమీద కాక మధ్యనున్న బల్లమీద కూచున్నారు. దీనినిగురించి ఆయన ఒక అరగంటవరకూ చెప్పగలరు—వినేవారికి ఓపిక అంటూ ఉంటే... రైల్లో కిటికీల దగ్గర కూచుని ప్రయాణిస్తూ ప్రమాదానికి గురైన వాళ్ల వివరాలు లేదంటే ఒక వందమందిని గురించిన భోగట్టా ఆయనదగ్గర ఉంది. ఐతే ఇప్పుడు అవన్నీ చెప్పే స్థితిలో లేరు ఆయన. తన చేతిలోని పుస్తకంలో కథ మాంఛి పట్టులో నడుస్తూండడం చేత ఆయన అందులో లీనమయిపోయాడు ఒకసారి కనుబొమలు ముడివేసి చాలా తీవ్రమయిన సమస్యలను గురించి ఆలోచిస్తున్నట్టుగా ఉంటారు. అంతలో ఆ చిక్కు కాస్తా విడిపోయినట్టుగా తృప్తిగా గాలి పీలుస్తారు. మరొకసారి—కథలో చక్కటి సన్నివేశం ఏదైనా తగిలికాబోలు - బాగా సరుకుని కూచుంటారు. ఇలాగ ఆయన అందులో మునిగిపోయి తన చుట్టుప్రక్కల ఏం జరుగుతున్నదీ తెలుసుకోలేని స్థితిలో ఉన్నారు.

అంతవరకూ అంత ఏకాగ్రతతో చదువుతున్న శర్మగారు అప్పుడు కిటికీలోంచి లోపలికి వీచిన చలిగాలిని లెక్కచెయ్యక తప్పింది కాదు. దాంతో అప్రయత్నంగా ఆయన చెయ్యి జేబులో వున్న సిగరెట్టుకేసుమీదికి పోయింది. పెట్టె తెరచి నాజూకుగా ఒక్క సిగరెట్టు తీసి పెదిమలకు తగిలించి, దానిని అంటించి వెంటనే తీసివేశారు. ఆ సిగరెట్టును కుడిచేతి మాపుడి వేలుకి, మధ్యవేలుకి మధ్యగా నుంచి, పిడికిలి బిగించి, చూపుడు వేలుకి, బొటనవేలుకి మధ్య నేర్పడ్డ ఖాళీ స్థలాన్ని మూతికి దగ్గరగా జేర్చి, రైలుపెట్టె కప్పుకేసి చూస్తూ ఒక్కదమ్ము లాగారు. ఆ పొగని మాత్రం సుమారు అరనిమిషందాకా బయటికి వదలకుండా "పొగంతా ఏమయిందో చెప్పకోండి చూద్దాం!" అన్నట్లు నలుగురి ముఖాల్లోకి చూశారు. అయితే ఎవరూ ఆయనను చూడకపోవటంచేత నిరుత్సాహపడ్డారు. కాని అల్లంతదూరాన తల్లికొంగు పట్టుకుని మారాంచేస్తున్న పసివాడొకడు తనకేసి పరకాయించి చూడటం గమనించి, వాడిముఖంకేసి చూస్తూ ఆ పొగని వదిలారు. సంభ్రమాశ్చర్యాలతో "భలే! భలే!" అంటూ చప్పట్లు చరిచాడు వాడు తను చేసిన ఘనకార్యాన్ని చూసి మెచ్చుకున్నవాడొకడైనా ఉన్నందుకు యెంతో సంతోషించారు ఆయన. ఇట్లాగ సిగరెట్టు కాల్పటంలో వైవిధ్యాన్ని ప్రదర్శిస్తూ తన శక్తిసామర్థ్యాలకి తానే మురిసిపోతున్నారు. సిగరెట్టు అంతా పూర్తి అయేవరకు దాని తాలూకు మసిని దానినుండి ఆయన వేరు చేయలేదు మధ్య మధ్య నాలుగైదు సార్లు 'ఆ మసిని దులిపివెయ్యటానికా' అన్నట్లు కుడిచేతి వేళ్లతో అతి నాజూకుగా చిటికెలు వేశారు. కాని ఆ అగురుకు నుసి సిగరెట్టునుండి వేరుకాకుండా జాగ్రత్తపడ్డారు. అందుచేత కాలిపోయిన సిగరెట్టును సైనా కాని ఆకారంలోమాత్రం సిగరెట్టులాగే ఉండి, కాలవలసిన సిగరెట్టుభాగం, కాలిన సిగరెట్టుభాగం కలిపితే సరిగా సిగరెట్టు అంత పొడవూ ఉండిపోయింది చివరిదాకా. అది పూర్తయేసరికి ఆయనలో అంతకుముందుకంటె ఎక్కువ ఉత్సాహం వచ్చింది ఆ నూతనోత్సాహంలో ఆయన పుస్తకం తీసుకుని మళ్ళా చదవటం మొదలుపెట్టారు.

చదువుతూ చదువుతూ అలవాటుచొప్పున ఎడమచేతి మునివేళ్లతో మీసాలని సవరించారు. ఆపని ఆయన చేసేసరికి దగ్గరలో నవ్వులు, గుసగుసలు వినిపించాయి. ఏమిటో అని అటుకేసి చూశారు. కొందరు కుర్రాళ్లు తనకేసే చూసి నవ్వుతున్నారు. మొదట్లో కారణం స్పష్టంగా తెలియలేదు. కాని అంతలో చటుక్కున స్ఫురణకొచ్చింది. వాళ్ళు తన మీసాలనిచూసి నవ్వుతున్నట్టుగా తోచింది. వెంటనే మరుగుదొడ్లోకి వెళ్ళి అద్దంలో చూసుకున్నారు తన అనుమానమే నిజమయింది. మునివేళ్ళతో మీసాలని సవరించుకున్నప్పుడు వాటిలోని తెల్లని వెంట్రుకలు బయటపడ్డాయి అది చూసే వాళ్ళు నవ్వారు. అసలు బయలుదేరేటప్పుడే అనుకున్నారు—ఇంటికి జేరేవరకు మీసాలమీద చెయ్యి వెయ్యకూడదని... అయితేనేం - అలవాటుకొద్దీ వెయ్యటమూ, అంతలో శ్వేతకేశాలు బయట పడటమూ, అవి ఆ కొంటె కుర్రవాళ్ళ కంట బడటమూ .. ఇన్నీ జరిగాయి ఇంకాకూ ఇదంతా ఖర్మ... కాకపోతే ఏమిటి? ఇంటిదగ్గర బయలుగెరేటప్పుడు ఎంత వెదికినా మీసాలకి వేసుకు నేరంగు కనిపించలేదు. అంతకు ముందునాడు చంటాడు దాన్తో ఆడుతున్నాడు. అప్పుడు అది వాడి చేతులోంచి తీసి వాడిని ఏడిపించటం ఎందుకులే అని ఉపేక్ష చేశాడు తను తీరా మర్నాడు ఉదయం తను ప్రయాణం కావలసి వచ్చే వేళకి అది కనిపించలేదు ఎక్కడుందో తీరిగ్గా వెతుకుదామంటే వ్యవధి లేదు .. పోనీ కొత్తది కొనుక్కుందామంటే ఇంకా తెల్లవారలేదు...అందువల్ల ఎలాగో సరి

మధిర భానుమూర్తి

పెట్టుకుని పైకి నల్లనివెంట్రుకలే కనిపించేటట్టు జాగ్రత్తగా సర్ది ఎలాగూ సాయంత్రానికి వచ్చెయ్యవచ్చును గదా అని ప్రయాణమయ్యాడు. ఆ బయలుదేరే టప్పుడే తిరిగి ఇంటికి వచ్చేవరకు మీసాలమీద చెయ్యి వెయ్యకూడదని, వచ్చిన తరువాత ఆ రంగు సంపాదించటం తేలికే గనక ఇక ఏ బాధా ఉండదని అనుకున్నాడు. కాని అప్రయత్నంగా ఈ పని జరిగినందుకు ఎంతో నొచ్చుకున్నాడు.

అసలు ఈ రంగు రాయటం అలవాటు చేసుకున్నందుకు తనని తాను ఎంతగానో నిందించుకున్నాడు. అయినా ఇది తనకు తానయి కోరి చేసుకున్న అలవాటు కాదు. ఆ రావు చేశాడు. వాడు అరవైఅయిదేళ్ళకి పైబడ్డ వయసున్నా కాని ముప్ఫయి సంవత్సరాల బాలాకుమారుడిలాగా అగుపించాలని ఆరాటంలో నెరసినజుట్టుకి నల్లరంగు ముడతలుపడ్డ ముఖానికి పైపూతలు...ఇంకా ఎన్నో చేస్తాడు. ఈ తయారీలో సుమారు రెండుగంటలేనా గడుపుతాడు ప్రతిరోజూ. వాడిని చూడటానికి తను ఒకసారి వెళ్తే అక్కడ వాడు పట్టించాడు, తన మీసాలకి ఈ రంగు. తన మీసాలకి ఆ రంగు వేస్తే మంచి అందం వస్తుందంటూ తన అంగీకారాన్నైనా తెలుసుకోకుండా వాడే పూసి వేశాడు. అద్దంలో చూసుకుంటే తనకి కూడా బాగానే ఉన్నట్టనిపించింది. ఇంతలో ఎరుకున్న వాళ్ళు నలుగురైదుగురు అక్కడకి వచ్చారు. వస్తూనే వారంతా తన మీసాలకేసి పరకాయించి చూసి "డాక్టరు గారు ఏదో మందు కనిపెట్టినట్టున్నారే!...అయినా రావు గారంత ముసలివారు కాదు గనక మీకు మందు పట్టిచ్చింది కాబోలు!...ఆలోచన లెక్కువ గనక తలమీది జుట్టు నల్లబడ దనుకుంటా...కాని ఇక రావు గారికి మాత్రం ఈ రంగు తప్పదు..." అన్నారు. వారు తనని వేళాకోళం చేస్తున్నారో, నిజంగా అంటున్నారో తెలియలేదు తనకి. కాని రావుని ప్రత్యక్షంగా వేళాకోళం చెయ్యటంచేత తనని నిజంగా మెచ్చుకుంటున్నారని విశ్వసించవలసి వచ్చింది. వారి బారినుండి తప్పించుకుందుకు లేక "ఏదో?...పని చేసిందండి..." అంటూ అస్పష్టంగా నీళ్లు నమిలాడు తను.

ఆక్షణంనుంచి అనుకోని కొత్త సమస్య ఎదురయింది. వారంతా నిత్యం తన దగ్గిరకి వైద్యానికి వచ్చే వారే! ఇవాళ తనమీసాల నలుపుని ఇంతగా మెచ్చుకుని రేపు వాటి స్థానే తెల్లమీసాలు చూస్తే ఇంకేమయినా ఉందా? తన గుట్టు కాస్తా బయటపడి పోదూ?...అందుచేత వారికి ఎప్పుడూ అలాగే కనిపించేందుకని ఇక ఆ రంగు వెయ్యాలని నిశ్చయించుకున్నాడు. వెంటనే ఆ రంగుకొని ప్రతిరోజూ ఉదయం మీసాలకి రంగు వెయ్యనిదే ప్రపంచానికి అగుపించేవాడు కాదు.

సుమారు ఒక నెల దాటాక తెలిసింది— ఆనాడు వారంతా తాను రంగు వేసినట్టు పసికట్టారని. కాని ఇప్పుడు వ్యవహారం చెయ్యిదాటిపోయింది. ఊళ్ళో చాలా మంది చూశారు. ఇప్పుడు తను తెల్లజుట్టు, నల్ల మీసాలుగల ఆసామీగా పేరు పొందాడు. అందుచేత దానిని మార్చేందుకు వీలులేదు. ఇక చెయ్యి దగ్గవల్లా పొరపాటునైనా ఒక్క నెరసినవెంట్రుకయినా తొంగి చూడకుండా తగు మాత్రం కట్టుదిట్టంగా రంగువెయ్యటమే. ఆపని ఆనాటినుంచి చాలా శ్రద్ధగా చేస్తున్నాడు. అయితే నేం? ఇవాళ తన దురదృష్టంవల్ల ఆ రంగు పోవటం, ఎంత జాగ్రత్త తీసుకున్నా ఆ రహస్యం బయట పడటం, అందులో అల్లరి కుర్రకారు కంట పడటం జరిగింది.

మరొక రెండు స్టేషన్లు దాటాక ఆ కుర్రవాళ్ళంతా దిగిపోయారు. అప్పటికి ఆయన

# ★ అంతర్యాలు ★

మనస్సు కుదుటపడింది. వాళ్ళు కంటికి కనిపించటంలేదు కనక ఇదివరకటంత కోపం లేదు గాని మొత్తానికి వారి మీద ఆయనకు కోపం తగ్గలేదు. ఇవాళ తనని చూసి వారు నవ్వారు గాని, వాళ్ళకి మాత్రం వయస్సు వచ్చేసరికి ఇవన్నీ రావా?...మన చేతుల్లో ఏమన్నా ఉంది గనక నా—కావాలనుకున్నప్పుడు రావటానికి, వద్దనుకుంటే పోవటానికి. యిప్పుడిలా నవ్వగానే సరా?...రేపు వాళ్లని చూసి ఆ కాలపు చిన్న పిల్లలు ఇల్లాగ నవ్వరూ?...అప్పుడు తెలుస్తుంది వాళ్లకి తన బాధ...ఇప్పుడంటే అరవై పైబడబట్టి తను ఇలాగున్నాడు కాని వయస్సులో ఉన్నప్పుడు తనూ అందంగానే ఉండేవాడు. తనని అమ్మమ్మ అస్తమానం అనేది కూడాను "మన్మథనామ సంవత్సరంలో పుట్టినందుకు రూపమన్మథుడివిరా నాయనా!..." అంటూ. ఆ మాటవల్లే తనకి ఇప్పటికి అరవై ఏళ్లని బాగా గుర్తు.

ఇలా ఆలోచించినకొద్దీ అర్థం లేకుండా ఆలోచించడమే అవుతుంది గాని ప్రయోజనమేమీ ఉండబోదని తెలుసుకున్నవారై ఆయన తిరిగి పుస్తకం చదవటంలో మునిగిపోయారు. ఉత్సాహంకోసం మరొక్క సిగరెట్టు ముట్టించి ముచ్చటగా పొగని నాసికా రంధ్రాలగుండా వదుల్తూ.

అప్పటికప్పుడే సూర్యుడు అస్తమించటానికని తొందరపడటం, ఆయన కూచున్న చోటికి చదవటానికి కావలసినంత వెలుతురు లేకపోవటం, ఇంకా రైల్లో దీపాలు వెలిగించాలన్నంత జ్ఞానం స్విచ్చికి దగ్గరగా కూచున్న ప్రయాణీకుడొక్కడికీ లేకపోవటం, తన కంటినున్న సులోచనాలకి (చిన్న చిన్న పెద్ద భూతద్దాలతో తయారైన జోడు అది) చేతిలో వున్న పుస్తకానికి మధ్యగా వలయాలు తిరుగుతూ ప్రయాణిస్తున్న సిగరెట్టుపొగ అడ్డురావటం వల్ల అక్షరాలు అస్పష్టంగా కూడా కనపడక, ఆయనకు కోపం ఎక్కువయి, చటుక్కున లేచి నుంచుని, చెప్పులు తొడుక్కుని, గంభీరంగా నాలుగడుగులు స్విచ్చిబోర్డు దగ్గరికి వేసి లైటు వెయ్యబోయి ఫాను వేసి "అబ్బ! ఉన్న చలిచాలక ఇదొకటా మహానుభావా?..." అని నలుగురిచేతా అనిపించుకుని, వెంటనే ఫాను ఆపి, తనకు అవసరమున్నా లేకపోయినా అన్ని లైట్లు వెలిగించి వచ్చి కూచున్నారు.

ఇంతలో మరొక స్టేషను వచ్చింది. రైలు ఆగింది. జనం హడావుడిగా ప్లాటుఫారం అంతా కలియ తిరుగుతున్నారు. కొందరు తమ పెట్టెలోకి ఎక్కబోయి "అరె! ఇది వరుసుల పెట్టెరా!..." అంటూ దిగిపోతున్నారు. ఎక్కేవాళ్లకి ఎక్కాలని తొందర. దిగేవాళ్లకి దిగాలని తొందర. మొత్తానికి జనం చాలా మందే ఎక్కుతూ ఉన్నారు. ఇందరినీ తప్పించుకుని ఒక నలభై ఏళ్ళ వ్యక్తి ఒక రోగిష్టి మనిషిని పెట్టెలోకి ఎక్కించి నలుగురినీ బ్రతిమాలి ఒక బెంచీ ఖాళీ చేయించి దానిమీద ఆ రోగిని పడుకోబెట్టాడు. ఆ రోగికి చోటు ఇచ్చిన వారికి కృతజ్ఞత తెలియపరుచుకుంటూ తను మాత్రం నిలబడే ఉన్నాడు.

"పాపం ఇలా ఎంతదూరం తీసుకెడతారు?—చాలా బాధపడుతున్నట్టున్నారు. ఏం బాధో గాని?..." అంటూనే ఆ రోగి తాలుకు విన్న ప్రయాణీకుడు సానుభూతితో అడిగాడు.

"అబ్బే! ప్రక్క స్టేషనేనండి! ... ఆ ఊళ్లో మంచి డాక్టరుగారున్నారని, ఆయనకి చూపించటానికి తీసుకు వెడుతున్నాము ...చాలా కాలంనించి బాధపడుతున్నాడండి ..." అన్నాడు కూడా ఉన్నాయన.

ఈ మాటలు వినటంతో చదువుతున్న పుస్తకాన్ని అల్లాగే ఆపుచేసి దృష్టి వారికేసి మరల్చారు ఆశతో శర్మగారు.

"మరి అలాంటప్పుడు ఏ మద్రాసో, విశాఖపట్నమో తీసుకు వెళ్ళక పోయారా—ఈ చిన్న చిన్న డాక్టర్లకి చూపించే కన్నా?..." అని అడిగాడు ప్రయాణీకుడు.

ఆ నిరసన, తృణీకారం తనని చేస్తున్నట్టుగా నొచ్చుకున్నారు శర్మగారు. పైకి మాత్రం ఏమీ అనలేదు.

"ఆఁ!...అన్నీ అయాయండి ... వాళ్ళ వల్ల కాలేదు...అదృష్టం అంటూ ఉంటే ఇక్కడే బాగుపడాలి..." అన్నాడు రోగికి ఆసరాగా వచ్చిన మనిషి.

తన ఊరికే ఆ రోగిని తీసుకు వస్తున్నారని, ఆశలన్నీ ఆ ఊరు మీదే ఉన్నాయని, మద్రాసు, విశాఖపట్టణంలో కూడా వ్యాధి కుదరలేదని విన్నాక శర్మగారి మనస్సు కుదుట పడింది. అయితే వారు ఏ డాక్టరుకి చూపించదల్చుకున్నారో తెలియక తికమక పడుతున్నారాయన.

"అందరూ చెప్పారండి....ఈ వ్యాధి శాస్త్రిగారు తప్పకుండా కుదర్చగలరని... ఇదివరలో కూడా నాలుగైదు కేసులు ఇలాంటివి ఆయన కుదిర్చారట... మీ ఊరికి దగ్గరగా ఉన్న శాస్త్రిని వదులుకుని ఇంత దూరం ఎందుకు వచ్చావని నన్ను మద్రాసులో అడిగారు కూడాను... ఈయనకు అంత పేరుంది...ఏమో!... మావాడి అదృష్టం బాగుంటే ఆయన చేతులో వీడికి కూడా నయమయి పోతుంది..." అన్నాడు ఆయన.

ఈమాటలు విన్న శర్మగారికి మతిపోయినంత పనయింది. ఇంతవరకూ ఎన్నో ఊహా సౌధాలు నిర్మించుకుంటున్నారు; దక్కని కేసు దొరుకుతోందని. అంతలో పిడుగు లాంటి మాట వినిపడింది...ఇంతకూ వీళ్ళు వెడుతున్నది శాస్త్రి దగ్గరకని తెలుసుకుని ఆయన నిశ్చేష్టులయి పోయారు. శాస్త్రి నిన్న కాక మొన్న వచ్చి ప్రాక్టీసు పెట్టాడు. అతని వయస్సు అంతా పోగుచేస్తే తన సర్వీసంత లేదు. పోనీ విద్యా విషయికంగా ఏమన్నా ఘనుడా అంటే కాదు. ఇద్దరికీ ఒకే డిగ్రీ, ఆమాటకి వస్తే తన డిగ్రీ పూర్వపుది గనక శాస్త్రి డిగ్రీకన్నా ఎక్కువ విలువైనది. పైగా వయస్సుచేత, అనుభవంచేత తనకు తెలిసిన విషయాలు ఎక్కువ. కనుక

ఉన్నంత కట్టుదిట్టమయిన శాస్త్రజ్ఞానం శాస్త్రికి లేదని తనకి నమ్మకంగా తెలుసు. ఏదో కొత్త మోజుమీద కొట్టుకుపోతున్నాడుగాని లేకపోతే నిజానికి తనకి, అతనికి పోటా?...

తను ఆఊళ్ళో ప్రాక్టీసుపెట్టి నలభై సంవత్సరాలు కావస్తోంది. ఇన్ని ఏళ్ళనించీ ఆచుట్టు పక్కలకి తను ఒక్కడే నాటు-వైద్యుడు! ప్రజలందరికీ తలలో నాలుకగా ఉంటూ, వారందరి కష్టసుఖాలు తనవిగా తలపోస్తూ, వారికి వైద్యంచేస్తూ, ఇచ్చారనకుండా, ఇవ్వలేదనకుండా ఏదో గోప్యంగా కాలక్షేపం చేసుకుంటూ వచ్చాడు తను.

అసలు తను ఆఊరు వచ్చేనాటికి కేవలం సంచీకట్టు వైద్యులు ఒకరిద్దరు తప్పిస్తే, వైద్యవిద్య నభ్యసించి, సర్కారు పరీక్షనిచ్చివచ్చిన వారెవరూ లేరు. ఒకవేళ ఎవరేనా ఉన్నా వారు నాటువైద్యం తాలూకు పరీక్షలేవైనా అయ్యారేమో కాని, తనలాగ ఇంగ్లీషువైద్యం తెలిసినవారు కారు. అందువల్లనే తను ఆ ఊరు వచ్చి ప్రాక్టీసు ప్రారంభించిన కొద్దిరోజులకే తనకి పెద్దపేరువచ్చింది. ముఖ్యంగా తను చేసే వైద్యంపట్లకన్న తనవద్దనున్న పరికరాలపట్ల వారికి ఆసక్తి ఎక్కువగా ఉండేది. వారెవరూ వాటిని ఇదివరలో చూడలేదు. అందువల్ల ఎంతో శ్రద్ధగా వాటిని పరికిస్తూ తను ఏమందు ఇస్తే అది త్రాగి ఎంత ఖరీదంటే అంతా ఇచ్చేవారు. అటువంటి అంతేరీ రోజులు అవి...

తన వైద్యంవల్ల, నోటి మంచివల్ల, క్రమంగా ఏదో కొంత స్థిరం, చరం సంపాదించుకోగలిగాడు తను...వాళ్ళకి కూడా తనంటే అలాంటి విశ్వాసం ఉండేది... ఈ విధంగా తను ఒక పాతిక సంవత్సరాలపాటు ఏకచ్ఛత్రాధిపత్యం వెలిగించాడు. అంటే ఇక ఎవరూ వైద్యులు లేరని కాదు. ఉన్నవాళ్లు చెప్పుకోదగినంతగా తనకి అడ్డురాలేదు. అలా ఉంటూండగా ఇంకా ఇద్దరు ముగ్గురు డిగ్రీలు పుచ్చుకునివచ్చారు. వారు రావటంతో తనకి కొంచెం నష్టంకలిగినమాట నిజమే!...కారణం—ఆ ఊరి జనాభా అలాగే ఉన్నారు...వారి రోగాల సంఖ్యయినా చెప్పుకోదగినంతగా పెరగలేదు...ఏటొచ్చీ పెరిగినదల్లా వైద్యుల సంఖ్యే అందువల్ల ఉన్నవాటిని అందరూ పంచుకోవలసివచ్చేసరికి ఒక్కొక్కరి వాటాకు వచ్చేది తగ్గిపోయింది.


ఇల్లాగ కొన్ని సంవత్సరాలు గడిచాయి. తనకి వయస్సు మీరిపోతోంది. ఇదివరకటంత శక్తి - ఎంత తెచ్చిపెట్టుకుందామనుకున్నా-ఉండటం లేదు...అందుచేతనే తనుకూడా అంతబాధ పడటంలేదు. అలాగే రోజులు గడిచిపోతే అంత బాధగా ఉండకపోను...కాని అలా జరగలేదు...ఎక్కడనుంచో ఉప్పెనలాగ వచ్చి ఈ ఊళ్ళో ప్రాక్టీసు పెట్టాడు శాస్త్రి. అంతే!... అందరి అదృష్టాలు తల్లక్రిందులయాయి. ఇప్పుడు ఊరంతా రోగిష్టివాళ్ళు శాస్త్రి దగ్గరే వైద్యం. అతని హస్తవాసి మంచిదట...అతని చేతో మట్టి నలిపి ఇచ్చినా, మంచి నీళ్ళిచ్చినా - అదే మహా విలువైన ఔషధమై ఎలాంటి రోగాన్నయినా క్షణంలో రూపుమాపుతుందట. అసలు అతనికున్న తెలివి ఇంకెవరికీ లేదట...పెద్ద పెద్ద వాళ్లు చెయ్యలేని ఆపరేషన్లుకూడా సునాయాసంగా చేసేస్తాడట...అతను ఆ విధంగా ఎందరికో నయం చేశాడట!...ఈ విధంగా అతన్నిగురించిన వార్తలు విశేషంగా ప్రచారంలోకి వచ్చేశాయి జనం దూరభారాలకయినా ఓర్చి అతని దగ్గరకి తండోపతండాలుగా వచ్చి పడుతున్నారు...

ఇప్పుడతను బోలెడంత పెట్టుబడి పెట్టాడు...అతనికింద చాలామంది పనిచేస్తున్నారు. రోజు రోజుకీ పేరు పెరుగుతోందేగాని తగ్గటంలేదు...ఇంత కూడా వుడిలో ఇంత తనని- అందులోనూ వయస్సు మీరిన వాడిని ఎవరు చూస్తారు?...అయితే దానికి తను విచారించటం మానుకున్నాడు.. 'భగవంతుడు తనకి ఎంత రాసిపెట్టాడో అంతవరకూ సంపాదించుకున్నాడు... ఇప్పుడు తను పనిచెయ్యకుండా ఇంటిదగ్గర కూచున్నాగాని నిశ్చింతగా రోజులు వెళ్ళిపోతాయి. తన పిల్లలుకూడా చదువుకుని, వాళ్ళంతటి వాళ్ళు అయేవరకూ కావలసిన ఆర్థిక స్తోమతుకూడా ఉంది. ఆశకి అంతేమిటి?...పైగా పాతనీరుపోయి క్రొత్త నీటికి చోటు ఇవ్వవద్దా?' అని మనస్సుకి సరిపెట్టుకుని ప్రాక్టీసు కూడా మానుకున్నాడు తను.

ఎలాగూ ప్రాక్టీసు కట్టిపెట్టాలి గనక అప్పుడు అలాగ మనస్సుని సమాధాన పరుచుకున్నాడు గాని, శాస్త్రిరాకే తను ప్రాక్టీసు మానెయ్యటానికి కారణం అని తన మనస్సులో బాగా నాటుకుపోయి ఉండటంవల్ల హఠాత్తుగా శాస్త్రిపేరు విన్నప్పుడల్లా (తను ప్రాక్టీసు మానివేసి రెండేళ్ళు పైగా అయినాకాని)- ఒక విధమైన కోపం, అసూయ కలుగుతాయి...పైగా తనకీ, అతనికీ వయస్సులోను అనుభవంలోను ఎంత అంతరంఉందో గుర్తుకువచ్చి ఆ కోపం మరింత అవుతుంది. గుడ్డువచ్చి పిల్లని వెక్కిరించినట్టు ఈ శాస్త్రివచ్చి తనచేత వైద్యవృత్తికి స్వస్తి చెప్పించాడనే ఉక్రోషం ఎక్కువగానే ఉంది...అయితే శాస్త్రి వచ్చి తనతో "అయ్యా!...ఇక మీరు విరమించుకోండి!" అని చెప్పలేదు. అతను వచ్చాక ఏర్పడ్డ పరిస్థితుల ప్రభావంవల్ల తను ఆ పని చేశాడు...దీనికి ఎవరి ప్రోద్బలమూ లేదు...తన ఇష్టంమీద చేసినదే...అయినా కాని శాస్త్రిమీద తనకి అక్కసుగానే ఉంది. కనకనే వారెవరో శాస్త్రిదగ్గరకి తీసుకువెడుతున్నామనేసరికి తనకి అంతబాధ కలిగింది. తనకిఅలాగ అనిపించినదే కాని నిజానికి ఇవాళ వాళ్లు తన దగ్గరకి తీసుకువస్తే తనవద్ద ప్రస్తుతానికి ఒక్క మందూ లేదు...కనీసం ఒక అనుపత్రయినా లేదు...ఇంటిదగ్గిర రోగిని చూసి,పరీక్ష చేసి తనుకూడా వాళ్లని శాస్త్రిదగ్గరకే పంపివుండును...అసలి వారంతట వారే చేస్తేమాత్రం కోపంవచ్చింది తనకి...దీనికి అంతకీ కారణం తను సుమారు నలభై యేళ్ళపాటు అవృత్తిలోవుండి ఇరవై నాలుగు గంటలూ అదే ధ్యానంలో ఉండటమే!...అంతకంటె మరొక కారణమేమీ కనిపించదు...అన్ని సంవత్సరాలుగా అందులో ఉండటంవల్ల ఏరోగిష్టివాడు వచ్చినా తన సలహా తీసుకు తీరాలనిపిస్తోంది. రెండేళ్ళనించి ప్రాక్టీసు మానివేసినా...

ఈవిషయం జ్ఞాపకం వచ్చాక తనని చూసి తనే నవ్వుకున్నారు శర్మగారు—శాస్త్రిమీద నిష్కారణంగా తన మనస్సులో కోప్పడ్డందుకు...

ఇంతలో స్టేషనులో రైలు ఆగటమూ, అక్కడ దిగవలసిన వారందరూ త్వరగా దిగటమూ జరిగాయి. శర్మగారు తన ఆలోచనలు వదిలి ఎదురుబల్లమీద పడుకున్న రోగికేసి చూస్తే ఆరోగి అక్కడ లేడు....ఇంకా చాలా మంది అక్కడనుంచి వెళ్ళిపోయారు. అప్పుడు హడావుడిగా బయటకు చూశారు. తను దిగవలసిన స్టేషను వచ్చిందని గ్రహించి వెంటనే పుస్తకాన్ని, సంచిని రెండుచేతులా పట్టుకుని క్షణంలో ప్లాటుఫారంమీద పడ్డారు. అక్కడనుంచి తిన్నగా ఇంటికి బయలుదేరారు. ★



## 3


కొన్ని రోజులు గడిచిపోయాయి.

హరిహరరాయ్ కూతురు దీపాలు పెట్టగానే పోయి పడుకుంది. ఇంట్లో వాళ్ళత్తయ్య లేదు. ఓనాడు దేనికో వాళ్ళమ్మకీ-అత్తయ్యకీ జగడమయింది. ఆ ఆవేశంలో ఆవిడ దూరాన ఎక్కడో వున్న దగ్గరిచుట్టాలెవరింటికో వెడుతున్నానని చెప్పి వెళ్ళింది. వెళ్ళి అప్పుడే రెండు నెల్లయింది. తల్లికీమధ్య ఒంట్లో అంత ఓపికగా ఉండకపోవటంతో ఆ అమ్మాయి ఆలనా-పాలనా పట్టించుకునేవాళ్ళే లేరింట్లో. దానికితోడు నిన్నటి నుంచీ తల్లి పురిటిగదిలోకి పోయి పడుకోవటంతో- అసలిప్పుడు తిన్నావా - తినలేదా అని అడిగేవాళ్ళు కూడా లేరు.

అనువాదం:
**మద్దిపట్ల సూరి**

ఆ పిల్ల పక్కమీదికి పోయి పడుకుని, నిద్ర పట్టేటంతవరకు అత్తయ్యకోసం తనలో తాను కుమిలింది. రాత్రిళ్ళు రోజూ అత్తయ్యకోసం తనలో తాను అలా కుమిలి కుమిలి పడుకోవటం పరిపాటై పోయింది. తర్వాత కొంచెం ప్రొద్దుపోయాక క్రొత్తగొంతు లేవో సొదగా విన్పించటంతో కళ్ళు తెరచిచూసింది. హిందుస్తానీ దాది - ఇంకెవరో వంటింటి వసారాలో నుంచుని ఏమిటో బడబడా మాట్లాడుకుంటున్నారు. పొరుగు మామ్మగారు, ఇంకా ఎవరెవరో కూడా ఉన్నట్లున్నారు.అందరూ ఏదో కంగారుపడుతున్నట్లున్నారు ......కాసేపు అలాగే కూర్చుని కూర్చుని, మళ్ళీ పడుకుంటా పిల్ల..

వెనుతలుపులోంచి గాలి తంయిన రొదతో



పురిటిగదిలో దీపం వెలుగుతోంది. ఎవరివో మాటలు వినిపిస్తున్నాయి. వెన్నెల ప్రాకి ప్రాకి వసారాలోకి వచ్చి పడింది. చలిగాలికి కాసేపట్లోనే ఆ పిల్లకు నిద్ర పట్టేసింది. ఇంకొంచం ప్రొద్దుపోయాక, మంచినిద్రలో ఉండగా ఏదో గొడవలా విన్పించటంతో మళ్ళీ మెళుకువ వచ్చింది. తండ్రి తన గదిలోంచి ఇవతలికి వచ్చి, ఆదుర్దాగా ఆ పురిటిగదివైపు వెడుతూ "ఏమిటి? ఎలావుంది చిన్నగారూ?" అని అడుగుతున్నాడు. పురిటిగదిలోంచి ఎన్నడూ వినని ఏదో క్రొత్తరకం మూలుగు విన్పిస్తోంది. ఆ గొంతు తల్లి దే. చీకట్లో నిద్ర మత్తులో అసలది ఏమిటో అంతుపట్టక కాసేపు అలాగే మెదలకుండా పడుకుంది. ఆ పిల్ల కేమిటో భయం భయంగా వుంది. "అమ్మ ఎందుకలా మూలుగుతోంది! అమ్మకేం జబ్బు చేయలేదు కదా కొంపతీసి!"

ఎంతసేపు అలా పడుకున్నా ఏమీ తెలియక పోవటంతో ఆ పిల్ల మళ్ళీ కళ్ళు మూసుకుంది. కన్ను మూయగానే నిద్ర పట్టేసింది. తర్వాత ఎంతసేపటికో సరిగ్గా తెలియదు కాని, ఎక్కడో పిల్లికూనల అరుపు లాంటిది విన్పించటంతో మళ్ళీ మెలకువ వచ్చేసింది. అత్తయ్య పాకలోని వసారాలో - దాలిగుంటలో దీప దీపాలవేళ తాను పిల్లికూనల్ని దాచివచ్చిన సంగతి ఆ పిల్లకి కొట్టవచ్చినట్లు గుర్తువచ్చింది. పాపం. మరి పసికూనలవి. ఇంకా సరిగ్గా కళ్ళయినా తెరవలేదు. ఇంకేముంది. ఏ గండుపిల్లో వచ్చి ఆ కూనల్ని కొరికేసి వుంటుంది.

పక్కమీదినుంచి లేచి, కళ్లు నులుముకుంటూ, చీకట్లో తూలుకుంటూ సరాసరి అత్తయ్య ఇంటి

చిత్రకారుడు:

దివాకర్ సేన్‌రాయ్

కసారాలోని కాలికుంట దగ్గరకు వచ్చి, చెయిపెట్టి చూసింది. హాయిగా నిద్దరోతున్నాయి పిల్లికూనలు. గండుపిల్లి వచ్చిన జాడేమీ కన్పించలేదు. దాంతో ఆ పిల్ల మనసు కుదుటపర్చుకుని మళ్ళీ వచ్చి పడుకుంది. పడుకోగానే నిద్దరోయింది.

కాని నిద్రలోకూడా ఎక్కడినుంచో పిల్లికూనల అరుపు ఇంకా ఆలాపనగా విన్పిస్తున్నట్లే ఉంది.

మర్నాడు ప్రొద్దున్నే లేచి కళ్లు నులుముకుంటూండగా దాది వచ్చి, "నిన్న రాత్రి నీకో తమ్ముడు పుట్టాడమ్మాయీ! నువ్వ చూశావా? అమ్మో, రాత్రి ఎంత గాభరా, ఎంత కంగారయిందను కున్నావ్? అప్పుడు నువ్వ ఎక్కడున్నావ్? ఎంత కాళ్లు మొక్కు కున్నామో, చివరికి "కాల్‌పూర్" మసీదులో పీర్లకి పండుగ చేయిస్తామని, అంతేకాదు, ఇంకా లెంపలు వేసుకుని సకల— మొక్కటా మొక్కుకున్నాక గట్టెక్కగలిగాం" అని చెప్పింది.

ఆ పిల్ల ఒక్క పరుగులో పురిటిగుమ్మం దగ్గరికి వచ్చి, లోప లికి తొంగిచూసింది. ఖర్జూరాకుల దళ్ళతో కట్టిన ఆ గదిలో వాళ్ళమ్మ ఒంటినిండా బట్ట కప్పుకుని పడుకుని వుంది. ఆమె ప్రక్కనే ఓ తెల్లటి పాపాయ్—బుల్లిపాపాయ్, కాదా అంటే తన గాజుబొమ్మకన్నా కొస్త పెద్ద పాపాయి—పొత్తిళ్ళలో పడుకుని నిద్దరోతున్నాడు. గదంతా సాంబ్రాణి—సుగ్గిలం పొగలు క్రమ్ముకోవటంతో సరిగ్గా కన్పించటంలేదు. ఆ పిల్ల అలా నుంచుని ఉండగానే, ఆ పాపాయి మేల్కొని, ఆ బుల్లి బుల్లి చేతులూ— కాళ్ళూ కదిలిస్తూ, ఏమాత్రం ప్రాణలేనంత సన్న గొంతుతో 'క్యార్ క్యార్'మని ఏడవటం మొదలెట్టాడు. రాత్రి తాను పిల్లి కూనల అరుపు అని అనుకున్నదేమిటో ఇప్పుడు స్పష్టంగా తెలిసి పోయింది. అచ్చగా పిల్లికూనల అరుపులాగానే ఉందీ యేడుపు! దూరాన్నుంచి వింటే ఏదయిందీ అంత చులాగ్గా చెప్పలేరు. అంతలో చటుక్కున ఆ క్రొత్త బుల్లి తమ్ముడిమీద ఎక్కడలేని ఆపేక్ష, మమకారం అమాంతంగా పుట్టుకొచ్చాయి. ఆ పిల్ల పంచప్రాణాలూ ఆ పసికందుమీదికి పోయి వ్రాలాయి. ఆ దాది, పొరుగింటి మామ్మగారు వద్దని వారించటంమూలంగా తన కెంత తహ తహగా ఉన్నా ఆ పురిటిగదిలోకి వెళ్ళటానికిమాత్రం వీల్లేకపోయింది.

అమ్మ పురిటింట్లోంచి బయటికి వచ్చాక, తమ్ముణ్ణి ఉయ్యా లలో పడుకోపెట్టి ఊగిస్తూ, తాను అంచక్కగా తన కొచ్చిన పాట లన్నీ పాడెయ్యవచ్చు. పాటలమాట గుర్తొచ్చేసరికి, సందె వేళ తాను అత్తయ్య దగ్గిరకు పోయి కూర్చుని, ఆవిడచేత కథలు చెప్పించు కోవటం, పాటలు పాడించుకోవటం—అవన్నీ కళ్ళకు కట్టినట్లయి, ఆ పిల్ల కళ్ళల్లో నీళ్లు గిర్రున తిరిగాయి. అత్తయ్య కిలాంటి పాటలు ఎన్నో వచ్చు. ఆ వాడ వాడంతా వచ్చి, పాపాయిని చూసిపోతున్నారు. వచ్చినవాళ్ళంతా 'ఇంటికి దీపంలాంటి పాపా యమ్మా! ఆ తుమ్మెద రెక్కల్లాంటి జుట్టు, ఆ మేలిమిబంగారం లాంటి రంగు...' అంటూండేవాళ్ళు. వెళిపోతూ వెళిపోతూ, 'ఆ నవ్వు చూడండి, వేయి వరహాల విలువైన నవ్వు...' అనేవాళ్లు.

అత్తయ్యకూడా ఓసారి చూడటానికి వస్తే ఎంత బావుం డును!—అని మాటిమాటికీ అనిపించేదాపిల్లకి. అందరూ వచ్చి చూశారు, అత్తయ్య ఒక్కతే రాలేదు. ఎక్కడికి వెళ్ళిందో యేమో! మళ్ళీ అసలు ఇక రాదేమో! ఆ పిల్ల ఎంత చిన్న పిల్లయినా—ఇంట్లో అమ్మకి నాన్నకి—ఎవరికీ అత్తయ్యంటే గిట్టదనీ, ఆవిడ్ని మళ్ళీ తీసుకువద్దామన్న ధ్యాసే ఎవరికీ లేదని గ్రహించింది. పగలల్లా అత్తయ్యఉండే ఆ పాకకేసి చూస్తూ ఉంటుంటే ఆ పిల్లకి మనస్సు ఏమిటోగా ఉండేది. ఆ వంచపాకి తలుపు ఒకోకరోజున అలా తెరిచే ఉంటుంది. ఆ పెడ అంతా కాకిరెట్టలు, పిచికపెంటలు, దుమ్ముతో ఇంతెత్తున ఉంటోంది. అత్తయ్యంత శుభ్రంగా ఆ వాకిలి ఎవరు ఊడుస్తున్నారిప్పుడు! ఇటూ అటూ జల్లెళ్లు, వల్లేస్నీ, ఉమ్మెత్తలు మొలుస్తున్నాయి. అత్తయ్య ఉంటే వాటి నిలా మొలవనిచ్చేదా? చక్రాలలాంటి ఆ పిల్ల కళ్లు జలజలలాడాయి. ఆ పాటలూ, ఆ కథలూ మరిచిపొమ్మంటే మాత్రం ఎలా మరిచిపోవటం!

ఆరోజున హరిపాలితుని కూతురొచ్చి, "మీ ముసలమ్మ ఓ చెంబు, మూట పట్టుకుని ఏటి వంచనుంచి చక్రవర్తిగారింటివైపు వెడుతోంది. నిజంగానే, నేను ఏటికెళ్ళి వస్తూ చూశాను పిన్నీ! మీ దుర్గను పంపించు, చెయ్యి పుచ్చుకుని తీసుకు వస్తుంది. అలా చేస్తే ఆవిడ కోపంకూడా ఎగిరి చక్కాపోతుంది" అని చెప్పింది.

ఇందిరమ్మ హరిపాలితుని ఇంటికే వచ్చి, హరిహరునికి కొడుకు పుట్టటం—ఆ కబుర్లన్నీ ఇరుగు పొరుగువాళ్లను గ్రుచ్చి గ్రుచ్చి అడిగి విని ఆనందిస్తూ కూర్చుంది.

"అత్తయ్యా!"

ఇందిరమ్మ ఉలిక్కిపడి, వెనక్కి తిరిగిచూసింది. దుర్గ రొప్పు కుంటూ పరుగెత్తుకొస్తోంది. ముసలమ్మకి ప్రాణం లేచివచ్చినట్లయి తబ్బిబ్బవుతూ ఆ పిల్లను గుండెల కదుముకోటానికి అట్టే చేతులు చాచింది. దుర్గ ఆ పరుగు పరుగు అలాగే దభీమని అత్తయ్య ఒళ్లోకి వచ్చి పడింది. ఆవిడ ముఖంలో ఆనందం, కళ్ళల్లో నీళ్ళూ పరవళ్లు త్రొక్కాయి. ఆవిడకే కాదు, అక్కడ చేరినవాళ్లకందరికీ కళ్ళు చెమర్చాయి. ఆరిందా అయిన హరిపాలితుని పెళ్ళాం "ఈ పిల్ల ఏ జన్మలోనో నీ కడుపున పుట్టిన పిల్ల అయిఉంటుంది పిన్నీ! మళ్ళీ ఈ జన్మలో నిన్ను విడిచిపెట్టి ఉండలేకనే ఇలా పుట్టి ఉంటుంది" అన్నది.


ఇందిరమ్మ ఇంటికి వచ్చి, పసివాణ్ణి చూసి ఆనందం పట్టలేక ఉక్కిరి బిక్కిరై కన్నీళ్లు కార్చింది. మళ్ళీ ఎన్నాళ్ళకీ యింటిపట్టున నిలసింది చందమామ!

ముసలమ్మ కసిరి కసిరి చీకటి ఉండగానే లేచి, ఎంతో సంతోషంగా ఇల్లూ—వాకిళ్ళూ శుభ్రంగా ఊడ్చేది. పెడ మొలి చిన మొక్కలన్నీ పెల్లగించి పారేసేది! ఇన్నాళ్లకి మళ్ళీ ఈ ఇల్లు ఓ దారికి వచ్చినట్లు, ఇప్పటివరకూ ఏదో ఒడిదుడుకులలోనే ఉన్నట్లూ తోచింది దుర్గకి.

మధ్యాహ్నం భోజనమదీ అయ్యాక ఇందిరమ్మ పెరటిగుమ్మం వెనక వెదురుతోపులోకి వెళ్ళి—దారి కడ్డంగా పెరిగిన చిల్లర్ని నరుకుతూ కూర్చునేది. అటు ఇటు ఏటిఒడ్డువరకూ ఇళ్ళేమీ ఉండవు. ఏరు మరీ అంత దగ్గిరేంకాదు. ఓ రెండు ఫర్లాంగు లుంటుంది. దారిపొడుగునా పెద్ద పెద్ద మామిడిచెట్లు, వెదురుచెట్లు, రేగుచెట్లూ అవీ ఉంటాయి. ఆవిడ ఆ చిల్ల నరుకుతున్నప్పుడు దుర్గ పొల్లో గచ్చకాయల్లా ఏదో వాగుతూ దగ్గిరే కూర్చునేది! నరికిన చిల్లకంపను ఎప్పటికప్పుడు చిన్న చిన్న కట్టలుకట్టి తీసుకెళ్ళి పెరటి గుమ్మంలోపల పడేసి మళ్ళీ వస్తూఉండేది. మధ్యాహ్నం— నిద్రబద్ధకంవేళ—చల్లని ఆ చెట్లనీడల్లో చిల్ల నరుకుతూ కూర్చుంటే ఇందిరమ్మకి ఎప్పటెప్పటి సంగతులో జ్ఞాపకం వస్తూఉండేవి!...

ఏనాటి గాథలూ అవన్నీ!...

ఆయన ముచ్చం మాటేమాడుమాట్లు వచ్చారు. కలలో జరి గిన సంగతుల్లా జ్ఞప్తికి వస్తున్నాయి అవన్నీ. ఒకసారెప్పుడో వచ్చి నప్పుడు ఏవో తియ్యని తినుబండారాలు కూడా తెచ్చారు. విశ్వే శ్వరి రెండేళ్ల బిడ్డ అప్పటికి. 'ఆ యమ్మా! పంచదారగుళ్లల్లా ఉన్నాయే' అన్నా రందరూ. తానూ రెండు నోట్లో వేసుకు


ఆమె
ప్రకాశవంతమైన తెల్ల చీరలు
ఆమె స్నేహితులు
మెచ్చుకొనునట్లు
చేసినవి
నిత్యమూ మా యజమానురాలు ధరించు బట్టలకు అంత తెల్లదనము ఎట్లు వచ్చినదో ఆమె స్నేహితులు అందరి రహస్యము ఆమెను అడిగేవరకూ తెలుసుకొనలేక పోయిరి.
తన తెల్లబట్టలకి ఎల్లప్పుడూ టినోపాల్ వారి అంత తెల్లదనము పొందుచున్నట్లు వారికి తెలిపెను. టినోపాల్ వాడిన బట్టలు తెల్లగా మెరియుటచే స్పష్టముగా తెలియును.
టినోపాల్ యొక్క విశేష తెల్లదనము 3, 4, పార్లు ఉతికేవరకు నిలుచును. అందుచే దీనిని తరుచు వాడ నవసరములేదు. పైగా టీ స్పూనులో నాలుగోవంతు మాత్రపు టినోపాల్ ఒక బాల్చీడు బట్టలను తెలుపుచేయును.
TINOPAL BVN
టినోపాల్
Geigy
బట్టలను అన్నిటికంటె మిక్కిలి తెల్లగ
చేయును
అమాల్గమేటెడ్ కెమికల్స్ అండ్ డైస్టఫ్స్ కం. లి.
పి. బి. 965 బొంబాయి

దప్పరించింది... ఓనాటి దీపదీపాల వేళ ఓ మనిషి పెద్ద జుబ్బా వేస్తుకుని వచ్చి తారట్లాడుతున్నాడు. అత్తవారి ఊరునుంచి వచ్చిన మనిషి, అతడిచేతిలో ఓ ఉత్తరంకూడా ఉంది. దాన్ని చదివిపెట్టే వాళ్ళే లేకపోయారు. గోలోక్ అన్నయ్య ఆ క్రిందటేడే పోయాడు. బ్రజబాబాయ్‌గారి మంటపం ప్రక్కన ముచ్చట్లు చెప్పుకుంటూ కూర్చున్న వాళ్ళదగ్గిరకు తానే స్వయంగా ఆ ఉత్తరాన్ని చేతపుచ్చుకుని వెళ్ళింది. ఆనాటి సంగతి ఇప్పటికీ బాగా జ్ఞాపకం. పెదబాబాయ్, చినబాబాయ్, చివరికి బ్రజబాబాయ్ కూడా లేకపోయారప్పుడు. పతిత్ రాయ్ తమ్ముడు జాదూరాయ్, గోలోక్ బాబాయ్ గావమరిది భజహరి ఉన్నారు. ఉత్తరం చదివిన అతడు తెల్లబోతూ 'ఈ ఉత్తరం తెచ్చిందెవరే ఇందిరమ్మా?' అని మాత్రం అడిగాడు. తర్వాత తనని ఇంటికి తీసుకువచ్చి, చేతి గాజులు, అమ్మా నాన్నా ఏనాడో చేయించిపెట్టిన చిన్న చిన్న నగలు—అయిదువతనపు అలంకరణలన్నీ తీయించి, పాపిట్లో కుంకుమను తుడిపించి, పట్టుపట్టుమని అప్పటికప్పుడు ఏటికి తీసుకు వెళ్ళి, రెండు మునకలేయించి తీసుకువచ్చారు. ఏనాటిగాథ ఇది, నిన్న మొన్న జరిగినట్లుంది గాని!

నివారణుని సంగతి గుర్తొచ్చింది. పాపం! బ్రజబాబాయ్ కొడుకు నివారణుడు! పదహారేళ్ళవాడు. పచ్చగా మిసమిసలాడుతూ ఉండేవాడు—నల్లటి జుట్టూ వాడూ—ఎలా ఉండేవాడు! ఈ మంటపం చుట్టూ పెరిగిన అడివిమొక్కల వేళ్ళ అడుగున ఎక్కడున్నాడో! అప్పుడే ఎదురుతోపు మయాన ఉండిన ఇంట్లో కిట్టెంతో మంచమెక్కి, వచ్చే ప్రాణం, పోయే ప్రాణంగా రెండు మూడు రోజులున్నాడు పాపం! ఆ సమానం దాహం దాహమో అని అల్లాడిపోయాడు. వైద్యుడుమాత్రం ఒక్క చుక్కకూడా మంచి నీళ్ళివ్వకూడదు అన్నాడు. కాస్త సోపుమాత్రం చప్పరించనిచ్చే వాళ్ళు. నాలుగోనాటి రాత్రే కళ్ళుమూశాడు పాపం. ఇంకా కొసి పటికి పోతాడనగా కూడా నీళ్ళు నీళ్ళు అంటూ నోరు తెరుచుకునే ఉన్నాడు. అయినా ఒక్కళ్ళయినా వాడి గొంతులో ఉద్ధరిణెడు నీళ్ళుపోసినవాళ్ళు లేకపోయారు. వాడు పోయిన అయిదారు రోజుల వరకు వాళ్ళమ్మ చేత రొట్టె గుక్కెడు పచ్చి మంచినీళ్ళయినా త్రాగించలేకపోయారు. ఆరోనాడు మరిది రామచంద్ర చక్రవర్తి దగ్గరకొచ్చి, చేతులు కట్టుకుని, 'నువ్వుకూడా గుటుక్కుమంటే మా గతేం కాను వదినా! ఈ వయసులో మేమంతా ఏమైపోవాలి?' అని బ్రతిమాలుకున్నాడు. ఆవిడ బాగా కలవారి ఇంటిబిడ్డ. ముద్ద బంతి పువ్వులాంటి ముత్తయిదువ. అంత చక్కని మనిషి ఆ కాలంలో ఈ చుట్టుప్రక్క లెక్కడా లేదనే చెప్పవచ్చు. భర్త పాదోదకం ఆచమించనిదే పచ్చి గంగయినా ముట్టని మహాసాధ్వి. ఒక్క సత్తెకాలపు మనిషి. తాను స్వయంగా వండి, అత్తగారు, ఆడబిడ్డల దగ్గిర్నుంచి-ఇంట్లో పనివాళ్ళవరకు అందరకూ ముందుపెట్టి మూడు ఝాముల వేళ ఎప్పుడో మూడు మెతుకులు తినేదావిడ: దానాలూ ధ్యానాలూ సంగతి అలా ఉండగా, అన్నదానంలో ఆవిడ కేవలం అన్నపూర్ణ కదూ! ఎవరికైనా వండి పెట్టటమంటే పండుగే ఆమెకి. కనుక మరదిమాటలు మనసు కెక్కడో కలుక్కుమనిపించి ఉంటాయి. తర్వాత ఇహ వెంటనే లేవనూ లేచింది. మంచి నీళ్ళూ త్రాగింది. అయితే ఆ తర్వాత ఇంక ఆవిడ ఆట్టే కాలం బ్రతకలేదు. కొడుకు పోయిన ఏడాదికల్లా ఆమె ప్రాణం 'హరీ' అంది.

'కాసిని మంచినీళ్ళియ్ అమ్మా! కాసినంటే కాసిని'—

'ఛా, మంచినీళ్ళు త్రాగకూడదు నాయనా: వైద్యుడు చెప్పాడు! మంచినీళ్ళు త్రాగవచ్చునలా?'

'కాసిని ఇయ్యి అమ్మా! ఒక్క గుక్క చాలు, ఒక్క చుక్కయినా చాలు, గొంతు తడుపుకుంటాను. నీ కాళ్ళకు దణ్ణం-'

మిట్ట మధ్యాహ్నంవేళ పిట్టల కిలకిలలలో, పొదురు గుబుర్ల

త్రయీ జాయలలో యాజ్ఞ యొళ్ళనాటి గాథలన్నీ ఆమె చెవులకు లాపనగా విన్పిస్తున్నట్టే ఉండేది.

'అత్తయ్యా నిద్దరొస్తోందా నీకు? వచ్చి పడుకుందువు గాని రా రాదూ!' అనేది దుర్గ. ఇందిరమ్మ 'అదుగో పగటి నిద్ర ముంచుకొస్తోందప్పుడే. వేళ కాని వేళ ఇహ పడుకోనే ఇప్పుడు. ఈ చేతిలో పని పూర్తి చెయ్యనియ్' అనేది చేతిలో చురకత్తి ప్రక్కన పెట్టి, ఆవలించి చిటికేస్తూ...

# 4

పాపాయి పది నెలల వాడయ్యాడు. చిన్ని మొహమూ, బుల్లి నోరూ వాడూ సన్నగా, పీలగా ఉంటాడు. క్రింద పళ్లు రెండు మాత్రం వచ్చాయి ఆ పాలపళ్లు రెండూ బయట పెట్టి అప్పుడప్పుడు ఊరికే—ఉత్త పుణ్యానికే నవ్వులొలకపోస్తూ ఉంటాడు. 'ఏం నవ్వుతాడమ్మా మీ వాడు? కాస్త పలకరించామంటే చాలు పట పగాలుండవు ఇహ. అమాయకపు నవ్వులు—ఓః—కురిపించేస్తాడు' అనే వాళ్ళందరూ. 'చాల్లేరా నాయనా ఆ నవ్వు, చాలు చాలు, ఇహ ఇవాల్టికి చాల్లే. రేపటికి కాస్త దాచుకోమరి!' అనేది తల్లి. మనసుకి ఉల్లాసంగా ఉందా 'ద్దా ద్దా దా' అని కేరింతాలు కొట్టటం, లేనప్పుడు పై కప్పు ఎగిరి పోయేటంత పెద్ద పెట్టున ఏడవటం మాత్రం చేతవును వాడికి. ఎదుట ఏది కన్పించినా ముందు దాన్ని నోట్లో పెట్టుకుని, రెండు పళ్ళతో గట్టిగా నొక్కి చూస్తాడు—మట్టిబెడ్డ, కర్రముక్క, ఏదీ లేకపోతే తల్లి చీర అంచు...పాలు పట్టేటప్పుడొకొకప్పుడు చటుక్కున ఆ ఉద్దరిణెను కాస్తా పళ్ళతో గట్టిగా పట్టుకుంటూంటాడు, తల్లి పకపక నవ్వుతూ—'అదేమిట్రా? దాన్ని కాస్తా కొరికేస్తావా యేం కొంపతీసి! వదులు, చాల్లే. నీకున్నవే ముష్టి రెండు పళ్లు. అవి రెండూ ఊడాయంటే ఇంకేం నవ్వుతావ్' అనేది. ఎన్ని అన్నా, వాడు మాత్రం వదిలి పెట్టేవాడు కాదు తల్లి నెమ్మదిగా తన వ్రేలు వాడి నోట్లోకి పోనిచ్చి ఆ ఉద్దరిణెను బయటికి తప్పించేసరికి తాతలు దిగొచ్చేవాళ్లు.

అన్నప్పుడెల్లా పిల్లవాణ్ణి నమ్మి ఊరుకోటానికి లేదని, వంటింటి వసారా కాస్త మెరక చేయించి, దానికి చుట్టూ సన్నటి వెదురువాసా లడ్డం కట్టించి, పిల్లవాణ్ణి అందులో కూచోపెట్టి, తల్లి తన పనులు చేసుకుంటూ ఉండేది. న్యాయస్థానంలో బోనులో నిలబడే ముద్దాయిలాగా వాడు అందులోనే కూర్చుని, ఒకొక్కప్పుడు ఎందుకో తనలో తానే నవ్వుకుంటూ ఉంటాడు. ఎదుటకంటికి కనపడని శ్రోతల నుద్దేశించి, ముద్దు ముద్దు అర్ధంకాని భాషలో ఏదో మాట్లాడుతూంటాడు. అప్పుడప్పుడు ఆ అడ్డం ఉన్న వెదురు వాసాలు పట్టుకుని లేచి, వెదురుతో పుణికి మాస్తూ నిలబడుతూ ఉంటాడు. తల్లి ఏటినుంచి వస్తూంటే, ఆమె తడిచీరె చప్పుడు ఆలకించి ఆడుకుంటున్న ఆటలుమాని, తలయెత్తి అటూ యిటూ పరకాయించి చూసి, తల్లి కన్పించగానే ముఖం విప్పార్చుకుని, నవ్వుతూ ఆ వాసాల్ని పట్టుకుని లేచి బయటికి రావాలని పెనగులాడుతూంటాడు. 'అదేం అవతారం నాయనా? ఇప్పుడేగా మొహం తుడిచి బొట్టూ, కాటుకా పెట్టి వెళ్ళాను! ఇంతలోనే మాలకాకి మొహంలా అలా చేసుకున్నావేంరా! రా, ఇలా రా' అంటూ ఆవిడే దగ్గరకొచ్చి, ముక్కుమీదికి, చెక్కిళ్ళమీదికి జారిగిన కాటుకను తడిగుడ్డతో గట్టిగా నొక్కి తుడిస్తే వాడి పసిడివన్నె ముఖం రాగివన్నెకు మారేది. వాడు వద్దు మొర్రో అన్నట్లు ఏడుపు మొహం పెట్టి గునుస్తూ, మొహం తప్పించుకోటానికి ఎంత పెనగులాడినా తల్లి విడిచిపెట్టేది కాదు.

తర్వాత ఇహ తల్లి చేతిలో తుండుగుడ్డ కన్పించిందంటే చాలు—చేతికి చిక్కకుండా కొంటెనవ్వులు నవ్వుతూ పరుగూ పరుగూ ఓమూలకి ప్రాకిపోయేవాడు...ఒకొక రోజున సర్వజయ ఏటినుంచి వచ్చి, 'పాపా! ఏదీ? ఉయ్యాలూగు - ఉయ్యాలా, జంపాలా-' అని అనటమే తరువాయి—వాడు అలాగే క్రింద చతికిలపడి కూర్చుని, వెనక్కి ముందుకూ ఊగుతూ, ఊః కేరింతాలు కొట్టేవాడు.

'ఇంక చాలు ఆగు. ఆ ఊగటం చాల్లే ఇహ—' అనేది తల్లి. ఆమె ఏదైనా పనిలో ఉన్నప్పుడు, వెదురు కటకటాల మధ్య పసివాడి అలికిడి విన్పిస్తున్నదీ లేనిదీ మధ్య మధ్య చెవియొగ్గి ఆలకించేది. ఎంత ఆలకించినా ఒకొక్కప్పుడు చడీ - చప్పుడు విన్పించేది కాదు. సర్వజయకి గుండెలు దడదడలాడేవి—ఏ తోడేలయినా వచ్చి పిల్లవాణ్ణి ఎత్తుకు పోయిందేమో అని. అమాంతం చేతిలో పని కాస్తా అలాగే వదిలేసి, ఆదరాబాదరాగా పరుగెత్తుకు వచ్చి చూస్తే, బుట్టలో పండు సంపెంగలన్నీ బోర్లించినట్లు—పాపాయి తన బుల్లి చేతులతో నేలను కరుచుకుని - ఎప్పుడు పట్టేదో ఏమో, హాయిగా నిద్దరోతూండేవాడు. నాలుగు పక్కలనుంచి చీమలు ప్రాకి వస్తూ ఉండేవి. ఎంతో ఆబగా ఎక్కడినుంచో వచ్చి ముసురుకునేవి ఈగలు. ఆదమరచిన నిద్రలో పల్చని పాపాయి చిట్టిపెదవులు రవంత కంపిస్తున్నట్టుండేవి. నిద్రలోనే మధ్య మధ్య గుక్కిళ్లు మింగుతూ, మేలుకోబోయేవాడిలా గట్టిగా నిట్టూరుస్తూ ఉండేవాడు. తీరా దగ్గరకు వచ్చి చూస్తే మళ్లీ అంతలోనే ఒళ్లు తెలియని నిద్రలో ఉండేవాడు.

పగలస్తమానమూ, రాత్రి జాము, జాముప్పర ప్రొద్దుపోయే వరకూ వెదురు అడవి మధ్య అదవరదాకా అలికిడి లేకుండా ఉన్న ఆ యిల్లు - పదినెలల పాపాయి బోసినవ్వులతో, అర్థంలేని కేరింతాలతో గలగల మార్మోగుతూ కలకలలాడసాగింది.

'తల్లులు ప్రాణమిచ్చి పిల్లల్ని సాకుతారు—' అంటారు. మాతృగౌరవాన్ని ఇనుమడింపచేసే ఇలాంటి మాటలు ఎవరినోట పడితే వారినోటనే విన్పిస్తూ ఉంటాయి. కాని శిశువులు తల్లులకిచ్చేది కూడా తక్కువ విలువయిందేమీ కాదు. వాళ్లు ఈ లోకంలోకి వస్తూ వెంట ఏమీ తెచ్చుకోరు అన్నమాట వాస్తవమే. కాని మనస్సులు చిదుపుకుని వచ్చే, మాలిన్యము లేని ఆ చిరునవ్వులు, చందమామలోని నిగ్గుతో చేసినట్లుండే ఆ ముఖాలు, ఆ శిశుతారళ్యం అర్థాలకు కట్టుపడని ఆ ముద్దు మాటలు—వీటన్నిటికీ విలువ లెంతని కట్టగలము! అదే వాళ్ళ కలిమి! ఆ కలిమిని నిచ్చి దానికి బదులు తల్లుల చేత ఊడిగాన్ని చేయించుకుంటారు. అంతేకాని భిక్షుకుల్లాగా ఒట్టి చేతుల్తో వచ్చి, ఏమీ స్వీకరించటం లేదు.

ఒకొక రోజున హరిహరుడు ఏ చిఠాలెఖ్ఖలో, ఉత్తరాలో వ్రాసుకుంటూ కూర్చుంటే సర్వజయ పిల్లవాణ్ణి చంక నెత్తుకువచ్చి, "ఇదుగో, మిమ్మల్నే, పాపాయిని ఒక్కమాటు తీసుకోండీ కాస్త. అమ్మాయేమో ఆడుకోటానికి వెళ్ళింది. ఆవిడగారేమో స్నానానికెళ్ళింది. కాస్త తీసుకోండి మరి! నేను ఏటికి వెళ్లి మంచినీళ్లు తెచ్చుకోనా, పాపాయినే ఎత్తుకుని కూచోనా?" అనేది.

"అబ్బ! నేనేదో పనితొందరలో వుంటే ఏమిటే గొడవ!" అనేవాడు హరిహరుడు. సర్వజయకు కోపం వచ్చి పిల్లవాణ్ణి అక్కడే కుదేసి వెళ్ళిపోయేది. హరిహరుడు యేదో వ్రాసుకుంటూ కూర్చున్నవాడు అలా ఓసారి తలయెత్తి చూచేసరికి- పిల్లవాడు తన చెప్పులు నోట్లో పెట్టుకుంటూ ఉండేవాడు. హరిహరుడు చివాల్న లేచివచ్చి ఆ చెప్పులు లాగేసి, అబ్బ! ఉన్నవాడివి ఉన్నట్లుండవురా! నా పనితోనే నేను ఇదవుతూంటే, నువ్వు వచ్చి ఇదేమిటిరా మధ్యలో పాడుపని?" అని విసుక్కునేవాడు.

ఇంతలో ఏ పిచికో వచ్చి, ఎదర దణెంమీద వ్రాలేది. పసివాడు ఓసారి తండ్రికేసి చూసి, మళ్ళీ అటువైపుకి తిరిగి, 'ద్దా ద్దా ద్దా' అంటూ చెయియూగిస్తూ పిచికని పిలిచేవాడు.

హరిహరుని విసుగు కాస్తా ఎగిరి చక్కాపోయేది. పసివాడంటే ఎక్కడలేని ముద్దూ వచ్చేది.

చాలాకాలం క్రితం ఓనాటిరాత్రి సంఘటన జ్ఞప్తికి వచ్చిం దతనికి. తాను పశ్చిమప్రాంతంనుంచి తిరిగివచ్చిన క్రొత్తల్లో— ఊళ్ళో అందరూ తలకోకమాట అనటంతో, భార్యను తీసుకు వద్దామని ఓనాడు అత్తవారిఊరికి బయలుదేరాడు. సరిగ్గా రెండు జాముల వేళకి పడవ ఆ వూరిరేవుకి చేరుకుంది. పెళ్ళిఅయాక తాను ఒకేఒకసారి వెళ్లాడాఊరు. దారి—డొంకా అంత గుర్తు లేవు. వాళ్ళనీ వీళ్ళనీ అడుగుతూ ఆఖరి కెలా అయితేయేం, అత్తవారింటి గుమ్మంలోకి వచ్చాడు.

పిలవగా పిలవగా ఓ ఎర్రని అమ్మాయి—పిలుస్తున్న దెవరో చూసిపోదామని కాబోలు—వీధిగుమ్మంలోకి వచ్చి, తన కళ్ళల్లోకి చూసి, అంతలో తుర్రుమని పారిపోయి ఇంట్లో దూరింది. ఆ అమ్మాయి ఎవరా అని ఆలోచనలో పడ్డాడు తాను. తన పెళ్లామేనా ఏం? ఏమిటి! అప్పుడే ఇంత పెద్దపిల్ల అయిందా!

ఆ సందేహం కాస్తా రాత్రికి తీరిపోయింది. దారిద్ర్యానికి ఆహుతి కాకుండా మిగిలిన, తన తల్లిది ఎర్రంచు పాత పట్టుచీర కట్టుకుని, ప్రొద్దుపోయి, ఊరు మాటుమణిగాక గదిలోకి వచ్చింది సర్వజయ. హరిహరు డామెని నిలువునా చూసి నివ్వెరపోయాడు. అందాలబరిణెలా ఉన్న ఈ నిండుజవ్వనిలో పదేళ్ళనాటి తనభార్య లోని బాలిక రూపురేఖలేమీ లేవు. ఆమెకి బదులు—ఆమె స్థానం లోకి మరొకరొచ్చి నిలిచినట్లుం దామె. ముఖంలో అప్పటి పసితనంపోయి, పసిడిమెరుగుల మిసమిస వచ్చింది. ఇదైనా తేలిగ్గా కలిసివచ్చే అదృష్టం కాదని తెలిసిరావటాని కతనికి ఎంతోసేపు పట్టలేదు. ఆ నడకతీరు, ఆ అవయవపుష్టి, గొంతెరమల్లెపువ్వు లాంటి ఆ నిండుతనం—అన్నీ నిర్దుష్టంగానూ, నూతనంగానూ కన్పించాయి.

గదిలోకి రాగానే సర్వజయ కాస్త కంగారుపడింది. ఆమె వయసువచ్చిన యువతే అయినా, ఇప్పటివరకూ భర్తను ఒక రకంగా చూసి యెరగదనే అనాలి. క్రొత్తపెళ్ళికూతురికి వచ్చే

సిగ్గంతా ఆమెకి మళ్ళీ వచ్చింది. మొదట హరిహరుడే మాట్లాడాడు. భార్య చేతిని తనచేతుల్లోకి తీసుకుని, ఆమెని తీసుకువచ్చి మంచం మీద కూర్చోపెడుతూ "ఇక్కడా కూర్చోవలసింది...ఊఁ... ఖులాసాగా ఉన్నావా?" అని అడిగాడు.

సర్వజయ సిగ్గుతో చిరునవ్వు నవ్వింది...మరో క్షణానికల్లా ఆ సిగ్గు కాస్తా రవంత ప్రక్కకు తప్పుకుంది. మెత్తనికంఠంతో— "ఇన్నాళ్ళకి జ్ఞాపకం వచ్చానన్నమాట నేను! పోనీయండి. ఎవ్వరికీ తెలియకుండా ఇన్నాళ్ళూ ఎక్కడున్నారు?" అని అడిగి, అంతలో మళ్ళీ గొంతుమార్చి "నేనేం తప్పుచేశానండీ?" అంటూ కళ్లు ఒత్తుకుంది. భార్య మాటలతీరూ అదీ చూస్తూంటే పల్లెటూళ్ళ వాలకాలు, ఆ వాతావరణం, ఆ ఆకర్షణలూకూడా మధురంగానూ, క్రొత్తగానూ ఉంటాయనే తోచింది హరిహరునికి. భార్య చేతుల్ని మామూలు మట్టిగాజులుతప్ప, ఒంటిన వేరే నగలేమీ లేకపోవటం గమనించాడతడు. పేదఇంటిపిల్ల. పెద్దనగ లెక్కడినుంచి వస్తాయి! తాను ఇన్నాళ్ళవరకూ ఆమెసంగతి తలపెట్టకపోవటం తప్పే అయిందనుకున్నాడు ... సర్వజయకూడా ఇవాళ పగల్లా ఎంతలేదన్నా నాలుగైదుసార్లు భర్తని తొంగిచూసింది. నిండుయౌవనమే కాదు, తీర్చి దిద్దినట్లుంటే అతడి అవయవాల్లో తొణికిసలాడే మగటిమ — మామూలు పల్లెటి దిక్కు పడుచువాళ్ళలో నయినా ఎక్కడో కాని కన్పించదు.

తన పెనిమిటి పశ్చిమ దేశంలోఉండి, పెద్దచదువు చదువుకుని వచ్చాడనీ, డబ్బూ – అదీకూడా మరీ అంత భారీగా తీసుకురాలే దనటానికి వీల్లేదనీ, తల్లీ—తండ్రీ అనుకోవటం ఇవాళ సర్వజయ చెవిని పడింది. ఇన్నాళ్ళనుంచీ పడిన దిగులంతా ఇహ తీరిపోయింది. భగవంతు డిప్పటికి తనను కొత్తకన్నెత్తి చూశాడు. "నీ మొగుడు సన్యాసుల్లో కలిసిపోయాట్టే! ఇంకేం వస్తాడు?" అనే వాళ్ళందరూ. అంతరాంతరాల్లో ఆమె ఆ మాటను నమ్మలేదు. అయినా ఇన్నాళ్ళకు భర్తతిరిగిరావటం ఆమెకేదో దురాశ ఫలించినంతిగానే వుంది. బెంగతో నిద్రపట్టక ఎన్నో రాత్రులామెకి భళ్లున తెల్లారేవి. ఊళ్లో ఎవరింట్లో పెళ్ళి వచ్చినా, పేరంటం వచ్చినా సంతోషంగా అక్కడికి వెళ్ళగలిగేది కాదు. అయినవాళ్ళూ, కానివాళ్ళూ కూడా "పాపం, పాపం" అంటూ వద్దన్నకొద్దీ సానుభూతి చూపే వాళ్లు. అభిమానంతో గుడ్లనీరు గుడ్లగ్రుక్కుకునేది. యౌవనపు తీయని ఊహలు చాటునా మాటునా సద్దుమణిగిన రాత్రివేళలా— ఇప్పటిదాకా కన్నీటినే కాల్వలు కట్టించాయి. ఎప్పుడూ యెవరి యెదుటా పెదవిమెదిపి ఏమీ చెప్పుకోకపోయినా, ఒంటరిగా కూర్చుని ఎంత దిగులుపడలేదు! ఈ సంసారం చూడబోతే ఈ తీరు, భర్త ఒకవేళ నిజంగానే తిరిగి రాకపోతే తలిదండ్రులు 'హరీ' అన్నాక తనగతి ఏంకాను! ఎవరి పంచను ఎవరు చేరనిస్తారు.

ఇన్నాళ్ళకి ఒడ్డు కన్పించింది.

హరిహరుడు నవ్వుతూ—"సరేకాని, నువ్వు మధ్యాహ్నం గుమ్మంలోకి వచ్చి నంచుని చూశావే, అప్పుడు గుర్తుపట్టావా నన్ను? నిజం చెప్పాలేమనుకున్నావో?" అని అడిగాడు.

సర్వజయ చక్కని నవ్వొకటి నవ్వి—"ఆహా! ఎందుకు గుర్తుపట్టలేదు! చూడగానే సరిగ్గా తెలియలే దనుకోండి. మళ్ళీ అప్పుడే చటుక్కున"—

"ఏదో ఉజ్జాయింపున—"

"ఉజ్జాయింపున కాదండీ, ఉజ్జాయింపున కాదు. నిజం, నిజంగానే! పైట చెంగు ముఖాని కడ్డంపెట్టుకుని, లోపలికి వెళ్ళి పోయాను—చూడలా మీరు?...అది సరేకాని, నిజానికి మీరు నన్ను గుర్తుపట్టారుటండీ? నామీద ఒట్టేసుకుని చెప్పాలి మరి!" అన్నది సర్వజయ.

అవసరమైనవీ—కానివీ—ఏవేవో రకరకాలకబుర్లతో రాత్రి చాలా ప్రొద్దుపోయింది. చనిపోయిన అన్నగారి ప్రసక్తి వచ్చినప్పుడు ఆమెకి కంటనీరు కట్టుకుపోతేగు..."అన్నట్టు పేరని వీ ఊరి చ్చారు. చిన్న మరదలిపేరు నాకసలు తెలియనే తెలియదు, ఇవాళ మీ నాన్న చెపితే తెలిసింది." అన్నాడు హరిహరుడు.

"దాన్ని వినోదపురం ఇచ్చారు...అదేనండీ, అక్కడేదో నది కూడా ఉంది చూడండి, దాని పేరేమిటి చెప్మా? మధు...ఆఁ. ఆఁ. మధుమతి. మధుమతి ఒడ్డునేనండీ ఉన్నదా వూరు!" అన్నది సర్వజయ.

సర్వజయకి—అడుగుదామనుకున్న మాటొకటి మాటిమాటికీ నాలిక చివరదాకా రాసాగింది—'భర్త తన నిప్పుడు వెంటతీసుకు వెడతాడా లేక ఊరికే చూసి, మళ్ళీ ఏ కాశియో, గయో వెళ్ళి పోతాడా' అని. కాని ఎంత అడగాలని ఉన్నా నోరు తెరిచి అడగ లేకపోయింది. ఏమిటో మనసు ఒప్పటంలేదు—'తీసుకువెళ్ళకపోతే పోనియ్. ఆమాట నీకు నీత్రై అడిగి వెలితిపడతావా?' అని వెనక్కి లాగుతోంది మనస్సు.

అడగక్కర్లేకుండా హరిహరుడే ఈ సందేహాన్ని తీర్చేశాడు. "రేపే నిన్ను నిశ్చిందిపురం తీసుకువెడతాను" అన్నాడు.

సర్వజయకి గుండెలు గతుక్కుమని గబగబ కొట్టుకో సాగాయి. అయినా కొంత నిబ్బరించుకుని—"రేపే ఎందుకండీ? ఇన్నాళ్ళకి వచ్చారు. రెండురోజులైనా ఉండకూడదూ! మా అమ్మా నాన్నా అయినా అంత వెంటనే వెళిపోనిస్తారా?— అన్నట్లు ఎల్లుండి మా పొగడపువ్వుఇంట్లో విందూ మీకు!" అన్నది.

"మీ పొగడపువ్వు యెవరు?"

"ఈ ఊరేనండీ, ఆ వీధి అసలు. ఈ వీధినిచ్చి పెళ్లిచేశాం" అని ఆమె మళ్ళీ మల్లెపువ్వులా నవ్వుతూ "తెల్లారేసరికి మళ్ళీ మిమ్మల్ని చూడటానికి వస్తుందండీ!" అన్నది.

ఆ కబుర్లకింక తెంపు అనేది కన్పించలేదు. రాత్రి ఎంత ప్రొద్దోయిందీ తెలియలేదు. గది కిటికీప్రక్కనున్న పొన్నచెట్టు మీద చక్కని పిట్ట ఏదో సంగీతాలు తీస్తూ కూచుంది. వంగదేశం లోని ఈ మారుమూల కుగ్రామంలో, ఈ వెదురుతోపు ప్రక్కన తనంటే ఆపేక్షలను కుమ్మరించే ఓ యిల్లు తన రాకకోసమై స్వాగత తోరణాలు కట్టుకుని, నెలలతరబడి, ఏళ్ళతరబడి, ఎంతో ఆశతో ఎదురుచూస్తూ కూచుంటే—తాను పశ్చిమ ప్రాంతంలో, అపరిచితములైన ఆ చవిటిపర్రల్లో, కొండల్లో, గుట్టల్లో విరామ్రాని యాత్రికుడిలాగా ఏం సాధించుదామని తిరిగినట్టు? అన్న ఆలోచన హరి హరుడికి రాసాగింది.

ఆ చక్కని పిట్ట ఇంకా సంగీతాలు తీస్తూనే ఉంది. బయట వెన్నెలవన్నె తగ్గిపోతోంది. ఒక రకంగా అతడికీ రాత్రి ఏదో అద్భుతమైనదిగా కన్పిస్తున్నది. తమను సువిశాల భవిష్యత్తులోకి తీసుకుపోనున్న సరిక్రొత్త బ్రతుకుబాట ఈ రాత్రినుంచే ఆరంభమవుతోంది. ఆ భావి జీవితం ఎలా ఉండబోయేది ఏమీ తెలియదు. తమ జీవితలక్ష్మి ఆ అనిర్దిష్ట భవిష్యత్తులోకి ఏమి పాథేయం సమకూర్చి ఉంచిందో మరి! బహుశా ఇద్దరి మనస్సుల్లోనూ ఒకే భావం భాసాభాసంగా తలయెత్తి ఉండొచ్చు. ఇద్దరు కిటికీలోంచి బయటవెల్లివిరిసిన వెన్నెలకేసి నిశ్చలంగా చూస్తూ కుంచున్నారు.

ఆ తర్వాత ఎన్నో రోజులు వెళ్లిపోయాయి. అప్పుడీ పసిడి పసికూన ఎక్కడున్నాడో!

—(ఇంకా వుంది)



హాలీవుడ్ తార గ్రేస్ కెలీ.



గోకుల్ వారి "కనకతార" లో ఎస్. వరలక్ష్మి.



రాజ్యం పిక్చర్స్‌వారి "హరిశ్చంద్ర" లో గుమ్మడి, రేలంగి

# "భారతీయ టెక్నీషియన్లు ఎవరికీ తీసిపోరు"

## మేరీ సెటన్ అభిప్రాయం

"భారతదేశంలోని సినీ టెక్నీషియన్లు ఏ ఇతరదేశపు టెక్నీషియన్లకూ తీసిపోరు. భారతదేశంలో నిర్మాణ కౌశలం కావలసినంత ఉన్నది," అని ప్రముఖ బ్రిటిష్ ఫిలిం విమర్శకురాలు మిస్ మేరీ సెటన్ ఇటీవల మద్రాసులో ప్రశంసించింది

భారతప్రభుత్వ విద్యాశాఖ ఆహ్వానంపై ఈ దేశంవచ్చి వివిధనగరాలలో ఉపన్యాసాలిస్తున్న మేరీసెటన్ ఇటీవల మద్రాసు వచ్చింది ఈ నెల 17 వ తేదీన ఆమె 'హోటల్ దాస ప్రకాశ్'లో దక్షిణభారత చలనచిత్ర పత్రికా రచయితలను కలుసుకుని ఇష్టాగోష్ఠిలో పాల్గొన్నది.

ఈ సందర్భంలో మాట్లాడుతూ తాను సుమారు నలభై భారతీయ చిత్రాలను చూశాననీ, టెక్నికల్ విషయాలలో భారతీయ టెక్నీషియన్లు ఎవరికీ తీసిపోరని వెల్లడించింది భారతీయ నిర్మాతలలో నిర్మాణ కౌశలం కావలసినంత ఉన్నప్పటికీ, స్వజాత్యమైన ప్రతిభ కుంటుపడుతున్నట్లు గోచరిస్తున్నదనీ, దీనికి ముఖ్యకారణం భారతీయ నిర్మాతలపై హాలీవుడ్ ప్రభావం అమితంగా ఉండడమే ననీ ఆమె అన్నది. "నేను అమెరికాలో చాలాకాలం ఉన్నాను. హాలీవుడ్ లో 16 నెలలు పనిచేశాను కూడా. కనుక నాకు అమెరికాను గూర్చి బాగా తెలుసు అమెరికన్, భారతీయ జీవన విధానాల మధ్య ఎంతో వ్యత్యాసం ఉన్నది. కనుక భారతీయ నిర్మాతలు అనుకరించ దలచుకుంటే, హాలీవుడ్ అంతగా అనుకరణ యోగ్యమైనదికాదు అంతకంటే ఇటలీ, జపాన్ చిత్రాలు భారతీయులకు ఎక్కువ హితమైనవి," అని మేరీ సెటన్ అన్నది.

భారతీయ చిత్రాలలో పాటలకు అనవసర ప్రాధాన్యం ఉంటుందని ఆమె అభిప్రాయపడింది పాటలు ఉండకూడదని తన అభిప్రాయం కాదనీ, భారతీయ చిత్రా



"అశ్వేరీ" హిందీ చిత్రంలో నటి రమాశర్మ



నరసూవారి "భలేరాముడు"లో ఎ. నాగేశ్వరరావు

# "భారతీయ టెక్నిషియన్లు ఎవరికీ తీసిపోరు"

ఆటలో పాటలకు తప్పక స్థానం ఉండనీ, అయితే ప్రతి పదినిమిషాలకీ పాట అనవసరమనీ ఆమె అన్నది పాటలను చేర్పుగా ఉపయోగించడంవల్ల కథకు పుష్టి చేకూర్చవచ్చునని ఆమె చెప్పింది

ఈ సందర్భంలో పాటలు, నృత్యాలు, డైలాగ్ల ప్రాధాన్యం ఏమీలేని బెంగాలీ చిత్రం "పథేర్ పాంచాలీ"ని మేరీ సెటన్ ప్రశంసించింది అదిపెద్ద బాక్సాఫీసు చిత్రం కాకపోవచ్చు గాని, అంతర్జాతీయ రంగంలో ఏదేశపు ఉత్తమ చిత్రంతో నైనా సరిసమానంగా నిలువగల చిత్రమని, భారతత్వాన్ని ఎక్కడా వాచా చెప్పకే ప్రతి అంగుళంలోనూ పరిపూర్ణముగను ఆ చిత్రం నిరూపించిందనీ, ఈ రాలా భారతీయ చిత్రం కనుకనే ప్రజాతికంతటికీ చెందినదవుతున్నదనీ అచింది.

"బ్రిటన్, అమెరికా మొదలైనదేశాల్లో మాదిరిగానే భారతదేశంలోకూడా ఎక్కువభాగం చెత్తచిత్రాలే తయారవుతున్నాయి అయితే ఒక తేడా ఉంది ఇక్కడికంటె అక్కడ ఎక్కువమంచి చిత్రాలు తయారైనాయి కళాత్మక చిత్రాల నిర్మాణాన్ని ప్రోత్సహించడానికి పాశ్చాత్య దేశాల్లో అమలులోఉన్న మార్గాలను ఇక్కడకూడా అమలుచేయడం మంచిది. బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సు, స్వీడన్, హాలెండ్, జర్మనీ దేశాల్లో ఫిలిం సొసైటీలున్నాయి ఈ సొసైటీలలో బాక్సాఫీస్ విజయంతో సంబంధంలేకుండా కళాత్మకమైన ఉద్దేశింపబడని ప్రత్యేక చిత్రాలను మాత్రమే ప్రదర్శిస్తారు సొసైటీలలో సభ్యులైనవారికోసం అన్నిదేశాలనుండి ఉత్తమోత్తమ చిత్రాలను తెప్పించి నెలకొకసారో రెండుసార్లో ప్రదర్శిస్తారు దీనివలన కళాభిమానుల కళాతృష్ణ తీరడం, కళాత్మక చిత్రాలకు తగినంత ధనం వసూలు కావడం జరుగుతుంది ఇటువంటి సొసైటీలు బ్రిటన్‌లో 800 పైగా ఉన్నాయి ఫ్రాన్సులో 150 ఉన్నాయి ఒక్కొక్క సొసైటీలో రెండు మూడు వేలమంది సభ్యులుంటారు. ఈ మాదిరి సొసైటీలను భారతదేశంలో ఏర్పాటు చేయడం అవసరం" అని ఆమె వివరించింది.

రష్యన్ దర్శకుడు శ్రీ॥ శ్రీ॥ ఐజెన్ స్టీన్ జీవిత చరిత్రను ఆమె ఒక పెద్ద గ్రంథంగా రచించింది ఐజెన్ స్టీన్‌తో పోల్చదగినవారు ఇద్దరే ఉన్నారనీ, ఒకరు అమెరికన్ దర్శకుడు డేవిడ్ గ్రిఫిత్, రెండవవారు చార్లీ చాప్లిన్ అని ఆమె అన్నది

బొంబాయి, కలకత్తా నగరాల్లో మాదిరిగా మద్రాసులోకూడ ఫిలింగోష్ఠి జరపాలనే ఉద్దేశంతో తానిక్కడికి వచ్చాననీ, అది సాధ్యపడలేదనీ ఆమె విచారం వెలిబుచ్చింది. ★



ప్రతిభా వారి "ఏది నిజం"లో జోగారావు, హేమలత.

# ★ సినిమా వార్తలు ★

## పథేర్ పాంచాలి 'సీక్వెల్' అపరాజిత
### చిత్రం నిర్మించడానికి సత్యజిత్‌రాయ్ సన్నాహం


'పథేర్ పాంచాలీ' చిత్ర దర్శకుడు శ్రీ సత్యజిత్ రాయ్ నిర్మించనున్న కొత్త చిత్రం 'అపరాజిత' ఇది కూడా శ్రీ విభూతి భూషణ్ బెనర్జీ వ్రాసిన నవలే. ఈ కథ పథేర్ పాంచాలీకి తరువాయి వంటిదని చెప్పవచ్చు 'పథేర్ పాంచాలీ'లో పసి వాడుగా కనబడే "అప్పూ" బాల్యానంతర, జీవితం ఈ కథలో మనోహరంగా చిత్రించ బడింది.

'అపరాజిత' నిర్మాణానికి శ్రీ రాయ్ స్వంతంగా, "ఎపిక్ ఫిలింస్" పేరిట ఒక సంస్థ నెలకొల్పారు. 'పథేర్ పాంచాలీ' చిత్రనిర్మాణంలో పాల్గొన్న వారంతా ఈ కొత్త చిత్రంలో పనిచేస్తారు. శ్రీ రవి శంకర్ సంగీతం సమకూర్చుతారు. శ్రీ సుబ్రతా మిత్రా ఛాయాగ్రహణం నిర్వహిస్తారు. సినేరియో శ్రీ రాయ్ తయారు చేశారు.

★

## వాహినీవారి 'భాగ్యరేఖ'
### తిరుపతి క్షేత్రంలో ప్రారంభోత్సవం

వాహినీ పేరిట పొన్నలూరి బ్రదర్స్ నిర్మిస్తున్న 'భాగ్యరేఖ' చిత్రానికి ఫిబ్రవరి రెండో వారంలో తిరుపతి క్షేత్రంలో ప్రారంభోత్సవం జరిగింది. నాయిక భూమిక నిర్వహిస్తున్న జమున ఈ తొలి సన్నివేశాలలో నటించింది. శ్రీ బి. ఎన్. రెడ్డి దర్శకత్వాన తయారవుతున్న ఈ చిత్రంలో ఎన్. టి. రామారావు, రేలంగి, రమణారెడ్డి,



1954 లో ఉత్తమ తెలుగు నటిగా ఎన్నికైన శ్రీమతి భానుమతికి చలన చిత్రాభిమానుల సంఘంతరఫున శ్రీ శివాజీ గణేశన్, బహుమతిని అంద జేస్తున్నారు. మూడవవారు భరణీపిక్చర్స్ దర్శకుడు శ్రీ రామకృష్ణ.

# ★ సినిమా వార్తలు ★

సి. ఎస్. ఆర్. ప్రభృతులు నటిస్తున్నారు. వాహినీలో ఇప్పటికి పదిపాటలు రికార్డు చేశారు సంగీతం పెండ్యాల తిరుపతి నుండి తిరిగి రాగానే, వాహినీలో వేసిన పెద్ద సెట్ పై షూటింగ్ ప్రారంభించారు చిత్రంలో ముఖ్యమైన సన్నివేశాలన్నీ మార్చి నెలాఖరునాటికి పూర్తిచేయడానికి దర్శకుడు శ్రీ రెడ్డి కృషి చేస్తున్నారు

* * *

## చలనచిత్ర కళారాధకులు సంగీత నాటక అకాడమీ బహుమతులు

సంగీత నాటక అకాడమీవారు చలనచిత్ర కళలో ఉత్తమ ప్రమాణాలు అందుకునే వారికి బహుమతులిచ్చి గౌరవించ నిశ్చయించారు. ఈ సంవత్సరం రెండు బహుమతులు ఏర్పాటు చేస్తున్నారు ఒకటి ఉత్తమచిత్ర నిర్మాతకుగాని, దర్శకునకుగాని ఇస్తారు. రెండవది ఉత్తమ నటికిగాని నటుడికిగాని ఇస్తారు

ఈ బహుమతులు అందుకోవడానికి అర్హతగలవారి పేర్లను సూచించవలసిందిగా అకాడమీవారు వివిధ సంస్థలను, చలనచిత్ర సంఘాలను విమర్శకులను కోరారు. ★

## భలే రాముడు

సరసావారి కొత్త చిత్రం "భలే రాముడు" పూర్తి అయిపోయినట్లే. మార్చి 1-వ తేదీన రీరికార్డింగ్ ప్రారంభిస్తారు బాంబే టాకీస్ కిస్మత్ ఆధారంగా శ్రీ వేదాంతం రాఘవయ్య దర్శకత్వాన తయారవుతున్న యీ చిత్రంలో నాగేశ్వరరావు, సావిత్రి ప్రధాన భూమికలు నిర్వహిస్తున్నారు రేలంగి, గిరిజ, కమలం, సీత, గుమ్మడి, సి ఎస్ ఆర్ ప్రభృతులు ఇతర నటీనటులు మాటలూ పాటలూ శ్రీ సదాశివ బ్రహ్మం సంగీత దర్శకుడు శ్రీ సాలూరి రాజేశ్వరరావు.

* * *

## తెలుగు హాస్య నటులంతా....

మీర్జాపూర్ రాజా నిర్మిస్తున్న "దాంపత్యం" చిత్రంలో, తెలుగు హాస్య నటులు దాదాపు అంతా గెస్ట్ ఆర్టిస్టులుగా పాల్గొంటున్నారు హాస్యభూమికనుమాత్రం రేలంగి నిర్వహిస్తున్నారు కృష్ణవేణి, జి వరలక్ష్మి, విద్య, విజయకుమార్, డాక్టర్ గోవిందరాజుల, గుమ్మడి, జె, ఎస్ స్వామి మొదలగు వారు నటిస్తున్న ఈ చిత్రానికి ఆర్ ప్రకాశ్ దర్శకుడు మాటలు అనిసెట్టి, పాటలు అరుద్ర వ్రాశారు సంగీతం రమేశ్ నాయుడు సమకూర్చారు ఈయన కిశోర్ సాహు "హామ్లెట్" కు లోగడ సంగీత దర్శకుడుగా పనిచేశారు.

* * *

## ఉమా సుందరి

జూపిటర్ వారి "ఉమా సుందరి" నిర్మాణం వారం పదిరోజుల విరామం అనంతరం ఫిబ్రవరి 15-వ తిరిగి ప్రారంభం అయింది లంక సత్యం దర్శకత్వాన నెప్ట్యూన్ స్టూడియోలో తయారవుతున్న యీ చిత్రంలో శ్రీరంజని, కన్నాంబ, సురభి బాలసరస్వతి, ఎన్ టి రామారావు, నాగయ్య, రేలంగి, శంకర, పేకేటి ప్రభృతులు నటిస్తున్నారు. మార్చిలోనే విడుదలచేయాలని నిర్మాతల సంకల్పం

* * *

## నయా ఆద్మీ

జూపిటర్ వారి హిందీ చిత్రం "నయా ఆద్మీ" నిర్మాణం వేగంగా సాగుతోంది. ఇందులో ఒక ముఖ్యభూమిక నిర్వహిస్తున్న హిందీనటుడు అన్వర్ హుసేన్ కు రెండు మాసాలక్రితం కాలికి దెబ్బ తగిలినందువల్ల, అతను విశ్రాంతి తీసుకోవలసివచ్చింది ఇప్పుడు పూర్తిగా కోలుకొని, ఫిబ్రవరి రెండో వారంలో మద్రాసుకు వచ్చాడు. మొన్న విడుదలఅయిన తెలుగు చిత్రం "సంతోషం"లో నటించిన ఎన్ టి రామారావు, అంజలి ప్రభృతులంతా ఇందులో ఉన్నారు ఈ చిత్రాన్ని మార్చి 30-వ విడుదల చేయడానికి నిర్మాతలు, దర్శకుడు సి పి దీక్షిత్ కృషి చేస్తున్నారు.

* * *

## నెల్లూరు సినిమాప్రేక్షక సంఘం బాలెట్

ఫిబ్రవరి 4 నుండి 7 వ తేదీవరకూ, నెల్లూరు సినిమాసంఘం, అక్కడి థియేటర్లలో బాలెట్ జరిపింది దీనిప్రకారం 1955 వ సంవత్సరంలో 'రోజులు మారాయి' ఉత్తమ చిత్రంగాను, శ్రీ ఎల్ వి. ప్రసాద్ ఉత్తమ దర్శకుడుగాను, శ్రీ ఎం. నాగేశ్వరరావు ఉత్తమ నటుడుగాను, శ్రీమతి అంజలీదేవి ఉత్తమ నటిగానూ ఎన్నికైనట్లు ప్రకటించారు ★

# బొంబాయి సినిమా లేఖ

ప్రపంచవ్యాప్తంగా ప్రదర్శింపదగ్గ పద్ధతిలో ఒక చిత్రం నిర్మించాలని సుప్రసిద్ధదర్శకనిర్మాత శ్రీ ఎస్.ఎస్. వాసన్ సంకల్పించారు. ఈ నిర్మాణానికై ఆయన హాలీవుడ్‌తో చేతులు కలుపుతున్నారు. ఈ విషయమై నుంచీ చర్చా మాట్లాడి వ్యవహారం చక్కబెట్టుకు రావడానికై వాసన్ తన ప్రతినిధి శ్రీ పార్థసారధిని అమెరికా పంపించారు. ఆయన ప్రస్తుతం అమెరికాలో కొలంబియా, ట్వెంటీయత్ సెంచరీ ఫాక్స్ సంస్థల అధిపతులతో సంప్రతింపులు సాగిస్తున్నారు. ఇంతకాలంగా హాలీవుడ్ చిత్రాలు ఇక్కడ విడుదల అవడం డబ్బుచేసుకోవడం జరుగుతూనే ఉన్న భారతీయ చిత్రాలు అమెరికాలో ప్రదర్శించడానికి ఆస్కారం లేకుండా ఉంటూ వచ్చింది. ఉత్తమ శ్రేణి చిత్రాలయిన ఝాన్సీకీ రాణి, ఝనక్ ఝనక్ పాయల్ బాజే వంటి చిత్రాలుగూడా ఆదేశంలో ప్రదర్శించడానికి 'మార్కెట్' దొరకలేదు. దీన్నిబట్టి, అమెరికన్ చిత్రాలు ఇక్కడ ప్రదర్శించడానికి ధారాళంగా అనుమతులు ఇవ్వడం ఏమిటని కొందరు నిరసిస్తున్నారు. వాటి సంఖ్యను పరిమితంచేస్తే మంచిదని కూడా కొందరు ప్రముఖులు ఆలోచిస్తున్నారు మొత్తంమీద ఈ పరిస్థితుల దృష్ట్యా, హాలీవుడ్ నిర్మాతలు, ఇటుపై భారతీయనిర్మాతలతో చేతులు కలిపి చిత్రాలు నిర్మించాలన్న అభిప్రాయానికి వచ్చినట్లు కనబడుతుంది. అమెరికా నటులను భారతీయ నటులను కూడా తీసుకొని, ఆంగ్ల, హిందీ భాషలలో చిత్రాలు నిర్మించాలని వారు సంకల్పించారు. కథాస్థలం కూడా భారతదేశంలోనే ఉంటుంది. ఇప్పుడు వాసన్ సంప్రతింపులు జరుపుతున్న చిత్రానికి ఇతివృత్తం దక్షిణ భారతదేశానికి సంబంధించినదేనని, ఇందులో, దక్షిణ భారత నాట్యకళావిధానం ప్రదర్శించడానికి బాగా అవకాశం ఉంటుందని తెలిసింది. బహుశా, ఈ చిత్రంలో నాయకపాత్రను వైజయంతిమాలకు ఇవ్వడం జరుగవచ్చునట.

* * *

మోహన తిరోగమించింది. తారాపథాన్ని అందుకోవడానికి ఏడాదిపాటు ప్రయత్నాలుచేసి, చివరకు హిందీ చలనచిత్ర రంగంనుండి [illegible], వెళ్ళిపోయింది. తారగా తన ప్రతిభను విలువను భారత చలనచిత్ర పరిశ్రమలో ఎవరూ గుర్తించలేదని నిరసించింది మోహనా. ఆమె గోవాలో ఒక క్రైస్తవ కుటుంబానికి చెందినది. బొంబాయి చలనచిత్ర రంగంలో ప్రవేశించిన కొంతకాలానికి మోహన తన భర్తతో ఇంగ్లాండ్ వెళ్ళింది. అక్కడ చాలమంది మోహనాని "ఇండియన్ జేన్ రస్సెల్" అని మెచ్చుకోవడం జరిగింది. దరిమిలా రోమ్ వెళ్ళినపుడు ఇటాలియన్ నటి జీనా లో బ్రిగిడాతో పోల్చారు. ప్రచారం చాలా జరిగినా, మళ్లా బొంబాయి వచ్చినతరువాత ఫలితం ఏమీ లేకపోయింది. వేసిన వేషాలన్నీ చిన్నవేతప్ప ప్రధాన భూమికలు ఆమెకు లభించలేదు.

* * *

చలనచిత్రకళలో ఉత్తమ ప్రమాణాలు అందుకున్నవారికి 'ఫిలింఫేర్' పత్రిక ఏటా ఇచ్చే బహుమతులు ఈ సారి ఈ క్రింది వారికి లభించాయి... ఈ బహుమతి ప్రదానాలు ప్రారంభించి మూడేళ్ళయింది.

ఉత్తమచిత్రం: ఫిలింస్థాన్ వారి 'జాగృతి' (నిర్మాత ఎస్. ముఖర్జీ).

ఉత్తమదర్శకుడు బిమల్ రాయ్. (బిరాజ్ బహూ) ఈయన బహుమతిని అందుకోవటానికి మూడవసారి.

నటి – కామినీ కౌశల్ (బిరాజ్ బహూ)

నటుడు – దిలీప్ కుమార్ (ఆజాద్).

ఉపపాత్ర ధారిణి – నిరూపా రాయ్ (మునీంజీ).

ఉపపాత్రధారి – అభి భట్టాచార్య (జాగృతి).

సంగీతదర్శకుడు – హేమంత కుమార్ (నాగిన్).

కథ–పండిత ముఖ్‌రామ్ శర్మ (వచన్).

న్యాయమూర్తి ఎస్. ఆర్. తెండూల్కర్ అధ్యక్షతన వెలసిన సంఘం 15 చిత్రాలమీదనై నిర్ణయాలు చేసింది.

సాంకేతిక శాఖలో ఈ క్రిందివారికి బహుమతులు వచ్చాయి:

ఛాయాగ్రహణం గ్రహీ – ద్వారకాదివేచా (యాస్మిన్).

శబ్దగ్రహణం – కౌశిక్ (అమర్.)

కళాదర్శకత్వం – రూసీ బాంకర్ (మీర్జా గాలిబ్).

ఎడిటింగ్ – హృషీకేశ ముఖర్జీ (నౌక్రీ).

(ఆంధ్రవారపత్రిక బొంబాయి విలేఖరి)

## గ్రేస్ కెల్లీ పెళ్ళి ముచ్చట

కంట్రీగర్ల్‌లో నటించి, అకాడమీ అవార్డు అందుకున్న ఎం. జి. ఎం. తార 'గ్రేస్ కెల్లీ' మొనాకో ప్రభువు రెయినర్ III ను వివాహం చేసుకోబోతోంది.

ఏప్రిల్ రెండోవారంలో అతివైభవంగా జరుగనున్న ఈ వివాహం పురస్కరించుకొని, మొనాకో తపాలాశాఖ అధికారులు ప్రత్యేకం తపాలాబిళ్లలు ముద్రించ నిశ్చయించారు. వాటిపై వధూవరుల బొమ్మలు ఉంటాయి.

ఒక విశేషం ఏమిటంటే మొనాకో ధర్మశాస్త్రప్రకారం, రాజకుటుంబంలో ఎవరు వివాహం చేసుకున్నా రాజు అనుమతి ఇవ్వాలి. ఇప్పుడు ఈ వివాహంలో వరుడే ప్రభువు. అయినా, అనుమతి జారీ కావలసిందే. అందుకని న్యాయశాఖాధికారి, పెళ్ళికుమారుడుగా ప్రభువు అనుమతి కోరుతాడు. అప్పుడు రాజుగారు, తన వివాహానికి లాంఛనంగా తామే అనుమతి, జారీ చేస్తారు.

గ్రేస్ కెల్లీ పెళ్లి చేసుకొన్న తరువాత, చలనచిత్రాలకు ఉద్వాసన చెబుతుందా అన్న సంగతి ఇంకా తేలలేదు.

* * *

## నరసూలో నాలుగో ఫ్లోర్

నరసూ స్టూడియోలో మరో ఫ్లోర్ నిర్మిస్తున్నారు. ఇది నాలుగవది. నూటయాభై అడుగుల పొడుగు, నూరడుగుల వెడల్పు ఉంటుందట. తలపెట్టిన చిత్రనిర్మాణ కార్యక్రమం దృష్ట్యా, మరో ఫ్లోర్ అవసరమని ఈ నిర్ణయం చేశారు. నరసూవారి కొత్త హిందీచిత్రం 'సితారోంసే ఆగే'. ఈ స్టూడియోలోనే నిర్మిస్తారు. శ్రీ జ్ఞాన్ ముఖర్జీ దర్శకత్వాన తయారయ్యే యీ చిత్రంలో అశోక్‌కుమార్, వైజయంతిమాల ప్రధాన భూమికలు నిర్వహిస్తారు. వీళ్లిద్దరు కలసి నటించడానికిదే తొలిసారి. ఈ చిత్రానికి శ్రీ సచిన్‌దేవ్ బర్మన్ సంగీత దర్శకుడు.

# బాలసాహితి

## మాయ కుంచె

జె. లక్ష్మీరెడ్డి

గోపీ బాల్యంలోనే తల్లిదండ్రుల్ని కోల్పోయాడు. నా అని ఆదరించేవారు ఎవరూ లేకపోవటంచే చిన్నవయసులోనే కట్టెలమ్ముకుని జీవించేవాడు. చురుకైనవాడు. బొమ్మలు వేయటమంటే ఎక్కడలేని సరదా. కాని కుంచె కొనుక్కోటానికి వాడికి తాహతేది?

ఒకనాడు గోపీ డ్రాయింగు నేర్పే స్కూలుకు వెళ్ళి మాష్టరు కుంచెతో చిత్రిస్తున్న బొమ్మలోని ఒంపులను చూసి తన్మయుడై అడిగాడు: "ఏమండీ, నాకూ డ్రాయింగు నేర్చుకోవాలని వుంది. మీరో కుంచె ఇవ్వగలరా?"

మాష్టరు ఆశ్చర్యంతో, "ఏమిటీ! నీవా? వేలెడున్నావో, లేదో! ఏం నాయనా, కల కంటున్నావా, పాపం!" అని హుంకరించి వాడిని తరిమికొట్టాడు. గోపీ హతాశుడయ్యాడు. తన అభిమతం మాత్రం మార్చుకోలేదు. "బీదవాడినైనంత మాత్రాన నేనెందుకు నేర్చుకోగూడదూ?" అనుకున్నాడు.

మనసు దృఢపరచుకొని ఎలాగయినా నేర్చుకు తీరాలనే పట్టుదలతో కార్యసాధనకు పూనుకున్నాడు. కట్టెలు ఏరుకోటానికి అడివికి వెళ్ళినపుడు కాకి ఈక సంపాదించి ఇసుకమీద పక్షులను గీసేవాడు. నదికి వెళ్ళినపుడు చేపలను వ్రాసేవాడు. ఇంట్లో అనేకరకాలయిన బొమ్మలను నాలుగుగోడలు నిండేంతవరకు వేసేడు.

రోజులు గడిచిపోతున్నయ్. గోపీ కార్యసాధనలో ఒక్కరోజు గూడ నాగాపడనీయలేదు. కొంతవరకు ఆరితేరాడని చెప్పొచ్చు. అతని చిత్రాలలో జీవం ఉట్టిపడుతూండేది. కాని గోపీకి ఇంకా కుంచె లభించలేదు. అప్పుడప్పుడూ తనకు ఒక కుంచెవుంటే ఎంత బావుండునని అనుకునేవాడు.

ఓ రాత్రి, రోజంతా పనిచేసి అలిసిపోయి ఎప్పటికంటె తొందరగా నిద్రపోయాడు. తెల్లటి గెడ్డంతో ఒక వయోవృద్ధుడు వచ్చి ఓ కుంచె ఇచ్చాడు.

"ఇది చాలా చిత్రమయిన కుంచె! చాలా జాగ్రత్తగా వాడుకోవాలి! తెలిసిందా?" అన్నాడు వృద్ధుడు. గోపీ అది తీసుకున్నాడు. బంగారం మెరిసినట్లు ధగధగ మెరిసిపోతోంది.

"అబ్బ! ఎంత అందంగా వుంది! మీకు సర్వదా కృతజ్ఞుడ్ని......" అన్న గోపీ మాటలు పూర్తికాకముందే వయోవృద్ధుడు అదృశ్యమైనాడు. గోపీకి మెలకువ వచ్చింది. చుట్టూ చూశాడు. ఎప్పటి పాత ఇల్లే! అయితే కలై వుండాలి! కాని ఆ కుంచె చేతిలో వుండగానే కలెలా అవుతుంది? సంభ్రమాశ్చర్యాలతో ఎప్పుడు తెల్లవారుతుందా అని నిద్ర లేకుండానే గడిపాడు.

ఉదయమే లేచి క్రొత్తకుంచెతో ఓ పక్షిని చిత్రించాడు. అది రెక్కలు దులుపుకుని ఆకాశంలో ఎగురుతూ చక్కగా గానంచేసి అతనిని తన్మయుణ్ణి చేసింది. ఓ చేపను గీశాడు. అది తోక ఊగిస్తూ నీళ్ళల్లోకి దుమికి ఆడుతూ అతనికి ఆహ్లాదాన్ని కలుగజేసింది.

గోపీ కుంచెతో ప్రతిరోజు తన ఊళ్లో బీదలకు ఏ వస్తువు లేదో తెలుసుకుని ఎవరికి కావలసినవి వాళ్ళకు చిత్రించి వాటి నిజస్వరూపంతో ఇచ్చేవాడు.

ఏ రహస్యమైనా ఎల్లకాలం దాగటం దుస్సాధ్యం. గోపీ మాజిక్ బ్రష్‌ను గురించిన వార్త తొందరలోనే ఆ గ్రామ భూస్వామి చెవిని

పడ్డది. వెంటనే తన మనుషులిద్దరిని పంపి తన కవసరమయినవి గ్రీయమని బలవంతపెట్టాడు. గోపీ పిన్నవాడయినా చచ్చేంత ధైర్యంవుంది. ఆఊళ్ళో భూస్వాముల దురాగతాలు వాడెరిగినవే. అయినా వెరువక ఒక్క చిత్రాన్నికూడా ఇవ్వటానికి అంగీకరించలేదు. భూస్వామి వాడి నోగదిలో బంధించి బాధించ సాగాడు.

మూడు రోజులు గడిచాయ్. ఆ రోజు మంచు దట్టంగా పడుతోంది. కొద్దిగా ఎండెక్కేప్పటికి భూమి మీద మంచు పేరుకుపోయింది. ఆకలికి గాకపోయినా శీతలానికి గోపీ చచ్చివుంటాడని భూస్వామి వాడిని చూద్దామని వెళ్ళేడు. గది తలుపు తెరిచి చూస్తే ఇంకేముంది? ఎదురుగా మండుతున్న కుంపటి దానిమీద తయారవుతున్న ఆహారం, ప్రక్కనేకూర్చుని రొట్టెలు ఆరగిస్తున్న గోపీని చూడటంతో భూస్వామి తనకళ్ళను తనేనమ్మలేక పోయాడు. ఈ కుంపటి, రొట్టెలు ఎక్కడనుంచి వచ్చాయ్? ఇవన్నీ వాడే చిత్రించివుంటాడని అప్పుడు తెలుసుకున్నాడు భూస్వామి. పగతో మండిపడి వెంటనే వాడిని చంపి ఆ బ్రష్ నాశనంచేయమని తన మనుషులకు ఆజ్ఞాపించాడు.

వాళ్ళు గదిలో ప్రవేశించే సమయానికి గోడకు త్రాడు మాత్రం వేలాడివుండటం చూశారు. భూస్వామి మరి ఆలస్యంచేయక తనూ తాడుపైకి ఎగప్రాకాడు. చివరికి చేరుకునేలోగా కాలుజారి క్రింద పడిపోయాడు. తిరిగి లేచేలోగా గోపీ మాయమైనాడు.


భూస్వామిబారినుండి తప్పించుకున్న గోపీ ఎక్కడకు వెళ్దామా అని ఆలోచించేడు. ఆ ఊళ్లోనే దాగితే తన్ను దాచిన మిత్రులకే కష్టాలు తప్పవు. కాబట్టి ఆ చాయ విడిచి దూరంగా వెళ్ళడమే మంచిది.

అప్పుడే ఓ చక్కని అశ్వాన్ని చిత్రించి దాని నధిరోహించి రయ్‌మని బయల్దేరేడు. కొద్ది దూరం వెళ్లాడో లేదో వెనుక గందరగోళం వినిపించింది. వెనుతిరిగి చూసేడు. భూస్వామి అనుచరులతో గుర్రాల మీద వెంబడిస్తున్నాడు. భూస్వామి చేతిలో పెద్ద బల్లెం వుంది.

తొందరలోనే వాళ్లు సమీపించారు. గోపీ తన మాయ కుంచెతో ఎక్కుపెట్టిన బాణంతో ఓ విల్లు గీశాడు. ఆ బాణం "బుస్"మంటూ వెళ్ళి భూస్వామి రొమ్మును తాకింది. అతడు గుర్రంమీదినుంచి పడి అసువులు బాశాడు. అదే విధంగా తన శత్రువులందరినీ హతమార్చి గోపీ ముందుకు సాగాడు.

రాత్రీ పగలనక కొన్ని రోజులు ప్రయాణం చేశాడు. చివరికి ఒక పట్టణం చేరుకుని అక్కడే నివసించటానికి నిర్ణయించుకున్నాడు. స్వగ్రామానికి అంతులేని దూరంలో వున్నాడు.

అక్కడ ఏమీ పని దొరక్కపోవటం మూలంగా చిత్రాలు వేసి బజారులో అమ్మటం మొదలెట్టాడు. కాని తన నిజస్వరూపం బయటికి రాకుండా వుండేందుకు తన చిత్రాలకు—పక్షులకు రెక్కలు లేకండా,



జంతువులకు ఒక కాలు తీసేసి— జీవం రాకుండా చేశాడు.

ఒకరోజు ఒక కొంగను గీసి అజాగ్రత్తతో కళ్లు తీసి వెయ్యాడం మరిచాడు. పక్షి అంతతో కండ్లు తెరిచి, రెక్కలు, చరిచి గగనంలోకి ఎగిరిపోయింది. అది చూడటంతో పట్టణంలో ఆశ్చర్యం, కలకలం బయలు దేరింది. సిపాయీలు కొంతమంది చక్రవర్తికి ఫిర్యాదు చేశారు. వెంటనే గోపీని కోర్టులో హాజరు పెట్టవలసిందిగా ఉత్తర్వులు జారీ చేశారు. గోపీకి హాజరవటం ఇష్టం లేదు. కాని సిపాయీలు అభయమిచ్చి, భయపెట్టి తీసుకుపోయారు.

నిరుపేదలను హింసిస్తున్న చక్రవర్తి ఘాతుక కృత్యాల్ని గురించి గోపీ అంతా విన్నాడు. అతని శరీరంలోని ప్రతి అణువూ చక్రవర్తిని అసహ్యించుకున్నది. అటువంటి దుర్మార్గుడికి తను సహాయం చేయబోవటం లేదు.

చక్రవర్తి హంసను గీయమని ఆర్డరిచ్చినపుడు బాతును వేసేడు. నెమలికి బదులుగా కోడిని చిత్రించేడు. ఈ రెండూ కలిసి రాజభవనమంతా నానా ఖరాబు చేశాయి. చక్రవర్తి ఉగ్రుడై కుంచె లాగుకుని, వాడిని జైలులో బంధించమని ఆజ్ఞ ఇచ్చాడు.

ఇప్పుడు కుంచె చక్రవర్తి చేతికి వచ్చింది. దానితో చిత్రించటానికి ప్రయత్నించాడు. మొదట బంగారు పర్వతాన్ని లిఖించాడు. అది ఒక్కటే చాలక ఇంకొకటి, ఇంకొకటి అని కాగితం నిండేంతవరకు గీశాడు. అవి పూర్తవగానే ఏమయిందనుకుంటున్నారు? బంగారు పర్వతాలన్నీ చట్టుబండలుగా తయారయ్యాయి. అవి మరీ ఎత్తవటంవల్ల ఒక్కొక్కటి క్రింద పడి చక్రవర్తి పాదాలకు తగిలి రక్తాన్ని ప్రసాదించాయి.

అయినప్పటికీ చక్రవర్తి మనసు మారలేదు. బంగారు పర్వతాలు విఫలం గావటంతో బంగారు ఇటుకలు చిత్రించటం ప్రారంభించేడు. ఒకటి వేశాడు. చిన్నదిగా వుంది. ఇంకొంచెం పెద్దది గీశాడు. ఊహూ. ఇంకా చిన్నదిగానే వుంది. చివరికి చాలా పొడవుగా పేద్దది చిత్రించాడు. అలా కొన్ని బార్లు తీర్చాడు. పూర్తవగానే మరల ఏమయిందనుకుంటున్నారు? బంగారు ఇటుకలన్నీ కలిసి పెద్ద కొండచిలువగా మారింది. అది వెడల్పాటి పెద్దనోరు తెరిచి చక్రవర్తిని కబళించటానికి మీదికి వచ్చింది. అదృష్టవశాత్తు సిపాయీలు అదేసమయంలో అక్కడికి రావటంవల్ల చక్రవర్తి రక్షింపబడ్డాడు. లేకపోతే ఆ భయంకర జంతువు వాతబడివుండేవాడు.

ఈ సంఘటనతరువాత ఆకుంచె తనకేమీ ఉపయోగం లేదని తెలుసుకుని గోపీని విడిపించాడు. వాడిని సత్కరించి తీయని మాటలతో యువరాణిని కూడ ఇచ్చి పెండ్లి చేస్తానని మంచిచేసుకో ప్రయత్నించాడు. ఇంతకుముందే వేరే ఎత్తు వేసుకున్న గోపీ చక్రవర్తి చెప్పిన వాటన్నిటికీ అంగీకరించినట్టు నటించాడు.

"ఏడు పర్వతాలు చిత్రిస్తే భయంకర జంతువులు బయటికి

రావచ్చు. ఎందుకయినా మంచిది సముద్రం వేయనీ!" అనుకున్నాడు చక్రవర్తి.

వెంటనే సముద్రం చిత్రించమని గోపీకి ఆజ్ఞ యిచ్చాడు.

గోపీ కుంచె తీసుకుని అంచులు లేని అనంత సముద్రాన్ని లిఖించాడు అది నీలంరంగుతో మెరిసిపోతూ, పెద్ద భూతద్దంలా ప్రకాశించింది.

"ఈ సముద్రంలో చేపలు లేవు, ఎందుకని?" అడిగాడు చక్రవర్తి.

గోపీ చేపలను గీశాడు. అవి ఇంద్ర ధనస్సులో వుండే ఏడురంగులతో ప్రత్యక్షమయినయ్. తోకలు ఆడిస్తూ కాసేపు ఉల్లాసాన్ని కలిగించి లోపలకు తుర్రుమన్నయ్. చక్రవర్తి ఇదంతా ఆనంద తన్మయత్వంతో పరీక్షిస్తున్నాడు. అవి దూరదూరంగా పోవటంతో,

"ఆ చేపలను చూడటానికి సముద్రంలో ప్రయాణం చేయ బుద్ధవుతోంది. తొందరగా ఓడ వెయ్!" అని అర్థించాడు గోపీని. వెంటనే గోపీ ఒక పెద్ద పడవ సృష్టించాడు. అందులో చక్రవర్తి, చక్రవర్తి భార్య, యువరాజులు, యువరాణులు, మహామంత్రులు అంతా ఎక్కారు. గోపీ కొద్ది గుత్తులు పెట్టి గాలిని కల్పించాడు. సముద్రంలో అలలు అందంగా లేచాయి. పడవ ఉల్లాసంగా ఊగుతూ లోపలకు వెళ్తోంది.

చక్రవర్తికి గాలి నెమ్మదిగా వస్తున్నట్టుంది. పడవచివరనించి గోపీతో అన్నాడు బిగ్గరగా—

"గాలి ఇంకా ఎక్కువగా రానీ! ఇంకా...! ఇంకా!" గోపి మాజిక్ బ్రష్‌తో బలీయమైన చుక్కలు పెట్టి పెద్దగా గాలి పంపాడు. సముద్రంలో అలలు అల్లకల్లోలమయినయ్. గోపీ ఇంకా కొద్ది చుక్కలు పెట్టాడు. బ్రహ్మాండమైన తుఫాను బయలు దేరింది. పడవ అటూ ఇటూ ఊగుతోంది. పడవలో అందరికీ భయం వేసింది. చక్రవర్తి బిగ్గరగా అరిచాడు-"ఆ గాలి చాలు! నే చెప్తున్నాగా! చాలు, చాలు!"

గోపీ ఇదేమీ వినపడనట్టు నటిస్తూ ఇంకా ఇంకా పంపుతున్నాడు గాలిని. సముద్రం భయంకరమయింది. తీవ్రమయిన తుఫానుకు వెలుతురుపోయి అంతా అంధకారమయింది. హోరుమని గాలి ఎక్కువవుతూనే వుంది. చక్రవర్తి ఇంకా అరుస్తూనే వున్నాడు. గోపీకి అదేమీ వినిపించినట్టు లేదు. తన పనిలో తను లీనమైనాడు. సముద్రం బీభత్సంగా ఉంది. పడవ మునిగిపోయింది. చక్రవర్తి పరివార సమేతంగా సముద్రంఅట్టడుగున చేరాడు.

చక్రవర్తి మరణానంతరం గోపీ కుంచెనుగురించిన వార్తలు చాలా వరకు వ్యాపించాయి. కాని ఇంతకూ గోపీ ఏమయినట్టు?—ఎవరికీ తెలియదు.

స్వగ్రామానికి వెళ్లి రైతాంగంలో కలిసిపోయాడని కొంతమంది ఊహాగానం చేస్తారు.

మరి కొంతమంది పేదలకు సహాయం చేస్తూ పాద సంచారం చేస్తున్నాడంటారు. ★

# పీటర్ టోపీ

కొంటె మరదలు: బావా, మా నాన్న నన్నే కనక నీకిచ్చి పెళ్లి చేసిఉంటేనా, విషంపెట్టేసే దాన్ని.

కొంటె బావ: మరే నిన్నే నేను పెళ్లాడిఉంటే, విషంలా తాగేసేవాణ్ణి.

హాలెండు దేశంలో పీటర్ అనే పిల్లవాడు ఉండేవాడు. పైకి పిల్లవాడే కాని బలే చిలిపి పిల్లవాడు కూండి. ఒకరోజు ఇంట్లో మారాము చేసి వాళ్ల నాన్న చేత టోపీ కొని పిచ్చుకొన్నాడు. రోజూ టోపీ పెట్టు కొని బడికి పోతుండేవాడు.

ఆరోజు సాయంకాలము పీటర్ పిల్లవాళ్ళతో కలిసి బంతిఆట ఆడు కొంటున్నాడు రోడ్డు మీద. ఇంతలో ఆ దేశపు రాజుగారు ఏదో తొందరపని వుండి అటువేపు రోడ్డు మీద పోతున్నారు. వారి వెంట కొంతమంది సైనికులు కూడా ఉన్నారు.

పీటర్ ఆడుతూ ఆడుతూ రాజు గారివైపు చూశాడు. రాజుగారితల పైన టోపీ లేదు. రాజుగారిని ఎలా గైనా ఏడిపించా లనుకున్నాడు పీటర్.

పిల్లలతో రాజుగారికి వినపడే టట్టు "ఏయ్, రాజుగారికి టోపీ లేదు. నాకు టోపీ వుంది" అన్నాడు పీటర్.

రాజుగారు ఈ మాటలు విని కోప్పడ్డారు. "ఏయ్ ఆ పిల్లవాని తలపై వుండే టోపీని లాక్కురండి!" అని ఆజ్ఞాపించారు రాజుగారు సైని కులకు! సైనికులు వెంటనే పీటర్ దగ్గరకు వచ్చి అతని తలపై ఉన్న టోపీని తీసికొనిపోయి రాజుగారి కిచ్చారు.

పీటర్ ఏమీ అనుకోకుండా మళ్లా పిల్లలతో పెద్దగా "ఏయ్! రాజుగారికి టోపీ లేక నా టోపీ తీసుకొన్నారు" అన్నాడు ఎగతా ళిగా.

ఈ మాటలు విని రాజుగారు మండిపడ్డారు. సైనికులతో "వాడి టోపీ వాడికి యిచ్చెయ్యండి" అన్నారు. సైనికులు మళ్లా పీటర్ దగ్గరకు వచ్చి టోపీ యిచ్చారు.

పీటర్ మళ్లా సంతోషంతో "ఏయ్ రాజుగారు నాతో గెలవలేక నా టోపీ నాకిచ్చేశారోయ్" అని అన్నాడు పెద్దగా పిల్లలతో.

ఈసారి పీటర్ మాటలు విన్న రాజుగారికి అరికాలిమంట నెత్తి కెక్కింది. కాని ఏం చెయ్యగలడు? దండించా లనుకుంటే చిన్నపిల్లవా డాయె. కొడదామనుకుంటే రాజు గారికి చేతు లెలా వచ్చాయో? పిల్లవాణ్ణి కొట్టడానికి అని తనను ప్రజ లేమనుకుంటారో! పిల్లవాడు చూద్దామంటే బాగు లేదు. మాటలు చూద్దామంటే తనకు మించిపోతున్నాయ్. ఏం చెయ్యడా నికీ పాలుపోక నవ్వుతూ పీటర్ దగ్గ రకు వచ్చాడు.

కొట్టడానికి దగ్గర కొస్తున్నా డేమో రాజుగారని పీటర్ భయ పడ్డాడు. కాని అలాంటిదేదీ జరగ లేదు. పైపెచ్చు రాజుగారు పీటర్ యొక్క ధైర్యానికీ, తెలివికీ అతన్ని ఎంతో మెచ్చుకొన్నారు.

తన భవనమునకు తీసికొనిపోయి రాజుగారు పీటరుకు బిస్కట్లు, రొట్టెలు తినమని యిచ్చారు. ★

కమ్మిసెట్టి వెంకటేశ్వరరావు

# గంగాస్నానం

కోటయ్యసెట్టి మాంచి ధనవంతుడు. అతడు సంసారసుఖాలన్నీ అనుభవించి, యాభయ్యవ పడిలోకి వచ్చేసరికి, అయినవాళ్ళందరూ, "ఏమిటయ్యా, ఇంతవరకూ రెండు చేతులా గడించావు. ఈ లోకంలో వెలితి లేకుండా అనుభవించావు. వయస్సులో వున్నన్నాళ్ళూ ఒక దేవుడూ దయ్యమూ అంటూ లేకుండా గడించడంతోనే సరిపెట్టావుగదా! ఇక నీ హయాము అయిపోయిందామె. కొడుకులు పెత్తనం చేసుకోగలుగుతున్నారు. ఇంకా ఎందుకంట నీకీ సంసారపు జంజాటమంతా? - ఏదో కృష్ణా రామా అంటూ పరలోకం సంగతి చూసుకోకూడదూ? మా మాట విని, బ్రతికుండగా ఆ కాశీకి పోయి, ఆ గంగానదిలో మునిగి, విశ్వేశ్వరుని దర్శనం చేసుకుని ఇన్నాళ్లూ వ్యాపారంలో చేసిన పాపాలన్నీ కడిగేసుకో" అని సలహా ఇచ్చారు.

కోటయ్య ఆలోచించాడు. నిజమే! ఇన్నాళ్ళూ పాపమో పుణ్యమో ఎంచకుండా తెచ్చిపడేసుకోవటంలోనే తనకు సరిపోయింది. రేపు యముడు వచ్చి ఈ పాపాలన్నిటినీ మూటకట్టి తన నెత్తినవేసి లాక్కుపోతుంటే - తను మోయగలడా? ఎవరు మోస్తారు! చూడగా వీళ్లు చెప్పింది సబబుగానే వుంది. ఈ బాధంతా లేకుండా చేసుకోవాలంటే ఓ వంద వరహాలు మనవి కావనుకుని కాశీకి వెళ్లి వచ్చామనిపిస్తే సరిపోతుంది! — పరలోకాన్ని గురించిన బెడద ఇట్టే తీరిపోతుంది.

**పణతుల రామచంద్రయ్య**

మరునాడే కోటయ్య శాస్త్రుల్ల దగ్గరికి పోయి కాశీయాత్రకు మంచి రోజు చూసుకువచ్చాడు. తండ్రిగారి యాత్రకు కొడుకులిద్దరూ వడివడిగా సన్నాహాలు జరిపించేశారు. అనుకున్న రోజున తట్టాబుట్టా కట్టుకుని కోటయ్యా, ఆయన భార్యా బండిలో కాశీకి బయలుదేరారు.

ఇప్పటిలాగా ఆ కాలంలో ప్రయాణాలకు రైళ్లూ కార్లూ విమానాలూ ఉండేవికావు. ఎంత దూరం పోవాలన్నా నడిచో, తప్పితే బండ్లమీదో పోతూ ఉండేవారు.

కాశీకి పోతూ కోటయ్య దంపతులు దారిలో తమ బంధువులింట్లో

# ★ గంగాస్నానం ★

దిగారు. ఆ బంధువు కోటయ్యతో, "కోటయ్యా, నేను చెబుతున్నానని మరేం అనుకోకుసుమీ! చిత్తశుద్ధి అనేది ఉండాలి. అది లేనప్పుడు ఎన్ని గంగాస్నానాలు చేసినా ఒకటే. ఎన్ని దేవుళ్లకు మొక్కినా ఒకటే. గంగ మన యిళ్ళలో లేదూ? అయినా నువ్వు ఇంత సంరంభంగా బయల్దేరుతున్నప్పుడు నిన్ను నిరుత్సాహపరచడం నా అభిమతం కాదు. లక్షణంగా వెళ్ళి గంగాస్నానం చెయ్యి. ఇదిగో, నేను సమర్పించినట్లుగా ఈ హారం తీసుకుపోయి ఆ గంగాభవానికి సమర్పించిరా" అని చెప్పి కోటయ్య చేతికి హారం ఒకటి యిచ్చాడు.

ఆపై, కోటయ్య అతనివద్ద సెలవు పుచ్చుకుని భార్యా సమేతంగా కాశీ చేరుకున్నాడు. ముందుగా కాలభైరవుడు, డుంఠి గణపతి, షణ్ముఖుడు మొదలయిన దేవతలనందరిని దర్శించారు. ఆతర్వాత విశ్వనాథుణ్ణి దర్శించా లనుకున్నారు. కాని గంగలో మునగనిదే విశ్వనాథ సందర్శనం చేసుకోరాదు కాబట్టి ఇరువురూ మణికర్ణికాఘట్టంలో స్నానానికి దిగారు.

స్నానం చేసి, సంకల్పం చెప్పించుకున్నతర్వాత, కోటయ్యకు తమ బంధువు ఇచ్చిన హారంసంగతి గుర్తుకు వచ్చింది. అతడా హారాన్ని చేత్తో పట్టుకుని, "గంగాభవాని! భక్తుడొకడు ఈ హారాన్ని నీకిమ్మన్నాడు" అంటూ దాన్ని నీటిలో విడువబోయాడు.

అంతలోనే, కోటయ్యా అతడి భార్యా ఆశ్చర్యపడేట్లుగా, గంగలో నుండి రత్నకంకణాలతో దేదీప్యంగా వెలిగిపోతున్న ఒక స్త్రీ హాస్తం నీటి వెలుపలికి వచ్చి, కోటయ్య నీట వదల్తున్న ఆ హారాన్ని అందుకొని మరుక్షణంలోనే అదృశ్యమయింది!

అదంతా తన బంధువు పురాకృతపుణ్యఫలితమని కోటయ్య విస్తుపోయాడు. వెంటనే తన మొలలో నుండి ఒక రూక తీసి, "తల్లీ! ఇదిగో, ఈ బీదవాని కానుక కూడా అంగీకరించు" అని నీట విడిచాడు. కాని అది బుడుంగుమని నీటిలో మునిగి

## తత్త్వం

టెలిగ్రాఫ్ కనిపెట్టిన శాస్త్రజ్ఞుడు మోర్స్ చిత్రకారుడుగా కూడా ప్రసిద్ధికెక్కాడు. మరణశయ్యమీద, బాధపడుతున్న ఒక మనిషిని చిత్రించి, దాన్ని ఒక మిత్రుడికి చూపాడు మోర్స్.

ఆయన వైద్యుడు. చాలాసేపు కళ్లజోడుగుండా, కాస్సేపు అది లేకుండా పరిశీలించాడు చిత్రాన్ని. ఇంకో నిముషం ఆలోచించి, అర్ధనిమీలితనేత్రుడై ఆ బొమ్మపై తన అభిప్రాయం చెప్పేశాడు.

"మలేరియా"

పోయింది. మునుపటివలె - దాన్ని అందుకోడానికి గంగలోనుండి చేయి రాలేదు!

కోటయ్యకు గంగాదేవిమీద మహా పెద్ద కోపం వచ్చింది. ఆ కోపంతో, గబగబా భార్యతో కూడా గంగలోనుండి ఇవతలికి వచ్చేశాడు.

ఒడ్డుకు వచ్చి ఇద్దరూ పొడి బట్టలు ధరించారు. ఇక విశ్వనాథుని దర్శనానికని బయలుదేరుతుండగా, కోటయ్య భార్య ఒక్కసారి మెడ తడిమి చూసుకుని, "ఇంకే ముందండోయ్! నా చంద్రహారం గంగలో పోయింది—" అంటూ ఏడుపు లంకించుకుంది. కోటయ్యకు కూడా దుఃఖ మాగలేదు. ఒకవేళ గంగాదేవియే తమ హారాన్ని మాయం చేసివుంటుందనుకొని ఇద్దరూ గంగవైపు తిరిగి "తల్లీ! మా హారం మా కిచ్చెయ్యి" అని ప్రార్థించారు. కాని లాభం లేకపోయింది.

ఇద్దరూ అలా దుఃఖిస్తూనే, ఎలాగో విశ్వనాథుని దర్శనం పూర్తి చేశామనిపించుకుని, తిరిగి ఆ రోజే తమ వూరికి ప్రయాణమయ్యారు.

దారిలో వాళ్లు మళ్ళీ ఆబంధువు యింట్లో దిగారు. కోటయ్య ఆయనతో, కాశీలో జరిగిన విషయమంతా పొల్లుపోకుండా చెప్పాడు. ఆయన నవ్వి, "కోటయ్యా, నేను ముందే చెప్పానుగా! ఆత్మశుద్ధి ఉండాలి. అది లేకుండా ఎన్ని యాత్రలు చేసినా లాభంలేదు. నేనిచ్చిన హారానికి వచ్చినట్లుగా మరోసారి నీ హారానికి కూడా— చేయి నీటిపైకి రావాలని నీవు ఈర్ష్యతో కాంక్షించావు; అలా రాకపోయేసరికి గంగాదేవిమీద కోపం చూపించావు. అందువల్ల నీ కానుకను గంగ స్వీకరించలేదు. అంటే నీకింకా పరిపూర్ణమయిన ఆత్మశుద్ధి కలగలేదన్నమాట. పిచ్చివాడా, మన పెరట్లో తొట్లో ఉన్నది మాత్రం గంగ కాదూ! చూద్దువుగాని రా!" అంటూ కోటయ్యను పెరట్లో నీటితొట్టిదగ్గరికి లాక్కెళ్లాడు. కోటయ్య ఆతొట్టిలో తొంగిచూడగా, గంగానదిలో అతడు కోల్పోయిన హారం ఆ నీటిలో స్వచ్ఛంగా మెరుస్తూ కనబడింది!

కోటయ్య ఆశ్చర్యపోయాడు. అతడు తలవంచుకుని, "నిజం. నాకింకా ఆత్మశుద్ధి కలగలేదు. మీరు మానవమాత్రులు కారు. నే నింకా పాపవిముక్తి పొందకుంటే, మీ పాదాలు స్పృశించినప్పుడు తప్పక పొందుతాను" అంటూ ఆ బంధువుకు పాదాభివందనం చేశాడు. ★

# అదృష్టవంతుడు

**వజ్రపాణి**

భీముడనే గొల్లవాడు
రాముడనే కొమరునితో
అరణ్యమున కడ్డముగా
పొరుగూరికి పోవుచుండ—
గాండ్రు గాండ్రనుచు నొక వ్యా
ఘ్రము దుమికెను వారిమీద
రాము డెగిరి చెట్టెక్కెను!
భీముని తిన్నివైచెను పులి!
ఆ మృగమేగిన పిమ్మట
రాముడు చెట్టు దిగినాడు;
ఏడ్చుచు, ఆకలితో, కా
ళ్ళీడ్చుచు పోసాగినాడు.
దాహముతో అతని నాల్క
తడి యార్చుకపోయె నోరు!
ఓరా! ఎంత దురవస్థ!
నీ రెండును దొరకదాయె!
చనగా, చనగా, ఒక రా
క్షసి వానికి ఎదురైనది!
కన్నులు కనిపించని రా
క్షసి అది! ముసలిది! టక్కరి!
"రారా! నాయనా!" అనుచు
రాముని తోడ్కొని రాక్షసి—
తన సౌధమునం దతనికి
ఘన భోజనము లిడుచుండె!
అనుదినమును రాముని చిటి
కెన వ్రేలును చూపు మనుచు
కోరును రాక్షసి! క్రొవ్విన
నో రుచి కద! నరమాంసము!
అది గ్రుడ్డిది కనుక రాము
డదో చిన్న చెట్టు వేరు
చూపును చిటికెన వ్రేలుగ!!
పాపము! రాక్షసి నమ్మెను!
ఈ నాటక మెన్నినాళ్లు?
నానాటికి విసుగెత్తిన
రాక్షసి - తా నొక్కనాడు
రాముని చంపి తినదలచె!
"నూయి తొంగి చూడు"మనుచు
మాయలాడి చెప్పినంత—
రాముడు "భయమగునే! అ
వ్వా! ముందుగ చేసిచూపు!"
అనినంతనె "ఇట్లు చూడు!"
మని రాక్షసి తొంగిచూచె!
ఆమె కాళ్లు పట్టి అతడు
హఠాత్తుగా నూత ద్రోసె!!




## 10. నక్కా, కుక్కా, పిల్లీ, ఎలకా, చిలకా

'మీరు సవ్వనంటే నేనో కథ చెబుతాను. ఆఖర్ని నా సందేహాలు కొన్ని తీర్చాలి' అన్నాడు జగ్గుబాబు.

జగ్గుబాబు నేస్తాలు ముగ్గురూ జార్జ్, బాబ్జీ, పాపా చుట్టూ కూర్చున్నారు. ఇంతాస్సేపటిలో మరికొందరు పిల్లలు వచ్చారు. జగ్గుబాబు చెప్పేదేమిటో పక్క గదిలో కూర్చుని ఏదో కుట్టుకుంటున్న అమ్మ చెవిలో పడింది. అమ్మ ఆ పని మానేసి ఎంతో ముచ్చటపడి జగ్గుబాబు చెబుతున్నది శ్రద్ధగా వింది.

'కథంటే మరేంలేదు, అది మొన్నరాత్రి నా కొచ్చిన కల. మొన్న అమ్మావాళ్ళతో నేను సినిమా కెళ్ళేను. సినిమా ముందు మంచి కార్టూను చిత్రం 'పక్షులూ-జంతువులూ' అన్నది చూపించేరు. ఎంత బాగుందనుకొన్నారు! ఆ జంతువులన్నీ నాకళ్ళల్లో ఉన్నాయి - నిద్ర పోగానే కలలోకి వచ్చేశాయి.'

ఎంత దృష్టం! ఎంత అదృష్టం!! అనుకున్నారు జార్జ్, బాబ్జీ, పాపా.

'ఈ హాస్యంతా ఎందుకు, వచ్చిన కలేమిటో చెబుదూ?' అన్నాడు ఎదురింటి వెంకటేశు. 'అంతా కల్పన! అన్నీ అబద్ధాలు! వేలెడు గుంట వెధవకి కలరాడం ఒకటే, అది జ్ఞావకముండడం ఒకటేనా? సరే చెప్పు, ఏదో కొంత కాలక్షేపం, పొట్టోడికి పుట్టెడు బుద్ధులన్నారు!' అన్నారు మరొకరు.

'అందులో మా బాబు, పుట్టు బుద్ధులతండ్రి!' అనుకుంది గర్వంగా అమ్మ.

### అవసరాల రామకృష్ణరావు

'తక్కినవన్నీ నాకు జ్ఞాపకం లేవుగాని - ముఖ్యంగా నాకు జ్ఞాపకమున్న జంతువులు నక్కా, కుక్కా, పిల్లీ, ఎలకా, చిలకాను. ఇవన్నీ ఏటిఒడ్డున కూర్చుని ఉన్నాయట.'

'కుక్క, పిల్లిని తరిమెయ్య లేదూ?' అని అడిగేడు జార్జ్.

'ఎలకను తినకుండా పిల్లి ఊరుకుందా?' అంది పాప.

'నక్క చిలకనుతినెయ్యలేదూ?' అని అడిగాడు బాబ్జీ.

'కథకు కాళ్లూ చేతులూ ఉండవంటారు, యిదేకాబోసు' అన్నాడు ఎంకటేశు.

ఇది కట్టు కథేంకాదు, కన్న కల. దీనికి కావలసినంత అవకాశం ఉంది. మీరు చెప్పినట్టు జరగవలసిందే. కాని వీళ్లతోపాటు ఒక మునికూడా అక్కడ ఉన్నాట్ట. జంతువులయినా అవి ఆముని పక్కని ఉండగా మాత్రం ఒకదాని నొకటి తినలేవు. ముని వెళ్ళిపోతూంటే చిలక దీనంగా పిలిచింది.

'నన్నిలా యీ నక్కకి అప్ప చెప్పి వెళ్ళిపోతావా మహామునీ! ఇదేనా నీన్యాయం?'

'నన్నేం చెయ్యమంటావ్?' అని అడిగాడుట ఆముని వీరుదాట బోతూ.

'నీతోపాటు నన్నూ అవతలొడ్డుకు తీసుకుపో' అంది చిలక. ముని ఒప్పుకున్నాడు.

'ఈ పక్షపాతం ఎప్పట్నుంచి మహానుభావా? అడగని వాడికి అన్యాయమేనా? పిల్లికి నన్ను చూస్తూ బలిచేస్తావా?' అంది అతి దీనంగా ఎలక.

'ఈ కుక్కకి నన్ను అర్పించి కైవాకి నువ్వు చూసుకుంటావన్న

మాట - నీయిష్టం అదే అయితే ఆ ప్రకారమే కానియ్యి' అంది మాయల మల్లి ప్రేమానుపిల్లి. మునీశ్వరుడు పిల్లి, ఎలకా, చిలకల్ని తనతో తీసుకుపోడానికి ఒప్పుకున్నాడు. నక్కా కుక్కా ఊరుకో లేదు.

'మా నోటికందుకూడును పడగొట్టి మమ్మల్ని అరణ్యంలో తిండి లేక చావమన్నావా మునీంద్రా? నీతవన్నూ నీకు చెప్పిన నీతి యిదేనా? మమ్మల్ని కూడా మనుషులున్న పట్నం చేర్చు. ఎవరిజోలికీ వెళ్లక ఎలాగో బతుకుతాము' మునీశ్వరుడు ఆలోచించి అందర్నీ తన కూడా తీసుకెళ్లడానికి ఒప్పుకున్నాడు. పడవ ఎక్కబోయాడు. ఆ పడవమీద ఇలా రాసుందిట. 'దీనిమీద ఒక మనిషీ రెండు జంతువులకన్న ఎక్కువ ఎక్కరాదు' అని.

'ఓహోహో! ఏం కలండీ! ఏం కోతలండీ! కాయ్‌కోయ్?' అన్నాడు ఓ సుబ్బారాయుడు. అందరూ అరగంట ప్రతిమాలగా జగ్గారావు మళ్లీ మొదలెట్టేడు.

'దీనినిబట్టి ముని తనతోపాటు ఏ రెండు జంతువుల్నో తీసికెళ్లి అవతల ఒడ్డున ఉంచి మళ్లీ వచ్చి మళ్లీ తీసుకెళ్లాలన్నమాట. ముని లేకుండా విరోధ జంతువుల్ని ఉంచడానికి వీల్లేదన్నమాట. ఉదాహరణకి నక్కనీ కుక్కనీ తీసుకువెళ్లామనుకో పిల్లి ఎలకను పట్టుకుంటుంది.'

'పిల్లి చిలకను తినదా?' అని అడిగింది పాప.

పిల్లికి యిష్టమైన ఎలకుందిగా! దానిమీద ధ్యానమేత మరేదీ తినదనే చెప్పొచ్చు? మునీశ్వరుడు పోనీ నక్కనూ ఎలకనూ వెంటపెట్టుకుపోతే కుక్క పిల్లిని నొక్కేస్తుంది. కుక్కనీ పిల్లినీ తీసుకుపోతే నక్క చిలకని చంపేస్తుంది. ఎలా మరి? ఇదే నా కొచ్చినకల. ఇదే నా సందేహం. ముని వాటిని అవతలొడ్డుకు చేర్చగలడా?' అని ముగించాడు జగ్గారావు. అందరూ ఆలోచనలో మునిగిపోయారు. ఎవరికీ ఏం తెలీలేదు.

'ఇలా రండర్రా నేను చెబతాను!' అంది అంతా విన్న అమ్మ. ఆ తర్వాత అమ్మ ముని వాటిని ఎలా తీసుకెళ్లడమో చెప్పింది. మీరూ లేవరైనా ప్రయత్నించి ఈ నక్కా, కుక్కా, పిల్లీ, ఎలకా, చిలకల్ని అవతలొడ్డుకు చేర్చగలరా? ★

## గతవారం సమస్యకు జవాబు

డిటెక్టివ్ సమస్యల్ని సాధించడానికి తార్కికజ్ఞానమూ, విజయపరిజ్ఞానమూ ఉండాలి. ఏ ప్రశ్నైనా జవాబు తెలుసుకోడానికి తగిన ఆధారం యిచ్చిన ప్రశ్నలోనే ఉంటుంది. ఆ ఆధారం, కిటుకూ ఎక్కడున్నాయో దానికి పట్టుకుని వాటిని తెలుసుకోడంలోనే ఉంది మన తెలివి.

శేషావతారాన్ని నేరస్థుడుగా నిరూపించడానికి జాకబ్ మూడు కారణాలు ఉన్నాయన్నాడు. ఆ మూడు కారణాలూ నేరం దృఢపరచేవి. దానికి ముందు కూడా కొంత ఆలోచించాలి. చుట్టూ కాంపౌండుగోడ ఎత్తుగా ఉంది. కిటికీ క్రిందుగా ఉంది. అందుచేత కాంపౌండు గోడ అవతలనుంచి, సరిగ్గా గురిచూసి కిటికీలోంచి కాల్చడానికి అవతలి వారికి అవకాశం లేదు. అంటే నేరస్థుడు లోపలే ఉండి కాల్చి ఉండాలి. ఇలా కాల్చింది శేషావతారమే అనడానికి యివిగో యివీ కారణాలు.

1. శేషావతారం 'మీరు వచ్చిన పదినిముషాలకే నేను వచ్చాను' అన్నాడు జాకబ్‌తో. కాల్చిన వేళకి తను అక్కడ లేనని చెప్పడానికి శేషావతారం ఆడిన అబద్ధం యిది. జాకబ్ ఎప్పుడు వచ్చాడో, (లోపల మునిదే ఉండకపోతే) శేషావతారానికి అంత సరిగా ఎలా తెలిసింది?

2. మెయిన్‌గేటుముందు రోడ్డు తారు వేస్తున్నారని కథలో యివ్వబడింది. ఆ మెయిన్‌గేటులోంచే వెళ్లివచ్చానని శేషావతారం చెబుతున్నాడు. అలా అయితే సైకిలు టైర్లకి తారు, కొత్తగా వేస్తున్నది, అంటుకోవద్దా? సైకిలు టైర్లు జాకబ్ చూస్తే కొత్తగా ఎందుకున్నాయి.

3. పోనీ కొత్తసైకిలుకదా అని శేషావతారం ఆ తారురోడ్డు ఉన్నంత మేరా సైకిలు ఎత్తుకొని వచ్చాడంటే, అతనిబూట్లు ఎలా ఉండాలి? వాటికి తారు అంటుకోవద్దా? అలా లేదేం మరి?

వీటినిబట్టి తెలుస్తున్నది శేషావతారం మెయిన్‌గేటుదాటి బయటకు వెళ్లలేదనీ; దొడ్లో అంతా అడవిలా ఉందని యివ్వబడింది. కాబట్టి వెడతానని చెప్పి సైకిలుతోపాటు ఎక్కడో దాక్కుని పాపయ్యని కాల్చాడనీ; అందుకే జాకబ్ అరెస్టు చేశాడు. ★

# వనితాలోకం

# పాటలూ - పాటలగంధులు

'అమ్మమ్మా! నీవు ఏ బడికి వెళ్లావు? నీపలకా పుస్తకాలు ఎట్లా ఉండేవి?' అని అడిగితే ఈ తరము అమ్మమ్మలు వాటి స్వరూపాన్ని గురించి కొంతయినా చెప్పగలుగుతారేమో; కాని క్రిందటి తరములో అమ్మమ్మలు చెప్పలేరు. ఆ తరము వారికి గ్రామగ్రామములో పాఠశాలలు ఉపాధ్యాయుల సౌకర్యాలు ఉన్నాయా? ఒకవేళ ఎక్కడైనా ఉన్నప్పటికీ ఆ పాఠశాలలకు ఆడపిల్లలను పంపేవారు కారు. చాకలిపద్దుకోసము వ్రాయటము చదవటము గుణకారము వస్తే చాలునని ఇంట్లోనే అక్షరమ్ముక్కలు దిద్దబెట్టేవారు. కుంచెడంత కూతురుంటే తల్లికి మంచముదగ్గిరే భోజనము. తొలిచూలు ఆడపిల్లయితే తల్లికి ఆసరా—మగబిడ్డయితే తండ్రికి ఆసరాగా భావించేవారు. ఆడపిల్ల పనిపాటల్లో తల్లికి చేదోడుగా ఉండి తమ్ముళ్లకూ చెల్లెళ్లకూ సంరక్షణకూడా చేసేది.

'పనీపాటా' అన్న జంటపదములో పాట అన్నది ఊతపదముకాదు. నిజమయిన పాటే. ఈ పాట త్యాగరాజ సంగీతముగాని లలిత సంగీతముగాని, అధ్యాత్మ రామాయణ కీర్తన అష్టపదికాని కాదు-ఆ కాలములో పాటయొక్క అర్థము స్త్రీలపాటలని. ఈ పాటలనుండే పుణ్యమూ, పురుషార్థమూ సాధించేవారు. సాహిత్యము, చరిత్ర, ప్రకృతిశాస్త్రము, గృహవైద్యము పరంపరాగతమైన ఆచార వ్యవహారాలు-ఒకటేమిటి-సకలశాస్త్రాలు ఈ పాటలనుండే గ్రహించేవారు. ఈ పదాలను పాటలను ఒక విద్యాపీఠముగా భావించేవారు.

మానవ హృదయము రసానుభూతికి పరితపించిపోతుంది. ఈ రసానుభూతి కోసము విద్యాధికులు పద్య కావ్యాలను ఆశ్రయించితే పామరులు గేయ కవిత్వాన్ని ఆశ్రయించారు. సాహిత్యముయొక్క ప్రయోజనము ప్రజలకు సన్నిహితమై, వారికి హితము కూర్చటము కనుక, ఆముక్తమాల్యద, వసుచరిత్ర సారస్వతమన్నట్లే, పదకవిత్వము కూడా దానిలో ఒక భాగమే అన్నారు సాహితీపరులు. భాషా తత్వవేత్తలు మరికొంత ముందుకుపోయి పద్యకవిత్వముకంటె పదకవిత్వమే ముందు తెలిసిందన్నారు. ఈ గేయవాఙ్మయమును కూడా మూడు భాగాలు చేయవచ్చు పురుషులకు, స్త్రీలకు, బిడ్డలకు అనువైనవిగా విడదీయవచ్చు. యక్షగానాలు జంగము కథలు బుర్రకథలు మొదలయినవి పురుషుల కుపయుక్తమైనవి; వారిలోనే ప్రచారమయినవి. వీటిలో వీరసాహస కృత్యాలు యుద్ధవిశేషాలు అధికముగా ప్రకటితమవుతాయి. మృదుత్వము, రామణీయకత, శృంగారము జీవితానందము మొదలయినవి స్త్రీల పాటలలో అధికముగా ప్రకటితమవుతాయి. జాబిల్లిపాటలు, ఆటపాటలు, పిట్టకథలపాటలు పసిహృదయాలను రంజింపచేసేవిగా ఉంటాయి.

సంగీతమూ, సాహిత్యమూ కలిస్తేనేగాని సరస్వతీదేవి సంపూర్ణ స్వరూపము కాజాలదని పెద్దల ప్రవచనము. ఈపదకవిత్వము సంగీత సాహిత్యమయమైనదే కాకుండా, లలితపద భూయిష్ఠమై, పండితులకు ఆశ్చర్యము గొలుపుతూ, పామరులకు హృదయానందాన్ని కలిగిస్తున్నది. ఈశాఖలో చేరిన స్త్రీలపాటలు మృదుమధురముగా ఉండి, ఆనంద రసానుభూతిని కలిగిస్తాయి.

కావ్యాలు కాంతా సమ్మితాలయితే ఈ గేయాలు ప్రియరమణీ సమ్మితాలవటములో ఎంతమాత్రమూ అతిశయోక్తి లేదు.

స్త్రీల పాటలకు ఈమాధుర్యము ఎట్లా వచ్చింది? మానవజీవితములో మధురానుభూతికి చెందిన భాగము స్త్రీసహితమైనది. స్త్రీల లీలావిహారమంతా గృహసీమలోను పుష్పోద్యానవనాలలోనే. ఈపరిమితులలోనే సుందర సన్నివేశాలను, రమణీయమైన కథాఘట్టాలను, కల్పించుకొని అలౌకికమైన ఆనందరసానుభూతిని పొందిన స్త్రీపురుషుల జీవితాలు ఆపాటలలో వర్ణింపబడి ఉండటమే ప్రధాన కారణము.

కావ్యాలలో నాయికా నాయకులు కేవలము మానవులు. అనేక లక్ష్య లక్షణాలు గలవారు. వారు సామాన్యుల హృదయాలలో చొరబడలేరు. ఈపాటలలోని నాయికా నాయకులు ప్రజల కత్యంత ప్రీతిపాత్రములయిన రామాయణభారత మహాకావ్యాలనుండి దిగివచ్చిన దైవమానవపాత్రలు. వీటి ఇతివృత్తం

ఇల్లిందల సరస్వతీదేవి

సాంసారికమైనది. సార్వజనీనమూ అతి సుందరమూ అయిన భావన, సుందరమూ కానిపోయే అనుభవ గర్భిత పదజాలము, నైసర్గికమైన సంగీతమూ వీటి మాధుర్యానికి కారణాలు.

ఈ పాటలలోని సాంఘిక జీవనము అకృత్రిమమూ అతి సహజమూను. ఇవి సాంఘిక జీవితానికి కుటుంబ జీవితానికి ప్రతిబింబాలు. భారతీయుల నాగరికతకూ, సంస్కృతికీ ఈ పాటలు మూలాధారము. వీటిలో గృహిణి ఆశలూ, ఆశయాలు, జీవితానందము, వాటికి సంబంధించిన వాతావరణమూ తప్ప మరొకటి ప్రవేశించదు. ఇవి గృహారామముచుట్టూ అల్లుకొని రామణీయకతనే వర్షిస్తూ చల్లని వెన్నెలలు కురిపిస్తూ ఉంటాయి. మాండలికపద భేదముతో, వ్యావహారిక భాషా ప్రయోగాలతో, మేలిముత్యాల సోహళింపువంటి శైలిలో అనాయాసకరమైన రాగాలలో పాడుకోవటానికి వీలైనవీ పాటలు. స్త్రీలు గృహకృత్యాలు నెరవేర్చుకొంటూ పాడుకోవటానికి అనువైనవి. ఈ పాటలు పాడేవారికి ఆరసోద్యోగములో శ్రమను మరపించగలిగిన తన్మయత్వము కలుగుతుంది; ఉత్సాహమూ, శక్తి ఇనుమడిస్తాయి.

స్త్రీల పాటలలో జోలపాటలూ, లాలిపాటలూ పరమేశ్వరాంకితాలు. బిడ్డను తొట్టిలో పరుండపెట్టట మన్నది బీజప్రాయమై- పుణ్యపురుషుల జననోత్సవ కీర్తనకు ఆకరమైనది.

వనుజేవ పుత్రుడమ్మా,
ఈ బిడ్డ వైకుంఠవాసుడమ్మా,
నవనీత చోరుడమ్మా,
ఈ బిడ్డ నందగోపాలుడమ్మా!

శ్రీకృష్ణ జననములోని ఈ పాదాలను పాడుతూ ప్రతి తల్లి తన బిడ్డ నందకిశోరుడనుకుంటుంది.

'గోరంత దీపమ్మ కొండల్ల వెలుగు
గోపాల కృష్ణమ్మ గోవులకు వెలుగు
మాడంత దీపమ్మ మేడల్ల వెలుగు
మా చిన్ని అబ్బాయి మాకళ్ళ వెలుగు.'

ఆ చిన్ని అబ్బాయి కళ్ళకేకాదు - ఆమె జీవితానికే వెలుగు. బాలగోపాలుడివలె తన బిడ్డ శిరమున చింతామణి, ఫాలంమీద నక్షత్రము, కండ్లను వరగు నేది, భుజమందు శంఖచక్రాలు, వీపున వింజామర, బొడ్డున పారిజాతము, అరకాళ్ళ పద్మాలతో జన్మించినట్లు భావించి మురిసిపోతుంది. గోపమ్మవలెనే 'ఇంత చక్కని నాయనకు ఇరుగు పొరుగుల దృష్టి తగులుతుందేమో'నని వెరచి 'బంగారు నాయనను' గడపదాటనీయదు. జోలపాటలలో వేదాంత తత్వసారము కూడా మాటలలో తేల్చి చెప్పినట్లుంటుంది. పాపడి ఉయ్యాల బ్రహ్మాండమంతటిది. దానికి నాలుగు వేదాలనే గొలుసులు. ఫణిరాజు పాన్పు. తత్వమసి పొత్తిళ్లు. దానిమీద పాపడి పవళింపు. ఏడు లోకాల వారు వీకమయి, నవరంధ్రాలతో కూడిన ఈ దేహములో కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యములనే అరిషడ్వర్గములను అరికట్టి, పంచేంద్రియాలను నిగ్రహించి, సత్వరజస్తమోగుణాలను కట్టడిచేసి, హృదయ కమలములో పరమాత్మను నిలుపుకొనమని గానము చేస్తారు. అఖండమైన ఆత్మసంతృప్తిని జీవుడికి కలిగించటానికి మధురస్వరంతో మంగళకరమైన రాగములో, మృదు మధుర గాథలను మానవధర్మాలను భగవదవతార ఘట్టాలను పదిమంది బిడ్డలను గన్న మాతృదేవత లందరూ కలిసి కిన్నరకంఠాలతో గానముచేస్తారు. మానవస్వభావములోని బలహీనతను అరికట్టేమార్గాలను బోధిస్తూ ఆ పసిబిడ్డకు అప్పటినుండీ ఆధ్యాత్మిక చింతనమును బోధిస్తారు. ఈ పాటలలోని వీరులగాథలను, భగవచ్చరిత్రలను విన్న పాపడు, ప్రహ్లాదుడంతటి పరమ భాగవతోత్తముడు కావలెనని ఆ మాతృదేవతల ఆశయము. ఇది భ్రమరకీటక న్యాయము వంటిది.

బంతుల పాటలు, బూతంబంతి పాటలు, నలుగుపాటలు వేడుకకు సంబంధించినవి. వదునపాటలు కూడా అంతే. మన కుటుంబ సంబంధమైన, బాంధవ్యాలలో బావమరదండ్రదీ వదినె మరదులదీ విచిత్రమయినవి. వారిది ఒకయింటిలో సన్నిహితముగా మెలగవలసిన బాంధవ్యము; పరస్పర తమ్యము అంతగా లేనిది; పరస్పరాకర్షణకు ఆకరమైనది. కాని వారందరూ సంఘు కట్టుబాట్లకులోనై, వివాహబంధమనే ముడికట్టు కాని, దూరదూరముగా ఎవరి హద్దులలో వారు మసలుకొంటారు. కాని హృదయములోని భావసంచలనాన్ని వావి వరుసలతో వినోదము, పరిహాసము పేరిట వ్యక్తము చేసుకొని మనసులను శాంతపరచుకొంటారు. పదిమందిలో వినోద కాలక్షేపము పేరిట అసూయా జుగుప్సలను మనసుల నుండి పెకలించి బహిర్గతముకావించి చల్లటి పూతలు పూస్తారు.

తలుపుదగ్గర పాడే పాటలలో మేలుకొలుపులలో శృంగారమే పైకి కనబడుతుంది కాని, మేలుకొలుపు పాటలలో పాపమార్గమున పడిపోకుండా జీవుడు హెచ్చరింపబడుతాడు; తలుపుదగ్గర పాడేపాటలలో జీవుడు ముక్తికాంతను కవాటము తెరవమని ప్రాధేయపడి వేడుకొంటాడు.

అప్పగింతల పాటలు కరుణరస ప్రధానమయినవి. ఆడపిల్ల అత్తవారింటికి వెళ్ళేటప్పుడు తలిదండ్రులే కాకుండా ఇతరులు కూడా గంపల తలాపుల్ని మోయగా. కాని తలిదండ్రులు కన్నీళ్లు కారుస్తూ తమ కర్తవ్యాన్ని విస్మరించరు.

'మెల్లగా సేర్పుతో మనిసేర్పుమమ్మ
అకలెరుగదు అన్నంబు పెట్టినదాక
అడపోయిన రోజు అపైనంటేను
మెల్లగా సేర్పుగా మీరమ్మ'

అని వియ్యపురాలికి వినూత్నమైన అప్పగింతలు ఈ నాటినుంచే ఈ పట్టి మీ పట్టిగాని మా పట్టికాదు' అని చేతిలో చెయ్యి వేయించుకొంటారు. బిడ్డకు బాలుకు పిలిచి:

'భూమిాకన్యక బుద్ధి కలిగుండు
అత్తమామలకెల్ల అడుగు దాటకుమీ
పలుమారు వల్లెత్తి నవ్వబోకమ్మ
విభుడు మన్నించెనని విర్రవీగకుమమ్మ
పలుమారు మామీద ప్రేమలుంచకుమీ'

అని బుద్ధులు చెప్పి, 'పుట్టిల్లు కాదమ్మ పాలకుల కవని—అత్తిల్లు నిత్యమ్మ అబలల కెప్పుడు' అని సాగనంపుతారు. ఒకపాదులో పెరిగిన మొక్క మరొక పాదున నాటబడుతుంది. ఇది స్త్రీ జీవితములో ప్రధానమైన ఘట్టము. అత్తవారింటిలో అందరూ ఒక ఎత్తూ—పెనిమిటి ఒకడూ ఒక ఎత్తు. అతడు సన్మార్గుడు కానీ—దుర్మార్గుడుగానీ దైవసమానుడు. అతడి కనుసన్నలలో మెలగి, తన త్యాగముచేత ఓరిమిచేత అతడి హృదయములో స్థానము సంపాదించుకోవటము భారతీయ గృహిణీ ధర్మము.

స్త్రీలు విరామసమయములో పాడుకొనె పాటలు దీర్ఘమైనవీ, సుదీర్ఘమైనవీ కూడా ఉన్నాయి. ఈ పాటలు విడివిడిగా గానీ ఇద్దరూ ముగ్గురూ కలసి గానీ ముక్తకంఠాలతో గానము చేస్తుంటే శ్రోత్రపేయముగా ఉంటుంది. కొత్త కోడలు కాపురానికి వచ్చిన తరువాత కొద్ది కాలానికి పట్టితల్లి కాలేదని ఇరుగుపొరుగు బుగ్గలు నొక్కుకుంటారు. అంతలోనే వారిలో గుసగుసలు బయలుదేరుతాయి. మరికొన్నాళ్ళకు ఆ తరుణిని నిలవదీసి అడుగుతారు. ఆమెకళ్ళతోనే జవాబిస్తుంది. ఈ లోపల తెలుపెక్కిన ఆమె చెంపలు భర్తను కలవరపరుస్తాయి. శ్రీరామచంద్రుడు సీతాదేవిలో కలిగిన మార్పును తమ్మునితో చెప్పకొని విచారపడుతాడు ఈ క్రిందిపాటలో!

అన్న ! మీా వదినె బడలి ఉన్నాది
కారడవి తిరిగింది కష్టపడ్డాది
ఆ నాడు ఈ రీతి వడిలుండలేదు
అడవులన్నీ తిరిగి ఆకు భక్షించిన
ఆ నాడు ఈ రీతి వడిలుండలేదు
పండుటాకువలె పాలి ఉన్నాది
పొరుటాకువలె పవళించి ఉన్నాది
నా చేతి నొక్కటి ముద్దుటుంగరము
[illegible]

# ★ పాటలూ - పాటలగంధులు ★

అని వాపోతాడు. క్రమముగా తనకంటె ఘనులు రఘువంశములో ఉద్భవించనున్నారని తెలిసికొంటాడు. ఒక్క ఉదుటున అంతఃపురప్రవేశము చేస్తాడు—చిరునవ్వులలో విగ్గద్గొంతరలు అతడికి మైమరపు కలిగిస్తాయి. ఇది సీతాదేవి వేవిళ్లపాట.

రావణ వధానంతరము వెన్నెల బయటున తీర్చిన నిండుకొలువులో, శ్రీరామచంద్రుని సన్నిధిలో 'లక్ష్మణస్వామి' నవ్విన నవ్వు సభ్యుల కేకలకు ఆత్మపరీక్షకు ఆకరమైనది. వారందరూ 'నీ గుపడి' తలలు వంచుకొంటారు. పాపమతడు వీరందరినీ చూసి నవ్వలేదు. పద్నాలుగేళ్ళ వనవాసములో అన్నా వదినెల పాదసేవ చేస్తూ, ఒక్కనాడయినా కన్నుమూసి ఎరుగడు. అయోధ్యకు తిరిగి వెళ్ళిన తరువాత తనను ఆవహించ వలసినదని నిద్రాదేవికి ఆన పెట్టాడు. అతడు పెట్టిన గడువు పూర్తి అయినది కాబోలు ఆ నిండు కొలువులో వున్న లక్ష్మణస్వామిని నిద్రాదేవి ఆవహించింది. అతడికి నిద్ర తూగి కంటిమీదికి వచ్చింది. ఆసమయములో అతడు నవ్విన నవ్వు శ్రీరామచంద్రునకు ఆగ్రహ కారణమయినది; వెంటనే తమ్ముని తల నరకటానికి సిద్ధపడ్డాడు. ఆ సమయములో సీతమ్మ తన చల్లటిచేతితో వారించక పోయినట్లయితే భ్రాతృవధ జరిగిపోయేదే. చిదానముగా నవ్వుకు కారణము తెలిసికొన్న శ్రీరాముడు తన తొందరపాటుకు విచారిస్తాడు. అతడికి కన్నీరు జలజల రాలుతుంది. కంటిమీద కునుకు లేకుండా తనను సేవించిన సోదరుడి ఋణము తీర్చుకోవటము సామాన్యమా? తన తప్పిదాన్ని వసిష్ఠులకు తెలిపి పరిహారమేమని అడుగుతాడు. దీనికి పాదము లంటటమే పరిహారము - కాని - లక్ష్మణుడు చిన్నవాడు కనుక ప్రత్యక్షముగా అతడి పాదాలను శ్రీరాముడు అంటరాదు. లక్ష్మణస్వామి చిత్రాన్ని వ్రాయించి, ఆ చిత్రములోని పాదాలను శ్రీరామచంద్రుడు తాకి తనపాపము పోగొట్టుకోవచ్చునని గురువులు ఉపాయము చెప్పుతారు. ఇది లక్ష్మణ దేవరనవ్వు.

ఊర్మిళాదేవి నిద్ర, కుచ్చలకథ, సీతాకళ్యాణము, శ్రీరామ పట్టాభిషేకము, సీతారాముల వనవాసము, సీత అనవాళ్లు, సీత అగ్నిప్రవేశము మొదలైన రామాయణపు పాటలేకాకుండా ధర్మాంగద చరిత్రలం కా యాగము మొదలైనవి అనేకపాటలు ప్రచారములో వున్నాయి. స్త్రీలపాటలలో విడివిడి పదాలవంటి పాటలుకొన్నీ, కథాగేయాలుకొన్నీ ఉన్నాయి. ఈ పాటలన్నీ ఒక్కొక్కటి జాతిరత్నము - అణిముత్యము. ఈ పాటలలో స్త్రీ మూర్తి ఆదర్శగృహిణిగా, మాతగా, సోదరిగా మనకు సాక్షాత్కరిస్తుంది. ఆమె, సంభాషణాచాతుర్యము, "రసజ్ఞత, పెద్దలయెడ భయభక్తులు, పిన్నల యెడ మన్ననకల విజ్ఞాలు.

పద్య కవిత్వము లేనికాలములో వెలసిన ఈ పదకవిత్వము, వాక్సాహిత్యముగా ప్రజాసేవ చేసింది. ఆ కాలపు ప్రజాసాహిత్యమూ ఇదే ప్రచార సాహిత్యమూ ఇదే. ఈ వాఙ్మయాన్ని పునరుద్ధరించవలెనని పండితులు లేఖకులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పాటలలో రామాయణానికి సంబంధించిన పాటలను సేకరించి హైదరాబాదులోని ఆంధ్ర సారస్వత పరిషత్తు ఒక సంపుటిని ప్రచురించింది. మిగతా పాటలను కూడా సేకరించి ఈ విధముగానే సంపుటీకరించినట్లయితే వీటికి భద్రత కలుగగలదు. కాని ఈపాటలు ఆనోట ఆనోటపడి తప్పుల తడిక లయినవి. వాటిని కొంతవరకైన— (మూలము చెడకుండా) పరిష్కరించి సంపుటీకరించటానికి భాషాసంస్థలు పూనుకోవటము సమంజసము. పరిష్కరించబడిన స్త్రీలపాటలు ఇంటింటా ప్రతి బాలిక గానము చేయటమూ, బాలికల పాఠశాలలలో ఈపాటలకు స్థానము లభించటమూ నారీజనాభ్యుదయ కరములు.

భారతీయ నాగరికతకూ సంస్కృతికీ మూలాధారమైన ఈ పాటల కర్తృత్వము స్త్రీలదికానీ పురుషులదికానీ వారు సదా స్మరణీయులు. ★

## ★ నారీచోరుడు ★

(23-వ పేజీ తరువాయి)

వుంటే మీ యింట్లో శుభలేఖలకు తెచ్చిన కవరే కొట్టేసి ఎవరో ఉత్తరం అందులో పెట్టేరనుకునేవాణ్ణి కాని అలా లేదు. అందుచేత బుచ్చి ఆకవరు పసుపురాయక ముందే తీసేసివుండాలి. లోపల ఉత్తరం వ్రాసినకాగితం పుస్తకం మధ్య పెట్టి నున్నగా చేసిన దానిలా వుంది. ఉత్తరం వ్రాయడం తీరుకూడా అనుభవంలేకుండా డిటెక్టివ్ నవలలు చదివినతర్వాత వ్రాసినదానిలా వుంది. అందుచేత ఎవరో పెద్దవయసువాళ్లు కాక చిన్నవయసువాళ్లు వ్రాసిన ఉత్తరమేనని అనిపించింది. మీరు బుచ్చి మీగదిలోకి తొంగిమాడడం అదీ చెప్పేరు. అతణ్ణి అందుకే పిలిపించేను అనుమానంకొద్దీ. నా అనుమానానికి సరిపడ్డట్టుంది అతని వయస్సు, చలాకీతనం. దస్తూరీ పరీక్షిస్తే దొంగ దొరుకుతాడనీ, ఎలానూ మీరు పనుందని పిలిచేరనీ నాకవసరం లేకపోయినా కేరమ్సు కాయిన్స్ తెచ్చి పెట్టమన్నాను. అదృష్టవశాత్తు అతను నోట్సే తెచ్చేడు. నోట్సులో దస్తూరీ, ఉత్తరం దస్తూరీ బుచ్చి ఫలహారాలు తేవడానికి లోపలికి వెళ్లినప్పుడు చూసేను. కాని దొంగ దొరకలేదు. నోట్సుదస్తూరీ చాలా అందంగాను గుండ్రంగాను వున్న అక్షరాలతో వుంటే, ఉత్తరంలో కోలగా సన్నగా వున్నాయి అక్షరాలు. అంతేకాక ఉల్లిపార కాగితం అవడంమూలాన అక్షరాలు అలుముకుపోయాయి. దస్తూరీ పోల్చుకోవడానికి వీలయిందికాదు. తర్వాత ఊళ్లో వాళ్లెవరయినా పెంకితనానికి వ్రాశారేమో అని కొంతవరకు విషయసేకరణకు ప్రయత్నం చేసేను. కాని ఆ ప్రయత్నంవల్ల యీ పెళ్లి విషయంలోమాత్రం అటువంటి ఉత్తరాలు రావడానికి ఆస్కారం లేదన్న విషయం దృఢంగా తేలింది. యథార్థం చెప్పాలంటే మంగళసూత్రధారణ అయ్యేవరకు ఆ ఉత్తరం వ్రాసింది బుచ్చేనని ఖచ్చితమైన నిర్ణయం చేయలేకపోయేను. ఇప్పుడు మన సంభాషణ మొదలుపెట్టేటప్పుడు గుమ్మందగ్గర బుచ్చి తచ్చాడడం కనిపెట్టేను. మీ యింట్లోకూడా డిటెక్టివ్ నవలలు హెచ్చుగా వున్నాయి. అందువల్ల బుచ్చే ఉత్తరం వ్రాశాడని యిప్పుడు ఖచ్చితంగా ఎవరైనా చెప్పగలరు. డిటెక్టివ్ నవలలు చదువుతున్న రోజులలో మీ యింట్లో యీ పెళ్లి వచ్చింది. ఈ సమయంలో తన ఉత్సాహం తీర్చుకుందామని ఆ ఉత్తరం వ్రాసి, మీరు చూస్తారో చూడక ముందే యింకెవరైనా తీసేస్తారో అని అనుమానంకొద్దీ మీగదిలోకి తొంగిమాసేడు, మీరు మెలకువగా వున్నారో లేదో చూద్దామని. మీరు మెలకువగా వుండడాన్ని వెంటనే దొరికిపోకుండా 'కాఫీ తెమ్మంటారా' అని అడిగేడు. కాని సరదాకి చేసిన పనైనా చాల చాకచక్యంతో చేసేడుసుమండీ. తెలివైనవాడు. చదువులో యీ ప్రజ్ఞ వుంటే చాలా గొప్పవాడవుతాడు.

'చదువుతాడండీ. ఎప్పుడూ క్లాసులో ఫస్టు వాడే' అన్నాడు కృష్ణమూర్తి.


'అదేమిటి యింకా మావాడిమీద ఎగిరి యింట్లో చిందులు తొక్కుతారేమో అనుకుంటుంటే ఏమీ జరగనట్టు మావాడు మంచివాడులెండి అంటున్నారు' అన్నారు రామారావు.

'అప్పుడప్పుడు పైకి కోపం ప్రకటించినా వాణ్ణి ఏమీఅననండి, చిన్నతనంలోనే తల్లిదండ్రుల్ని లేకుండా చేసుకున్నాడు' అన్నాడు గద్గదస్వరంతో కృష్ణమూర్తి.

'మనమిక్కడ కబుర్లు చెప్పుకుని కూర్చున్నాంగాని యింకొక 'భయంకర నారీచోరు' డెవడైనాగాని పెళ్లికూతుర్ని ఎత్తుకు పోతాడేమో చూడండి. కథ 'ఓ హెన్రీయన్ డబుల్ ట్విస్ట్'లా కాగలదు' అన్నారు నవ్వుతూ రామారావు.

'ఇంక రెండురోజులలో పెళ్లికొడుకు ఎలానూ ఎత్తుకు వెళ్లిపోతాడు లెండి పెళ్లికూతుర్ని' అన్నాడు రమణ. అందరం విరగబడి నవ్వుకొన్నాం. ★

Printed and Published for Nageswara Rao Estates Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.



నదిపై షికారు

ఫొటో : క్రముద్దీన్ ఖాన్ — కటక్


రమేశ్ ఇంటికి వెళ్లుటకు భయపడ్డాడు...
నా బట్టలు మాపుకొన్నాను రామ్, మా అమ్మ నన్నిప్పుడు తిట్టుతుంది
రామ్ ఇంటివద్ద:
ఎందుకతనేడుస్తున్నాడు?
అతడింటికి వెళ్లుటకు భయపడుచున్నాడు, ఎందుకంటే అతడు తన బట్టలను మాపుకొన్నాడు
రమేశ్ ఇంటివద్ద:
మళ్లీ మురికిగా ఇంటికొచ్చావు! నిన్నింక యెప్పుడూ ఆటకు బైటకు వెళ్లనీయను!
ఈ బాలుని తిట్టకమ్మా-పిల్లలందరూ ఆడునప్పుడు మురికిగా నగుదురు
ప్రతిరోజూ వాడి బట్టలను ఉతుకుటకు చెమట వోడుస్తున్నాను వాటిని బాదుతూ అందుకని చాలాత్వరగా చిరిగి పోతున్నవి
అది నిజమే బాదుట బట్టల పోగులను తెంచును మరి అందువల్లనే బట్టలు త్వరగా చిరిగి పోవును
బాదబడినబట్ట పెద్దదిగా చూపబడినది
కాని మీరు సన్‌లైట్ సబ్బుతో ఉతికినప్పుడు బట్టలను బాదనక్కర్లేదు దాని సమృద్ధియైన నురగము రికి నంతటిని సులభంగాతొలగించును, ఆవిధంగా మీ బట్టలు చాలాకాలము మన్నును కూడ
అది నిజం! త్వరగా నురగను గలిగించు సన్‌లైట్ సబ్బు బట్టలను బాదకుండానే సరిగ్గా తెల్లగాను మరియు కాంతివంతముగాను ఉతుకును అంటే-బట్టలు చాలాకాలము మన్నును మరియు నాకు డబ్బు మిగులును
SUNLIGHT SOAP
సన్‌లైట్ సబ్బు
భారతదేశంలో తయారుచేయబడినది
బట్టలు చాలకాలము మన్నునట్లు చేయును
S 237-X62 TL